# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 6-9-2019 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 28 పేజీలు 8 వెల: రూ.1/-


## మహిళ దారుణ హత్య

### పెట్రోల్ పోసి తగులబెట్టిన దుండగులు

వికారాబాద్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): పరిగి మండలం రంగంపల్లి గేటు సమీపంలో దారుణం జరిగింది. పరిగి – కొడంగల్ ప్రధాన రహదారి పక్కన ఓ మహిళపై గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి తగులబెట్టారు. మహిళ శవాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాన్ని పరిశీలించారు. మహిళ వయస్సు దాదాపు 22–25 మధ్య ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మహిళను గుర్తించలేని స్థితిలో ఆమెను దుండగులు తగులబెట్టారు. ఈ ఘటన గత రాత్రి జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



రవీంద్రభారతిలో జరిగిన టీచర్స్‌డేలో గురువులను సన్మానించిన మంత్రి జగదీశ్వర్ రెడ్డి

## ఉపాధ్యాయ వృత్తిలో..

# గౌరవం, సంతృప్తి మరేవృత్తిలో ఉండదు

**– విద్యావ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నాం**

**– గురుకుల విద్యను ప్రోత్సహిస్తున్నాం**

**– తెలంగాణ విద్యాశాఖ మంత్రి జగదీష్ రెడ్డి**

**– ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించిన మంత్రి**

హైదరాబాద్, సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ) : ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నంత గౌరవం, సంతృప్తి మరే వృత్తిలో ఉండదని తెలంగాణ విద్యాశాఖ మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయులను రవీంద్రభారతిలో సత్కరించింది. పాఠశాల విద్య నుంచి 43 మంది, జూనియర్ కాలేజీల నుంచి 10మంది, ఎయిడెడ్ కాలేజీల నుంచి 5 మంది, డిగ్రీ కాలేజీల నుంచి 14 మంది, విశ్వవిద్యాయాల నుంచి 30 మంది ఉపాధ్యాయులు ఈ జాబితాలో ఉన్నారు. వీరిని ప్రభుత్వం తరఫున విద్యాశాఖా మంత్రి జగదీశ్ రెడ్డి శాలువాతో సత్కరించి, 10 వేల నగదు బహుమతి, బంగారు పూత పూసిన వెండి పతకం, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గురువులను గౌరవించడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఎప్పుడూ ముందుంటాడు. ఆయనకు విద్యాబుద్దులు నేర్పిన గురువులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. ఉపాధ్యాయులను మన దేశంలో చాలా గౌరవిస్తారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నంత గౌరవం, సంతృప్తి మరే వృత్తిలో దొరకదన్నారు. సమాజంలో గొప్ప వాళ్లను తయారు చేసేది ఉపాధ్యాయులు అన్న విషయం మరిచిపోకూడదు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థపై చాలా చర్యలు తీసుకుంటున్నామనీ, గురుకుల విద్యను ప్రోత్సహిస్తున్నామని ఆయన అన్నారు.విద్యావ్యవస్థపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని మంత్రి గుర్తు చేశారు. అవార్డు గ్రహీతలకు ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మంత్రితో పాటు విద్యాశాఖ కార్యదర్శి జనార్ధన్ రెడ్డి, పలువురు అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వేములవాడకు చేరిన కాళేశ్వరం జలాలకు పూజలు చేసిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్

# రూ.400 కోట్లతో వేములవాడ ఆలయ అభివృద్ధి

**– దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి**

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్5(నేటినిజం ప్రతినిధి) : తెలంగాణలోనే అతి పెద్ద దేవాలయమైన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి క్షేత్రాన్ని కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేస్తున్నామని అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు.

ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ తో కలిసి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి కాళేశ్వరం జలాలను మిడ్ మానేరు ద్వారా వేములవాడ గుడి చెరువులోకి గురువారం ఉదయం వదిలారు. పంప్ హౌజ్ వద్ద మోటార్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు.

అంతరం గుడి చెరువు వద్ద పూజలు చేసి గంగమ్మకు హారతినిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. రూ.400 కోట్లతో వేములవాడ ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు.

గుడి చెరువులోకి కాళేశ్వరం జలాలను తరలించడంతో పాటు మిని ట్యాంక్ బండ్ ను నిర్మించి సుందరీకరణ పనులు చేపట్టామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్, కలెక్టర్ కృష్ణ భాస్కర్, జెడ్పీ చైర్ పర్సన్ అరుణ, తదితరులు పాల్గొన్నారు.

అనంతరం తెలంగాణలో అతిపెద్ద శైవక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి గురువారం దర్శించుకున్నారు. మంత్రికి ఆలయ ఈఓ, అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు

. అనంతరం స్వామివారిని మంత్రి దర్శించుకున్నారు. మహామండపంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి ఆలయ ఈవో కృష్ణవేణి రాజన్న చిత్రపటం, ప్రసాదాన్ని అందజేసి సత్కరించారు. మంత్రి వెంట ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్, తదితరులు ఉన్నారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ మల్లెల సౌందర్యము లూ-
సల్లెలలో వాడ బడెడి పదసంపదలూ-
అల్లిక – దేశమును గాలుచు-
"అల్లాఉద్దీనుఖాను" కంజల చేయునే !!

( సెప్టెంబర్ 6 సంగీతవేత్త అల్లా ఉద్దీన్‌ఖాన్ పుణ్యతిథి)



–రాధశ్రీ

సెల్: 9494481210

## టీచర్లకు ప్రధాని మోడీ శుభాకాంక్షలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్5 (ఆంఎన్ఎ): ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ టీచర్లందరికీ శుభాకాంక్షలు తెలిపారు. తన ట్విట్టర్ అకౌంట్‌లో ఆయన ఓ వీడియోను కూడా పోస్టు చేశారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతినే మనం ఉపాధ్యాయుల దినోత్సవంగా జరుపుకుంటాం. ఈ నేపథ్యంలో రాధాకృష్ణన్‌కు మోదీ నివాళి అర్పించారు. రాధాకృష్ణన్ అత్యుత్తమ ఉపాధ్యాయుడన్నారు. ఓ మంచి మార్గదర్శకుడు కూడా అని తన ట్వీట్‌లో మోదీ తెలిపారు. టీచర్లకు వయసుతో సంబంధంలేదని, రిటైర్మెంట్ ఉండదని ప్రధాని తన వీడియో సందేశంలో చెప్పారు. ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించినా.. రాధాకృష్ణన్ మాత్రం ఓ శిక్షకుడిగానే ఉన్నారన్నారు. బోధనాతత్వాన్ని మరవనివారే మంచి టీచర్లు అవుతారన్నారు. మెరుగైన విద్యార్థులను తయారు చేస్తారన్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కూడా టీచర్లందరికీ గ్రీటింగ్స్ తెలిపారు.

## హైటెక్స్‌లో అగ్రిటెక్స్ ప్రారంభం

హైదరాబాద్,సెప్టెంబర్5 (ఆర్ఎన్ఎ): హైటెక్స్‌లో మూడు రోజుల పాటు జరగనున్న అగ్రిటెక్స్ 7వ ఎడిషన్ ఎగ్జిబిషన్ ను మంత్రి నిరంజన్ రెడ్డి ప్రారంభించారు. అగ్రిటెక్స్ 7వ ఎడిషన్ 3 రోజుల పాటు హైటెక్స్ ఎక్సబిషన్ సెంటర్ లో జరగనుంది. వ్యవసాయం, పాడి పరిశ్రమ, ఉద్యాన, ఫుడ్ ప్రాసెసింగ్, ఆక్వా కల్చర్, అంతర్జాతీయ మహా ప్రదర్శన జరగనుంది. యూకే, ఇటలీ, నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా నుండి పెట్టుబడిదారులు ఎగ్జిబిటర్లు సమావేశం కానున్నారు. మూడ్రోజు ల పాటు మార్కెట్ కు తగిన వ్యూహ నిర్మాణ అవకాశాలు సాంకేతిక అభివృద్ధిపై వివిధ దేశాల వ్యవసాయ నిపుణులతో సంప్రదింపులు, అధునాతన వ్యవసాయ అన్వేషణ, పాడి, ఫుడ్ ప్రాసెసింగ్, ఆక్వా కల్చర్, హార్టికల్చర్, విజ్ఞాన సదస్సులపై సమావేశాలు నిర్వహించనున్నారు.

## అఫ్ఘాన్‌లో మారోమారు రెచ్చిపోయిన తాలిబన్లు

### ట్రక్కు బాంబుతో భారీ పేలుళ్లు

కాబూల్,సెప్టెంబర్5 (ఆర్ఎన్ఎ): ఆఫ్ఘనిస్తాన్‌లో భారీ కారు బాంబు దాడి జరిగింది. కాబూల్‌లోని షాదారక్ ఏరియాలో ఈ ఘటన జరిగింది. ట్రక్కు బాంబుతో గ్రీన్ విలేజ్ కాంపౌడ్‌లో పేలుడుకు పాల్పడ్డారు. ఈ విషయాన్ని మంత్రి నుస్రత్ ధృవీకరించారు. ఆ ఏరియాలోని ఎన్డీఎస్ చెక్‌పాయింట్ వద్ద పేలుడు జరిగింది.

అత్యంత భద్రత కలిగిన ఈ ప్రాంతంలోనే అమెరికా ఎంబసీ కూడా ఉన్నది.

భారీ పేలుడు వల్ల సుమారు 12 వాహనాలు ధ్వంసం అయినట్లు తెలుస్తోంది. ఈ పేలుడుకు తామే బాధ్యులమంటూ తాలిబన్ ప్రకటించింది. ఎన్డీఎస్ ప్రాంతానికి వస్తున్న ఓ విదేశీ కాన్వాయ్‌ని తాలిబన్లను టా÷–గ్గ÷ట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ దాడిలో ఎంత మంది మరణించారన్న విషయం ఇంకా తెలియరాలేదు. సుమారు 30 మందిని హాస్పటల్‌కు తరలించినట్లు సమాచారం.

# ఘనంగా గురునానక్ జయంతి వేడుకలు

### శోభాయాత్రను ప్రారంభించిన కెటిఆర్

హైదరాబాద్,సెప్టెంబర్5 (ఆర్ఎన్ఎ): సిక్కుల మత గురువు గురునానక్ జయంతి వేడుకల్లో భాగంగా ప్రకాష్ ప్రభ్ యాత్ర నిర్వహించారు. అమీర్‌పేటలోని గురుద్వారాలో గురునానక్ ప్రకాష్ ప్రభ్ యాత్ర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ యాత్రకు హాజరయ్యారు. యాత్ర ప్రారంభం కంటే ముందు నిర్వహించిన గురునానక్ ప్రకాష్ యాత్రలో భాగంగా జరిగే 'నగర కీర్తన్' కార్యక్రమంలో కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. అనంతరం ప్రకాష్ ప్రభ్ యాత్రను కేటీఆర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున సిక్కులు పాల్గొన్నారు. మరోవైపు హైదరాబాద్ నగరంలో గురువారం భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఖైరతాబాద్ నుంచి కూకట్ పల్లి వరకు ట్రాఫిక్ జామ్ కావడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఖైరతాబాద్ వినాయకుడిని దర్శించుకోవడం కోసం భక్తులు భారీగా తరలి రావడంతో పాటు అమీర్ పేట నుంచి గౌలిగూడ వరకు గురునానక్ రథయాత్ర నిర్వహిస్తుండడంతో ట్రాఫిక్ జామ్ అయింది. ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. వాహనాలను ఎస్ఆర్ నగర్ నుంచి పంజాగుట్ట మీదకు దారి మళ్లించారు.



గురునానక్ జయంతిని పురస్కరించుకుని అమీర్‌పేట శోభాయాత్ర కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

# ముంబైని వదలని భారీ వర్షాలు

### రాకపోకలకు తీవ్ర అంతరాయం

### విమానాల రాకపోకలపై ఆంక్షలు

ముంబై,సెప్టెంబర్5 (ఆర్ఎన్ఎ): భారీ వర్షాలతో మహారాష్ట్ర మళ్లీ నీట మునిగింది. దేశ ఆర్థిక రాజధాని నగరమైన ముంబైని భారీ వర్షాలు ముంచెత్తాయి. నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురవడంతో లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి వరద నీరు చేరడంతో జనజీవనం స్థంభించింది. రవాణా వ్యవస్థ నిలిచిపోయింది.

పలు అపార్ట్‌మెంట్ల సెల్లార్లలోకి నీరు చేరింది. బహుళ అంతస్థుల భవనాల నుంచి నీరు జాలివారుతూ జలపాతాలను తలపిస్తోంది. దీంతో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. ముంబైలో వరదలు వెల్లువెత్తడంతో గురువారం కూడా ముంబై పరిసర ప్రాంతాల్లో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు ప్రకటించడంతో ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యగా నగరాల్లోని పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించిందని మంత్రి ఆశిష్ పేర్కొన్నారు. భారీవర్షాల వల్ల సియాన్, వడాల రోడ్డు రైల్వేస్టేషనుతోపాటు ముంబైలోని పలు లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు నిలిచి చెరువులను తలపించాయి. దీంతో రోడ్లపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వరదల వల్ల సాధారణ జన జీవనానికి అంతరాయం ఏర్పడింది. ముంబైలో కురుస్తున్న భారీ వర్షాలు విమానాల రాకపోకలపై ప్రభావం చూపిస్తోంది. ఎయిర్ పోర్టులను వరదలు ముంచెత్తడంతో ముంబైలో 20 విమాన సర్వీసులను రద్దు చేశారు. భారీవర్షాల వల్ల వాతావరణం అనుకూలించక పోవడంతో 280 విమానాల రాకపోకల్లో మార్పులు చేశారు. రోజు వెయ్యికి పైగా విమానాలు రాకపోకలు సాగించే ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇప్పుడు 44 శాతం విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. వాతావరణం అనుకూలించక పోవడం వల్ల పలు విమానాలు ఎయిర్ పోర్టులోనే చక్కర్లు కొడుతున్నాయి. విమానాల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు రాత్రి నుంచి ఎయిర్ పోర్టు ప్రాంగణంలోనే సేద తీరుతున్నారు.

ఇకపోతే ముంబైలో నయాగారా జలపాత అందాలను చూసి మైమరిచి పోతున్నారు స్థానికులు. కొండకోనలు, నదీ ప్రవాహాల దగ్గర మాత్రమే పరిమితం అయ్యే జలపాతపు అందాలు ఇప్పుడు కాంక్రీట్ జంగిల్‌లో కనువిందు చేస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో నలబై అంతస్తుల భవనం టెర్రస్‌పై నిలిచిపోయిన నీరు కిందకు జాలువారుతూ జలపాతపు అందాలను సంతరించుకుంది. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు స్మార్ట్ ఫోన్లకు పని చెప్పారు. వీడియోలు, ఫొటోలతో హడావుడి చేశారు. ఇప్పుడీ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ముంబై నయాగారా హ్యాష్ ట్యాగ్‌లతో హోరెత్తిస్తున్నారు నెటిజన్లు.

# బర్త్ డే కేక్‌తిని తండ్రీ, కొడుకు మృతి

**– అస్వస్థతతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లీ, బిడ్డ**

**– మెదక్ జిల్లాలో విషాద ఘటన**

**– బాబాయ్ శ్రీనివాసే కేక్‌లో విషం కలిపినట్లు అనుమానాలు**

**– అదుపులోకి తీసుకొని విచారిస్తున్న పోలీసులుు**

మెదక్, సెప్టెంబర్5(నేటినిజం ప్రతినిధి): పుట్టినరోజు కేక్ తిని తండ్రీ కొడుకు మృతిచెందిన ఘటన సిద్దిపేట జిల్లాలో తీవ్ర విషాదం నింపింది. కొమురవెల్లి మండలం అయినాపూర్‌లో రమేష్(39) అనే వ్యక్తి భార్య భాగ్యలక్ష్మి(35), కూతురు పూజిత(12), కుమారుడు రామ్‌చరణ్(9)తో కలిసి నివాసముంటున్నాడు. బుధవారం కుమారుడు పుట్టిన రోజు కావటంతో కుటుంబమంతా ఆనందంగా గడిపింది. సాయంత్రం సమయంలో రామ్‌చరణ్ బర్త్‌డే కేక్ కట్ చేసి కుటుంబసభ్యులకు తినిపించి తానూ తిన్నాడు. కాసేపటికే వారంతా వాంతులు చేసుకున్నారు. తండ్రి, కొడుకు వాంతులు చేసుకొని స్పృహతప్పి పడిపోవటంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. రమేష్, రామ్‌చరణ్ చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోగా. తల్లీకూతురి పరిస్థితి విషమంగా ఉండటంతో ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కాగా చిన్నారి పూజిత తీవ్ర అస్వస్థతకు గురికావటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పుట్టిన రోజు సంతోషంలో విషాదఘటన చోటు చేసుకోవటంతో కుటుంబంలో తీరనిశోకం మిగిలింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మరోవైపు కేక్‌లో విషం కలవడం వల్లే వారు చనిపోయినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆ కేక్‌ను రమేష్ తమ్ముడు శ్రీనివాస్ పంపించినట్లు తెలుస్తోంది. అన్నదమ్ములిద్దరికీ భూతగాదాలు నడుస్తున్నాయని, అన్న కుటుంబాన్ని అంతమొందించేందుకు అతడే కేక్‌లో విషయం కలిపి పంపించినట్లు అనుమానిస్తున్నారు.

# 'ఖేలో ఇండియా'

నేటినిజం
శుక్రవారం 6-9-2019

పతి 'ఆటల జాతర'కూ ఉత్తమ జాతిరత్నాలు పుట్టుకొస్తూనే ఉన్నాయి. కాకపోతే –స్వయం ప్రతిభతోనో, స్పాన్సర్ల సహకారంతోనే విశ్వ వేదికలనెక్కే అవకాశం దక్కుతోంది. క్రీడాసక్తి ఉన్నా ఆసరా దక్కక దిక్కులు చూసిన దీపా కర్మాకర్, హిమదాస్, స్వప్న బర్మన్ లాంటి ప్రతిభావంతులు కోకొల్లలు. మార్గనిర్దేశకత్వం, ప్రోత్సాహం, శిక్షణ, వౌలిక వసతులు కల్పిస్తే పతకాలు పండించగల మన్జీత్ సింగ్‌లకూ కొదువేం లేదు. పేదరికాన్ని, అనారోగ్యాన్ని అధిగమించి ప్రతిభకు సానపెట్టుకుని బరిలోకి దిగిన ప్రతిభావంతులు తాజా ఆసియా గేమ్స్‌లో తక్కువేం కాదు. కానీ, మన ప్రస్తుత పరిస్థితికి కారణం –మెరికల్ని ఎంపిక చేసి తగు శిక్షణతో విశ్వవేదికలనెక్కించే ప్రణాళికలు రూపుదిద్దుకోకపోవడం. క్రీడా సంఘాలు, సమాఖ్యలు సంకుచిత రాజకీయాలను వీడకపోవడం. దేశ రాజధానిలో పదోవంతులేని జపాన్, కొరియాలు పతకాల వేటలో వందలు దాటుతుంటే, అఖండ భారతావనికి పట్టుమని పది స్వర్ణాలు దక్కని దుస్థితికి కారణమిదే. భారత క్రీడా సామర్థ్య పరిపుష్టికి ప్రభుత్వం నుంచి కొత్తగా వినిపిస్తోన్న మాట 'ఖేలో ఇండియా'. 2024 ఒలింపిక్స్ నాటికి ప్రపంచం అబ్బురపడేలా పతకాలు సాధించాలన్నది ప్రణాళిక. ఇది వినసొంపుగా ఉన్నా, ఆచరణలోనే అనుమానాలు పుట్టలు వేస్తున్నాయి. 'ఖేలో ఇండియా' రూపకర్త నీతి ఆయోగ్ మాటల్ని క్షేత్రస్థాయి వాస్తవాలు వెక్కిరించడమే ఇందుకు కారణం. పాఠశాలలకు ఆటస్థలాలు లేవు. క్రీడాసామగ్రి కనుమరుగైంది. విద్యా హక్కు చట్టం ఆచరణలో చట్టుబండ అవుతోంది.

ఇదివరలో ఒకమారు విద్యార్థులు చదివే పాఠాలలో, ఆటలను అంతర్భాగం చేసి, వ్యాయామ విద్యకు పదును పెడతామంటున్న కేంద్ర క్రీడామంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ మాటలపైనా నమ్మకం కుదరకపోవడానికి కారణం గత అనుభవాలే. మట్టిలో మాణిక్యాలను వెతికిపట్టి తగు ప్రోత్సాహం అందించి, తగిన శిక్షణతో అంతర్జాతీయ స్థాయి అథ్లెట్లుగా రాటుదేల్చే పకడ్బందీ క్రీడావ్యవస్థే దేశానికి కరవైంది. ప్రస్తుత పతకాల పట్టికలో పతాక స్థాయిలో ఉన్న చైనా, జపాన్‌లు వచ్చే ఆసియా క్రీడలకు వేదికలవుతున్నాయి. పొరుగు మైదానాల్లోనే పోటెత్తిన ఆ రెండూ, సొంతగడ్డపై సునామీలు సృష్టించకపోవు. ఆ పరిస్థితిని ఎదుర్కోవాలంటే దృఢ లక్ష్యంతో దిద్దుబాటు చర్యలకు దిగక తప్పదు. ఆసియాడ్‌లో అధిగమించి ఒలింపిక్స్‌లోనూ సమధికం కావాలన్న పట్టుదలకు పదును పెట్టుకోక తప్పదు. అంతర్జాతీయ వేదికలపై దేశానికి క్రీడా ప్రతినిధులం కావాలన్న కాంక్షను పాఠశాల విద్యనుంచే ప్రేరేపించాలి. ఆ వాతావరణం నుంచి మెరికల్లాంటి పిల్లల్ని ఏరి, ఆసక్తి కనబర్చే క్రీడల్లో తర్ఫీదునిచ్చి సమస్తంగా ప్రోత్సహించేలా విధి విధానాల్ని ప్రక్షాళించాలి. ఆటల్ని ఆటవిడుపులా కాకుండా ఆర్మీలా అమలు చేసిన రోజున – లోకం చెవుల్లో భారత స్వర్ణభేరి రింగుమనకపోదు. భవిష్యత్ తరాలకు వీళ్లే గురువులు. క్రికెట్ మైకం వీడి సంప్రదాయ క్రీడలపై దృష్టి సారించే కుర్రతరానికి పెద్ద దేవుళ్లు. సందేహం లేదు.

# కేసీఆర్ అవినీతి, కుటుంబ పాలనను అంతమొందిస్తాం

**– యూరియా కొరతను సృష్టించి.. కేంద్రం, బీజేపీ ఎంపీలపై నిందలా?**

**– బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు లక్ష్మణ్**

**– బీజేపీ తీర్థం పుచ్చుకున్న ప్రకాశ్‌రెడ్డి, రవీంద్రనాయక్**

న్యూఢిల్లీ, సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ) : కేసీఆర్ అవినీతి, కుటుంబ పాలనను ప్రజల్లో ఎండగట్టి అంతమొందిస్తామని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. తెదేపా సీనియర్ నేత రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కాంగ్రెస్ నేత రవీంద్రనాయక్‌లు బీజేపీలో చేరారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు, కేంద్ర హోంసహాయమంత్రి కిషన్‌రెడ్డి, లక్ష్మణ్‌లు ఢిల్లీలోని బీజేపీ కార్యాలయంలో వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ. రాష్ట్రంలో యూరియా దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వర్షాలు కురవడంతో పంటలకు వేసేందుకు యూరియాకోసం సహకార సొసైటీలు, అగ్రికల్చర్ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా కొరతపై రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో స్పందించలేదని, టీఆర్ఎస్ ప్రభుత్వమే యూరియా కొరతను సృష్టించి.. కేంద్రం, బీజేపీ ఎంపీలపై నిందలు వేస్తోందని లక్ష్మణ్ మండిపడ్డారు. రాష్ట్రంలో బీజేపీ బలపడుతుంటే టీఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతోందన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ లభించడంలేదన్నారు. బీజేపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతున్నారని, కేసీఆర్ అవినీతిపై పోరాటం చేసి ప్రజల ముందు దోషిగా నిలబెడతామన్నారు. కేసీఆర్ అవినీతి, కుటుంబపాలనను అంతమొందిస్తామని లక్ష్మణ్ స్పష్టం చేశారు. టీఆర్ఎస్ కి ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదుగుతున్నాం కాబట్టే.. బీజేపీలోకి వలసలు పెరుగుతున్నాయని లక్ష్మణ్ అన్నారు. కేసీఆర్ ఇప్పటికైన ఫామ్ హౌస్‌ను వదిలి ప్రజల్లోకి రావాలని, రైతులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని లక్ష్మణ్ సూచించారు.

## విషజ్వరాలు ప్రబలుతున్నా..

# ఒక్క చావుకూడా లేదంటారా?

**– ఈటెల పార్టీ ఓనర్‌షిప్ పంచాయతీలో పడిపోయారు**

**– అందుకే ప్రజల ఇబ్బందులు కనిపించడంలేదు**

**– టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క**

హైదరాబాద్, సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ) : రాష్ట్రంలో విషజ్వరాలు ప్రబలుతున్నా.. ఒక్క చావు కూడా లేదని మంత్రి ఈటెల చెప్పడం దారుణమని కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈటల వ్యాఖ్యలపై మండిపడ్డారు. పాల్వంచ మండలంలోనే ఒక్క నెలలో 18 మంది చనిపోయారని, ఖాళీగా ఉన్న డాక్టర్, నర్సింగ్, ల్యాబ్ టెక్నికల్ సిబ్బంది నియామకాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. హాస్పిటల్స్‌లో బెడ్స్ లేక ఒకే మంచంపై ఇద్దరు పేషెంట్స్ ఉన్నారని, సిబ్బంది లేరన్నారు. కలెక్టర్లు స్పందించి హెల్త్ క్యాంపు పెట్టలేని పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని విమర్శించారు. పరికరాలు లేవని, పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో వాటితో రోగాలు వస్తున్నాయన్నారు. పార్టీ ఓనర్ షిప్ పంచాయతీలో పడి ఈటెల ఇవన్నీ మరిచిపోయారన్నారు. ఈటెల పార్టీలో ఒత్తిడికి గురై విషయాలు చెప్పడం లేదని భట్టి విమర్శించారు. రుణమాఫీ సకాలంలో చేయకపోతే రైతులు ఇబ్బంది పడుతారని తెలిపారు. రాష్ట్రంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అయినా సీఎం కేసీఆర్‌కు ప్రజల ఇబ్బందులు పట్టడం లేదని భట్టి విక్రంమార్క విమర్శించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు ఇబ్బందులు తీరుతాయని సోనియాగాంధీ రాష్ట్రాన్ని ప్రకటిస్తే, కేసీఆర్ కబ్జాచేసి సొంత కుటుంబ పాలనను సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పథకాన్ని ప్రారంభించడం దాన్ని దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నారని గొప్పలు చెప్పుకోవటమే టీఆర్ఎస్ నేతలకు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. ప్రచారంలో ఉన్నటువంటి శ్రద్ధ ఆచరణలో లేకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రచారాన్ని మాని సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలని టీఆర్ఎస్ నేతలకు భట్టి హితవు పలికారు.

# విమోచనోత్సవంపై రాజకీయాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 5:తెలంగాణ విమోచనోత్సవంపై వివాదాలు సద్దుమణగలేదు. ఏటా దీనిపై రాద్ధాంతాలు సాగుతూనే ఉన్నాయి. భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తరవాత ఓ ఏడాది ఆలస్యంగా తెలంగాణ విమోచన జరిగినా నేటికీ వివాదాలు సద్దుమణగడం లేదంటే అందుకు పాలకులే కారణం. ఏటా దీనిపై పెద్ద రాద్ధాంతమే జరుగుతోంది. అధికారంలో ఎవరు ఉన్నా విమోచనోత్సవాలను జరపక పోవడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. అయితే ఓటు బ్యాంక్ రాజకీయాలకు ఇది ఓ అస్త్రంగా మారింది. తెలంగాణలో ప్రతి ఏడాది సెప్టెంబరు 17 వస్తోందంటే చాలు మూడునాలుగు నెలల ముందు నుంచే విమోచన దినం జరపాలంటూ ఆందోళనలు మొదలవుతాయి. ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డ తరవాత ఎందుకనో టిఆర్ఎస్ ప్రభుత్వం దీని ఊసెత్తడం లేదు. దీంతో కమ్యూనిస్టులు, బిజెపిలు మాత్రమే విమోచనాత్సవాలను తమ పార్టీ కార్యక్రమాలుగా నిర్వహిస్తూ వస్తున్నాయి.

నిజానికి ఏ రాజకీయ నాయకుడైనా అధికారం దక్కేవరకు ఒకలా..దక్కినాక మరోలా ఉంటాడని భారత రాజకీయాలను గమనిస్తే అర్థం చేసుకోవచ్చు. అందుకు సిఎం కెసిఆర్ అతీతుడు కాదని కూడా నిరూపించుకున్నారు. తెలంగాణ ఉద్యమం జోరుగా సాగుతున్న వేళ విమోచనం దినం ప్రభుత్వమే నిర్వహించాలని కెసిఆర్ గట్టిగా డిమాండ్ చేశారు. కర్నాటక, మహారాష్ట్రల్లో నిర్వహిస్తున్నప్పుడు ఇక్కడ ఎందుకు నిర్వహించరని అన్నారు. అయితే ఆనాడు డిమాండ్ చేసిన మాట నిజమే అయినా, అప్పటి పరిస్థితులు, కారణాలు వేరని ఇప్పుడు గుర్తించి ఉంటారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత ఇప్పుడు విమోచనోత్సవానికి ప్రాధాన్యం లేదన్న భావనలో సిఎం కెసిఆర్ ఉన్నారు. అందుకే నాలుగేళ్లుగా ఏనాడు కూడా దాని జోలికి వెళ్లలేదు. అంతటితో ఊరుకోకుండా టిఆర్ఎస్ సెక్యులర్ పార్టీ అని, అన్ని మతాలు, కులాలను కలుపుకొని వెళుతున్నదని చాటుకున్నారు. ఆనాడు ఉద్యమంలో కొన్ని విషయాలు అప్పటి అవసరాలకు అనుగుణంగా ఉద్దేశపూర్వకంగానే మాట్లాడినట్లు ఓ సందర్భంలో కెసిఆర్ చెప్పారు.

అయితే నిజాంను పొగుడుతూ విమోచనదినం పక్కన పెట్టిన సిఎం కేసీఆర్ నిజాం మీద పోరాడిన వీరుల, కవుల, రచయితల జయంతులు, వర్ధంతులు ఘనంగా, అధికారికంగా నిర్వహిస్తున్నారు. కొమురం భీమ్, చాకలి ఐలమ్మ, దాశరథి, కాళోజీ, వట్టికోట ఆళ్వారుస్వామిలాంటి వారిని ఎందరినో స్మరించు కుంటూ ఘనంగా గౌరవిస్తున్నారు. నిజాం మీద పోరాడినందుకు వారిని గౌరవించడం అన్న విషయం తెలియకుండా వారిని తెలంగాణ వైతాళికులుగా కీర్తిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ బిడ్డలకు గౌరవం దక్కలేదని, ప్రత్యేక తెలంగాణలో వీరిని గౌరవించడం ధర్మమని చెబుతున్నారు. భారతదేశం బ్రిటిష్ పాలనలో మగ్గుతున్నప్పుడు దేశమంతా 550 పైబడిన సంస్థానాలతో రాచరిక వ్యవస్థ కొనసాగుతుండేది. రాచరిక పాలనలో ప్రజలకు ఎలాంటి స్వేచ్ఛా హక్కులూ ఉండేవి కాదు. ప్రధానంగా హైదరాబాద్ సంస్థానంలో 225 సంవత్సరాల సుదీర్ఘకాలం ఆసఫ్ జాహి వంశస్థుల రాచరిక వ్యవస్థ కొనసాగింది. దేశంలోని మిగతా సంస్థానాల కంటే భిన్నంగా విధివిధానాలు, చట్టాలు, స్వంత కరెన్సీ 'హాలీ సిక్కా' లాంటివి అమలులో ఉండేవి. హైదరాబాద్ సంస్థానం భారత్ యూనియన్‌లో విలీనం జరగడం, కెసిఆర్ నాయకత్వంలో మళ్లీ ప్రత్యేక తెలంగాణ ఏర్పడడం జరిగింది. అయినా విమోచన డిమాండ్ మాత్రం నెరవేరడం లేదు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక తాను స్వతంత్రంగా ఉంటానని లేదా పాకిస్తాన్‌లో కలుస్తానని, ఇండియన్ యూనియన్‌లో కలవనని హైదరాబాద్ నిజాం ప్రభువు మొండికేసిన విషయం తెలిసిందే. అయితే సంస్థానాలను విలీనం చేస్తూ వచ్చిన ఆనాటి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ నిజాంపై సైనిక చర్యకు దిగి దారికి తెచ్చారు. నిజాం రాష్ట్రంపై పోలీసు చర్య తీసుకొని దాన్ని 1948 సెప్టెంబరు 17న ఇండియన్ యూనియన్‌లో విలీనం చేశారు. దీంతో నియంతృత్వ, దుష్ట పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగింది. సాయుధ రైతాంగ పోరాటానికి ఫలితం దక్కింది. దాన్నే తెలంగాణ విమోచన దినం అంటున్నాం.

ఆ తరవాత ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ యూనియన్ విలీనం అయ్యాక ఆనాటి ఉమ్మడి రాష్ట్రంలో సిఎంలుగా ఉన్న ఆంధ్రా ముఖ్యమంత్రుల ప్రభుత్వాలు దీనిని పట్టించుకోలేదు. దీంతో తెలంగాణ ఉద్యమం నిర్వహిస్తున్నప్పుడు కేసీఆర్ విమోచన దినం నిర్వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో విమోచనోత్సవాలను జరపాలని టిఆర్ఎస్ అధినేతగా డిమాండ్ చేసిన కెసిఆర్, సొంత రాష్ట్రం ఏర్పడి సిఎం అయినాక కూడా గత పాలకుల విధానాలనే అనుసరిస్తూ వస్తున్నారు. అందుకే విమోచనోత్సవాలను జరపడం లేదు. ఉద్యమ సమయంలోనే ఓ పక్క విమోచన దినం నిర్వహించాలని డిమాండ్ చేసిన కేసీఆర్ నిజాంను, ఆయన పరిపాలనను గొప్పగా ప్రశంసించారు. బ్రిటిష్ వాళ్లను పొగిడినప్పుడు నిజాంను పొగడడంలో తప్పులేదని వాదిస్తూ వస్తున్నారు. నిజాంను ప్రశంసించిన కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు. విమోచన జరపాలని పోరాడుతున్న బిజెపికి కూడా ఇది తెలుసు. వారిది కూడా ఓట్ల రాజకీయమే అన్నది ప్రజలకు కూడా తెలుసు. అటు బిజెపి, ఇటు టిఆర్ఎస్ రెండూ విమోచన విషయంలో ఓటుబ్యాంక్ రాజకీయాలనే చేస్తున్నాయన్నది సామాన్యులకు తెలుసు.

## పెళ్లిని తప్పించుకునేందుకు..

# వరుడు కిడ్నాప్ డ్రామా!

**– గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారంటూ తల్లిదండ్రులకు సమాచారం**

**– పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు**

**– రంగంలోకిదిగి అంతా 'డ్రామా' అని తేల్చిన పోలీసులు**

హైదరాబాద్, సెప్టెంబర్5 (ఆర్ఎన్ఎ) : క్యాబ్ డ్రైవర్ తనను కిడ్నాప్ చేశారు.. తనను ఎక్కడో గుట్టల్లో పడేసి తన వద్ద డబ్బు దోచుకెళ్లారు.. అంటూ కుమారుడు ఫోన్‌చేసేసరికి ఆ తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తమ కుమారుడు కిడ్నాపయ్యాడని ఫిర్యాదు చేశారు. లండన్ నుంచి వస్తున్నాడని, శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి క్యాబ్‌లో వస్తుండగా క్యాబ్ డ్రైవర్ కిడ్నాప్ చేశారంటూ ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు అసలు విషయాన్ని గుట్టురట్టు చేశారు. పెళ్లిని తప్పించుకొనేందుకే ప్రవీణ్ కిడ్నాప్ డ్రామాను ఆడినట్లు గుర్తించారు.. ఈ ఘటన బుధవారం హైదరా బాద్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ కు చెందిన ప్రవీణ్ చెన్నైలో ఉద్యోగం చేస్తూ లండన్ లో ఉన్నట్లు తల్లిదండ్రులను నమ్మించాడు. పెళ్లి ఫిక్స్ చేసిన తల్లిదండ్రులు స్వదేశం రావాలంటూ ప్రవీణ్ కు సూచించారు. అయితే పెళ్లి ఇష్టం లేకపోవడం ఇదే సమయంలో తాను లండన్ లేనన్న విషయం ఎక్కడ బయట పడుతుందోనని ఆందోళన చెందిన ప్రవీణ్ కిడ్నాప్ డ్రామా ఆడాడు. లండన్ నుంచి తాను శంషాబాద్ ఎయిర్ పోర్ట్ కు వచ్చానని, దారి మధ్యలో ప్రైవేట్ క్యాబ్ డ్రైవర్ కిడ్నాప్ చేశాడని తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పాడు. రెండు లక్షల యూకే కరెన్సీ, బంగారం దోచుకున్నాడని వాపోయాడు. ప్రస్తుతం తాను గుర్తు తెలియని ప్రదేశంలో ఉన్నట్లు చెప్పాడు. ప్రవీణ్ ఫోన్ చేసిన వెంటనే అతడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రవీణ్ అసలు లండన్ వెళ్లలేదని తేల్చారు. చెన్నైలో ఉంటూ లండన్ లో ఉన్నట్లు కుటుంబసభ్యులకు నమ్మించాడని, పెళ్లి ఇష్టంలేక ఈ కిడ్నాప్ డ్రామా ప్రవీణ్ ఆడాడని పోలీసు విచారణలో వెల్లడైంది. దీంతో కుటుంబ సభ్యులు అవాక్కయ్యారు. ఇన్నాళ్లు తమ కుమారుడు లండన్‌లో ఉంటున్నట్లు అందరికీ చెప్పుకున్న ఆ తల్లిదండ్రులను తలదించుకొనేలా చేశాడు.

# కాంగ్రెస్ విమర్శలను కట్టిపెట్టాలి: చారి

హైదరాబాద్,సెప్టెంబర్5 (ఆర్ఎన్ఎ): ఎవరు ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారి అన్నారు. సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేనివిధంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు.

చేస్తున్న అభివృద్ధిని తట్టుకోలేక ప్రతిపక్షాలు ముఖ్యంగా కాంగ్రెస్ నాయకులు, ప్రొఫెసర్ కోదండరాం నిత్యం లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. పాలనలో లోపాలు ఉంటే ఎత్తి చూపండి.. సరిదిద్దుకుంటాం కానీ, పనిగట్టుకొని ఆరోపణలు, లేనిపోని ప్రచారాలు చేస్తే ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు చెప్పిన విషయాన్ని పదేపదే చెప్పడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. టీఆర్ఎస్ ప్రభుత్వానికి మరో 20 ఏండ్లు తిరుగులేదని పేర్కొన్నారు. అన్ని వర్గాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌తోపాటు వారి కుటుంబంపై ప్రతిపక్షాలు వ్యక్తిగత ఆరోపణలు చేయడం తగదని, వారి వైఖరి మార్చుకోవాలని సూచించారు .ఇప్పటికైనా కోదండరాం వైఖరి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ కుటుంబంపై లేనిపోని ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవుపలికారు.

## జార్ఖండ్‌లో దురాగతం

**మంత్రాల నెపంతో వ్యక్తి దారుణ హత్య**

రాంచీ,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): మంత్రాల నెపంతో 52 ఏళ్ల వ్యక్తిని గ్రామస్తులు కొట్టిచంపారు. ఈ దారుణ సంఘటన జార్ఖండ్ లోహర్‌దగా జిల్లాలోని జాల్జామేద్రా గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. సాహ్‌నాయి ఓరాన్(52) గత కొంతకాలం నుంచి మంత్రాలు చేస్తున్నట్లు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే గ్రామానికి చెందిన బీర్సా ఓరన్ అనే వ్యక్తి మరణించాడు. అయితే బీర్సా అంత్యక్రియలకు గ్రామస్తులంతా హాజరయ్యారు. కానీ సాహ్‌నాయి హాజరు కాలేదు. దీంతో అతనిపై మరింత అనుమానం వచ్చింది. బీర్సా మృతికి సాహ్‌నాయే కారణమని, అతను మంత్రాలు చేయడం వల్లే బీర్సా చనిపోయాడని గ్రామస్తులు భావించారు. బీర్సా అంత్యక్రియలు ముగిసిన అనంతరం గ్రామస్తులంతా సాహ్‌నాయిపై దాడి చేసి విచక్షణారహితంగా కొట్టారు. ఆ తర్వాత అతనిపై బండరాయి మోది హత్య చేశారు.

# ఆర్థిక మందగమనంపై శివసేన కీలక ప్రకటన

**మన్మోహన్ సూచనలు పాటించాలని కేంద్రానికి హితవు**

ముంబై,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): ఆర్థిక మందగమనం నేపథ్యంలో మాజీ ప్రధానమంత్రి, ఆర్థిక నిపుణుడు అయిన మన్మోహన్ సింగ్ సింగ్ సూచనలు పాటించాలని శివసేన సూచించింది. ఆయన మాటను వినాలని.. ఆయన సూచనలు పరిగణలోకి తీసుకోవాలని కేందప్రభుత్వాన్ని శివసేన కోరింది. తమ సొంత పత్రిక సామ్నాలో దీనిపై వ్యాసం ప్రచురించింది. దేశ ఆర్థిక వ్యవస్థ చాలా ఆందోళన చెందాల్సిన పరిస్థితిలో ఉందని.. గత వారం మన్మోహన్ సింగ్ చెప్పడం అంతటా చర్చనీయాంశమైంది. ప్రధాని మోడీ నిర్వహణ సరిగా లేకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని విమర్శించారు. జూన్ క్వార్టర్ లో వృద్ధిరేటు 5 శాతమే నమోదు కావడం.. ఏడేళ్లలో దేశంలోనే అత్యంత కనిష్టం అని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఆర్థిక వ్యవస్థకు ఊతం ఇచ్చే చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఐతే.. మన్మోహన్ విమర్శలను కేంద్రం తప్పుపట్టింది. ఈ పరిణామాల క్రమంలోనే.. బీజేపీ మిత్రపక్షమైన శివసేన స్పందించింది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ వ్యాఖ్యలను స్వాగతించింది. జాతీయ సమస్య కాబట్టి.. మన్మోహన్ సింగ్ సూచనలను కేంద్రం పట్టించుకోవాలని.. ఆయన విలువైన సలహాలు తీసుకోవాలని శివసేన సామ్నాలో కోరింది. దేశ ఆర్థిక వ్యవస్థ పతనం, కశ్మీర్ వ్యవహారం ఈ రెండు వేర్వేరు విషయాలు. దేశ ఆర్థిక వ్యవస్థను బాగుచేసే విషయంలో రాజకీయాలకు అవకాశం ఉండకూడదు. ప్రముఖ ఆర్థిక నిపుణుడు అయిన మన్మోహన్ సింగ్ లాంటి వారి సూచనలు దేశానికి చాలా అవసరం. దేశం కూడా మోడీ ప్రభుత్వాన్ని అదే కోరుతోందని సామ్నాలో శివసేన వ్యాఖ్యానించింది.

ఉదయ సాహితి కరీంనగర్ సౌజన్యంతో...
ఆహ్వానము
భవాని ప్రచురణలు ఆధ్వర్యంలో
అర్ధ శతాధిక కవి సమ్మేళనం - 2019
తేది : 08-09-2019 ఆదివారం, వేదిక : ఫిలింభవన్, కరీంనగర్.
ఉ॥ 9-30 నుండి 9-50 : కవుల నమోదు కార్యక్రమం
ఉ॥ 9-50 నుండి 10-00 : జ్యోతి ప్రజ్వలన (ముఖ్య అతిథిచే)
సభా కార్యక్రమం (ఉ॥ 10 నుండి 10-30 వరకు)
సభాధ్యక్షులు : డా॥ వైరాగ్యం ప్రభాకర్ గారు, ఉదయసాహితి అధ్యక్షులు, కరీంనగర్.
ముఖ్య అతిథి : శ్రీ జి.వి. శ్యాంప్రసాద్‌లాల్ గారు, సంయుక్త పాలనాధికారి, కరీంనగర్
ఆత్మీయ అతిథి : శ్రీ కళ్యాణం శ్రీనివాస్ గారు, యానిమేషన్ డైరెక్టర్ మరియు కార్టూనిస్ట్
కవి సమ్మేళనం
మొదటి ఆవృతం 10-30 నుండి 11 వరకు
నిర్వాహకులు : డా॥ కలువకుంట రామకృష్ణ గారు, ప్రముఖ కవి, ప్రిన్సిపాల్, ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ & పిజి కళాశాల, కరీంనగర్.
రెండవ ఆవృతం 11-00 నుండి 11-30 వరకు
నిర్వాహకులు : శ్రీ వేణుశ్రీ గారు, సహాధ్యక్షులు, సాహితీ గౌతమి, కరీంనగర్.
మూడవ ఆవృతం 11-30 నుండి 12-00 వరకు
నిర్వాహకులు : శ్రీ బుర్ర మధుసూదన్ రెడ్డి గారు, అధ్యక్షులు, తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం, కరీంనగర్.
నాల్గవ ఆవృతం 12-00 నుండి 12-30 వరకు
నిర్వాహకులు : శ్రీ మాడిశెట్టి గోపాల్ గారు, అధ్యక్షులు, సమైక్య సాహితి, కరీంనగర్.
ఐదవ ఆవృతం 12-30 నుండి 1-00 వరకు
నిర్వాహకులు : శ్రీ ఎ. గజేందర్ రెడ్డి గారు, అధ్యక్షులు, సమతా సాహితి, కరీంనగర్.
ఆరవ ఆవృతం 1-00 నుండి 1-30 వరకు
నిర్వాహకులు : శ్రీ అనుముల దయాకర్ గారు, అధ్యక్షులు, తెలంగాణ కళావేదిక, కరీంనగర్.
మ॥ 1-30 నుండి 2-00 భోజన విరామం
మధ్యాహ్న సభా కార్యక్రమం
సభాధ్యక్షులు : డా॥ వైరాగ్యం ప్రభాకర్ గారు, ఉదయసాహితి అధ్యక్షులు, కరీంనగర్.
ముఖ్య అతిథి : శ్రీ దేవులపల్లి ప్రభాకర్‌రావు గారు, అధ్యక్షులు, అధికార భాషా సంఘం, తెలంగాణ
విశిష్ట అతిథి : శ్రీ దాస్యం సేనాధిపతి గారు, ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు
ఆత్మీయ అతిథులు : శ్రీ దాస్యం లక్ష్మయ్య గారు, ఉదయ సాహితి వ్యవస్థాపకులు.
శ్రీ వైరాగ్యం లక్ష్మీభవాని గారు, ప్రధాన కార్యదర్శి, భవాని ప్రచురణలు, కరీంనగర్.
పుస్తకావిష్కరణలు
మ॥ 2-00 నుండి 2-15 వరకు
కవన మంజరి (కవి సమ్మేళనం - 2019)
తెలుగు సౌరభాలు (పద్య కవితా సంకలనం)
సందేశాలు
మ॥ 2-15 నుండి 2-45 వరకు
ముఖ్య అతిథి మరియు ఇతర ఆహ్వానితుల సందేశం
మ॥ 2-45 నుండి కవుల సత్కారం
సా॥ 5-00 వందన సమర్పణ.

# భారత్,రష్యాలది దృఢమైన బంధం

**ఇరుదేశాల మధ్య ఉన్నస్థాయి సమావేశం**

**పలుఒప్పందాలపై సంతకాలు**

**ప్రధాని మోడీకి ఘనంగా స్వాగతం పలికిన పుతిన్**

న్యూఢిల్లీ,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): భారత్-రష్యాలది దృఢమైన బంధమని ప్రధాని మోడీ అన్నారు. రష్యా పర్యటనలో ఉన్న ఆయన.. ఇరు దేశాల మధ్య స్నేహబంధం తన పర్యటనతో మరింత బలోపేతం కానుందని అన్నారు. రష్యా అత్యున్నత పౌర పురస్కారం తనకు ప్రకటించడంపై మోడీ సంతోషం వ్యక్తం చేశారు. పుతిన్ కు థ్యాంక్స్ చెప్పిన ఆయన ఈ గౌరవం 130 కోట్ల మంది భారతీయులకు గర్వకారణమైని అన్నారు. రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత ఎత్తులకు తీసుకెళ్లాలన్నారు మోడీ. అంతకుముందు వ్లాదివోస్టోక్ లో పుతిన్ తో కలిసి జ్వెజ్డా షిప్ బిల్డింగ్ కాంప్లెక్స్ కు ప్రధాని మోడీ వెళ్లారు. స్పెషల్ క్రూయిజ్ లో షిప్ బిల్డింగ్ కాంప్లెక్స్ ను సందర్శించారు. లోపల నౌకల తయారీని పరిశీలించారు. నౌకల నమూనాలను చూశారు. ప్రతీ స్పెసిమన్ గురించి మోడీకి పుతిన్ వివరించారు. అలాగే వ్లాదివాస్టోక్‌లో వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ సందంర్భంగా రెండు దేశాలు పలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. తనకు ఆహ్వానం పంపినందుకు పుతిన్‌కు కృతజ్ఞతలు చెబుతున్నట్లు మోదీ అన్నారు. 2001లో జరిగిన వార్షిక సమావేశాన్ని ప్రధాని మోదీ గుర్తు చేసుకున్నారు. అప్పటి ప్రధాని అటల్‌జీ బృందంలో గుజరాత్ సీఎంగా తాను ఇక్కడకు వచ్చినట్లు చెప్పారు. రష్యా, భారత్ మధ్య స్నేహబంధం రోజు రోజుకూ బలపడుతోందని మోదీ అన్నారు. చెన్నై నుంచి వ్లాదివాస్టోక్ మధ్య పూర్తి స్థాయి సముద్ర మార్గాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేస్తున్నట్లు మోదీ అన్నారు. అంతర్గత వ్యవహారాల్లో ఇతర దేశాల ప్రమేయాన్ని ఇరు దేశాలు వ్యతిరేకిస్తున్నట్లు మోదీ తెలిపారు. అంతకముందు జ్వెజ్దా షిప్‌యార్డ్‌ను మోదీ సందర్శించారు. ఈ షిప్‌యార్డుతో ఆర్కిటిక్ షిప్పింగ్ అభివృద్ధి చెందుతుందని మోదీ తన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. నౌకాశ్రయంలో ఉన్న అద్భుత టెక్నాలజీని పుతిన్ తనకు చూపించినట్లు ఆయన చెప్పారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా రష్యా వెళ్లిన ఆయనకు.. వ్లాడివాస్టోక్‌లో అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ నగరంలో పర్యటిస్తున్న తొలి భారత ప్రధానిగా మోదీ రికార్డులకెక్కారు. ఈ పర్యటనలో ఈస్టర్న్ ఎకనమిక్ ఫోరమ్‌లో మోదీ పాల్గొననున్నారు. దీంతో పాటు భారత-రష్యా 20వ ఆర్థిక సదస్సులో పాల్గొంటారు.




తెలంగాణలోని ప్రధాన ఆలయాల సమాచారానికి సంబంధించిన యాప్‌ను ప్రారంభించిన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి,

# ఆన్‌లైన్ సేవల్లోకి మరిన్ని ఆలయాలు

**యాప్ విడుదల చేసిన మంత్రి ఇంద్ర**

హైదరాబాద్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాల్లో భక్తుల సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి చెప్పారు. బొగ్గులకుంటలోని దేవాదాయ శాఖ కార్యాలయంలో కొత్తగా మరో 4 ప్రధాన ఆలయాల్లో ఆన్‌లైన్ సేవలను ఆయన ప్రారంభించారు. కొండగట్టు అంజనేయ స్వామి, ధర్మపురి లక్ష్మినర్సింహా స్వామి, వరంగల్ భద్రకాళీ, జూబ్లిహిల్స్ పెద్దమ్మతల్లి ఆలయాల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ఆలయాల్లో రోజురోజుకూ భక్తుల సంఖ్య పెరుగుతుందని, ఆలయాలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తొలివిడతలో యాదగిరిగుట్ట, వేములవాడ, భద్రాచలం, బాసర, మహంకాళి, బల్కంపేట, కర్మన్‌ఘాట్ ఆలయాల్లో ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని వెల్లడించారు. దీంతో మొత్తం 11 ప్రధాన ఆలయాల్లో ఆన్ లైన్ సేవలు అందుబాలోకి వచ్చాయన్నారు. 'మొబైల్ యాప్, మీ సేవా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా సుప్రభాతం, అభిషేకం, అర్చన, వ్రతాలు, హోమాలు, వాహన సేవలు, దర్శనం, గదుల బుకింగ్, ఇతర సేవలను పొందవచ్చని మంత్రి వివరించారు. ఆన్‌లైన్‌లోనే విరాళాలు చెల్లించవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో సేవలు అందుబాటులోకి తేవడం వల్ల భక్తుల విలువైన సమయం ఆదా అవుతుందని, పారదర్శకతతో పాటు దళారుల ప్రమేయం లేకుండానే సులభ దర్శనంతో పాటు ఇతర సేవలు పొందవచ్చని ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, అదనపు కమిషనర్ శ్రీనివాస రావు, సంబంధిత ఆలయ ఈవోలు, ఐటీ అండ్ సీ సిబ్బంది పాల్గొన్నారు.

# కంటోన్మెంట్ అభివృద్ధికి బిజెపి మోకాలడ్డు

**వచ్చే ఎన్నికల్లో టిఆర్ఎస్ గెలుపు ఖాయం**

**నేతలతో భేటీ అయిన కెటిఆర్**

హైదరాబాద్,సెప్టెంబర్5 (ఆర్ఎన్ఎ): సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభివృద్ధికి బీజేపీ అడ్డుపడుతోందని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కంటోన్మెంట్ బోర్డు మెంబర్లతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం నుంచి అనుమతులు రాక అభివృద్ధి కార్యక్రమాలు ఆగిపోయాయని తెలిపారు. గత ప్రభుత్వాల హయాంలో కంటోన్మెంట్ ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని, టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక కంటోన్మెంట్ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల్లో టీఆర్ఎస్‌దే గెలుపని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్ లో కంటోన్మెంట్ ఎంఎల్ఎ సాయన్న, బోర్డు సభ్యులతో టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సమావేశం నిర్వహించారు. కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల్లో విజయం, దీర్ఘకాలిక సమస్యలపై చర్చించారు. కేంద్ర రక్షణ శాఖ నిర్ణయాల్లో ఆలస్యం వల్ల కంటో న్మెంట్ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయాని బోర్డు సభ్యులు కెటిఆర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల్లో టిఆర్ఎస్ విజయం ఖాయామని ధీమా వ్యక్తం చేశారు. టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రజల అభివృద్ధికి అనేక కార్యక్రమాలను చేపట్టిందని చెప్పారు. కంటోన్మెంట్ బోర్డు, రక్షణ శాఖ పరిమితులతో అభివృద్ధి ప్రణాళికలను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లలేక పోతున్నామని కెటిఆర్ వెల్లడించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్కైవేల నిర్మాణం కోసం మంత్రులు, ఎంపిలు, అనేక సార్లు కేంద్రానికి విజ్ఞప్తి చేసినా స్పందించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి అనుమతులు వస్తే కంటోన్మెంట్ ప్రజల ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించే స్కైవేల నిర్మాణం ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు. స్కైవే లాంటి మౌలిక వసతుల కల్పనను కేంద్రం అడ్డుకుంటుందని, కంటోన్మెంట్ పేదలకు వైద్య సదుపాయం అందిస్తామని చెప్పినప్పటికీ సహకరించడం లేదని ఆయన చెప్పారు. డిఫెన్స్ ఆసుపత్రిని తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించాల్సిందిగా మరోసారి లేఖ రాయమని మంత్రి ఈటెలను కోరుతామని కెటిఆర్ తెలిపారు. రామన్నకుంట చెరువులోకి మురికి నీరు రాకుండా డైవర్షన్ పైప్ లైన్ల నిర్మాణానికి మున్సిపల్ శాఖ రూ.2.5 కోట్లతో ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసిందని ఆయన పేర్కొన్నారు. ఒకటి రెండు రోజుల్లో అనుమతులు ఇచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, పార్టీ పరంగా క్షేత్ర స్థాయిలో టిఆర్ఎస్ చాలా బలంగా ఉందని, కంటోన్మెంట్ ఎన్నికలు పార్టీ గుర్తుతో జరిగితే టిఆర్ఎస్ అఖండ విజయం సాధించే అవకాశం ఉందని కెటిఆర్ స్పష్టం చేశారు.

# కుటుంబం కోసం రాష్ట్రప్రయోజనాలు పణం

**-కెసిఆర్‌పై మండిపడ్డ మాజీ ఎంపి వివేక్**

పెద్దపల్లి,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ తుగ్లక్ అని తన, కొడుకు కేటీఆర్, కూతురు కవితల కోసమే ఉద్యమకారులను, పార్టీ సీనియర్లను పక్కన పెడుతున్నారని మాజీ ఎంపీ, బీజేపీ నాయకులు వివేక్ వెంకటస్వామి మరోమారు విమర్శలు గుప్పించారు. కటుంబం కోసం రాష్ట్ర ప్రయోజనాలు పణంగా పెట్టడం బాధాకరమన్నారు. ఇందుకు ఉదాహరణ.. ఈటెల రాజేందర్, హరీష్ రావులేనని అన్నారు. పెద్దపల్లిలో మాట్లాడిన వివేక్? కాళేశ్వరం ప్రాజెక్ట్ నీళ్లను మొదట రైతాంగానికి అందించాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి చివరి ఆయకట్టు రైతాంగానికి నీరందిస్తానని కేసీఆర్ గతంలో మాటిచ్చారని గుర్తుచేశారు దీంతో పాటే.. 12టి.యం.సి.లతో ధర్మారం పత్తిపాక రిజర్వాయర్ నిర్మిస్తామని తెలిపారని ఇప్పుడు దాని ఊసేలేదని అన్నారు. రిజర్వాయర్ నిర్మాణం కోసం ఈనెల 6వ తారీకున బీజేపీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి చలో ధర్మారం కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరు చెప్పి సి.యం. కేసీఆర్ వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని అన్నారు. ప్రాజెక్టుల రీడిజైన్ పేరుచెప్పి కమీషన్ల కోసం ఆంధ్ర కాంట్రాక్టర్లకు అప్పజెప్పారని తెలిపారు. దేశంలోనే తెలంగాణ ను సోలార్ రాష్ట్రంగా మారుస్తానని లోకల్ కాంట్రాక్టర్లకు కాకుండా కమీషన్ల కోసమే వేరే రాష్ట్రాల నుండి అధిక ధరలకు విద్యుత్ ను కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు.

## ఉత్పత్తి కేంద్రాలను మూసేయనున్న మారుతి

న్యూఢిల్లీ,సెప్టెంబర్5 (ఆంఎన్ఎ): మారుతీ సుజికీ సంస్థ తన వాహన ఉత్పత్తి కేంద్రాలను మూసివేయాలని నిర్ణయించింది. ఆర్థిక మాంద్యం నేపథ్యంలో మారుతీ వాహనాల అమ్మకాలు పడిపోయాయి. దీంతో గురుగ్రామ్, మనేసర్ ప్లాంట్లలో రెండు రోజుల పాటు ఉత్పత్తిని నిలిపివేయనున్నట్లు ఆ సంస్థ పేర్కొన్నది. ఈ నేపథ్యంలో బాంబే స్టాక్ ఎక్స్‌చేంజ్(బీఎస్ఈ)కి ఆ సంస్థ రెగ్యులేటరీ ఫైలింగ్ కూడా చేసింది. ఈనెల 7వ, 9వ తేదీల్లో ప్లాంట్‌ను మూసివేయనున్నట్లు చెప్పింది. ఆ రెండు రోజులు ఉత్పత్తి ఉండదని స్పష్టం చేసింది. ఆర్థిక మాంద్యం కారణంగా దేశవ్యాప్తంగా ఆటో ఇండస్ట్రీకి చెందిన పలు సంస్థలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. వాహనాల అమ్మకాలు పడిపోవడంతో.. ఆ పరిశ్రమలో పనిచేస్తున్న వేలాది మంది కూడా ఉద్యోగాలు కోల్పోతున్నారు.

## హాస్టల్ బిల్డింగ్ పై నుంచి పడ్డ విద్యార్థి

**తీవ్ర గాయాలు..ఆస్పత్రికి తరలింపు**

రంగారెడ్డి,సెప్టెంబర్5 (ఆర్ఎన్ఎ): బీటెక్ విద్యార్థిని హాస్టల్ బిల్డింగ్‌పై నుంచి పడిపోవడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. ఇబ్రహీంపట్నంలోని గురుణానక్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న సౌమ్య కాలేజ్ హాస్టల్ బిల్డింగ్ 3వ అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కింద పడిపోయింది. తీవ్ర గాయాలు కావడంతో సౌమ్యను హుటాహుటిన చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ నిర్వహిస్తున్నారు. సౌమ్యది ఆత్మ హత్యా? లేదంటే కాలు జారిపడిందా అన్న కోణంలో పోలీసులు విచారణ నిర్వహిస్తున్నారు. ప్రమాదవశాత్తు జరిగిన ఘటనా కాదా అన్నది విచారిస్తున్నారు

## కశ్మీర్‌లో చొరబడ్డ ఉగ్రవాదులు

**- పట్టుబడ్డ ఇద్దరు లష్కరే సభ్యులు**

శ్రీనగర్, సెప్టెంబర్5 (ఆర్ఎన్ఎ) : లష్కరే తొయిబాకు చెందిన ఇద్దరు పాకిస్థానీ ఉగ్రవాదులను ఆగస్టు 21న ఆర్మీ అదుపులోకి తీసుకున్నట్టు చినార్ కార్ప్స్ కమాండ్ లెఫ్టినెంట్ జనరల్ కేజేఎస్ ధిల్లాన్ తెలిపారు. శ్రీనగర్‌లో బుధవారం మీడియా కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ కశ్మీర్ లోయలో శాంతికి విఘాతం కలిగించేందుకు పాకిస్థాన్ ప్రయత్నిస్తోందని, ముఖ్యంగా ఆగస్టు 5 తర్వాత మరిన్ని ప్రయత్నాలు చేస్తోందని ధిల్లాన్ అన్నారు. లోయలోకి వీలైనంత మేర ఉగ్రవాదులను పంపాలన్న పాక్ ప్రయత్నాలు నెరవేరడం లేదని, సరిహద్దుల్లోని శిబిరాలన్నీ ఉగ్రవాదులతో నిండిపోయాయని, వారిని కశ్మీర్‌లోకి పంపేందుకు రోజూ ప్రయత్నిస్తోందని అన్నారు. ఆగస్టు 21న అలాంటి ప్రయత్నమే చేయగా, ఈ ఇద్దరు ఉగ్రవాదులూ పట్టుబడ్డారని ఆయన తెలిపారు. లష్కరే తొయిబా ఉగ్రవాద సంస్థకు చెందిన పాకిస్థానీలను సైన్యం అరెస్ట్ చేసిందన్నారు. పాకిస్థాన్‌కు చెందిన ఖలీల్ అహ్మద్, మొజమ్ ఖోకర్‌లను బారాముల్లా జిల్లాలోని బొనియార్ సెక్టార్‌లో వీరిని అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడించారు. భారీగా ఉగ్రవాదులు చొరబడేందుకు ఈ ఇద్దరూ రెక్కీ నిర్వహిస్తూ పట్టుబడినట్టు జనరల్ ధిల్లాన్ వివరించారు. నిఘా వర్గాల సమాచారం ప్రకారం ఉగ్రవాదులకు పాక్ సైన్యానికి చెందిన 50 మంది శిక్షణ ఇస్తున్నట్టు తెలుస్తోందన్నారు. శిక్షణ తర్వాత ఈ ఉగ్రవాదులు రేషియాన్ గలీ, కండ్లన్ గలీ గుండా జమ్మూ కశ్మీర్‌లోకి చొరబడేందుకు వ్యూహరచన చేసినట్టు తెలుస్తోందని, వీరితోపాటు 80 నుంచి 90 మంది ఎస్ఎస్‌జీ కమాండోలు ముజఫరాబాద్‌లో శిక్షణ పొందుతున్నారని అన్నారు.

# సేంద్రియ సాగుకోసం నిరంతర తపన

**ఆధునిక రాజకీయాల్లో ఆదర్శనేతగా గుర్తింపు**

**నమ్మిన సిద్ధాంతం కోసం తలవంచని ముత్యం**

సిద్దిపేట,సెప్టెంబర్5 (ఆర్ఎన్ఎ): సేంద్రియ వ్యవసాయం అంటే ఆయనకు ప్రాణం. మన వ్యవసాయం బాగుపడాలని కలలు కన్న ఆదర్శ రైతు ఆయన. ఇక్కడి రైతులు అప్పుల ఊబిలో కూరుకుని పోకుండా వారికి నిరంతరంగా గైడ్‌గా ఉంటూ నిఖార్సయిన రైతుగా తనువు చాలించిన మహానుభావుడు చెరుకు ముత్యం రెడ్డి. తన ఊరికి సిఎంగా ఉన్నచంద్రబాబును తీసుకుని వచ్చి రైతులకు స్ఫూర్తినిప్పించారు. రైతులంతా సేంద్రియ పద్దతుల్లోనే వ్యవసాయం చేసి, ఆధునిక పద్ధతుల్లో లాభాలు గడించాలని పదేపదే సూచించేవారు. స్వతహాగా రైతు అయిన ముత్యంరెడ్డి ఏ పదవిలో ఉన్నా వ్యవసాయాన్ని వదిలి ఉండేవారు కాదు. ఆధునిక పద్ధతుల్లో సాగు చేస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలిచారు. ఇందిరప్రభ ద్వారా దుబ్బాక నుంచే సామూహిక వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు. చేర్యాపూర్‌ను దత్తత తీసుకుని పందిరి సాగును ప్రోత్సహించారు. రైతులు నేరుగా మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు అమ్ముకోవడం కోసం రైతుబజార్‌కు, సెక్రటేరియట్‌కు బస్సు సౌకర్యం కల్పించారు. ప్రాజెక్టులు కడితే రైతులు బాగుపడతారని ఆకాంక్షించేవారు. ఆయునో రైతుగా మట్టిలో బంగారం పండించాలని ఆకాంక్షించే వారు. ఆయన రాజకీయ నేతగా ఎదిగినా ఎక్కడా తన మూలాలలను వదులుకోలేదు. లంచం అన్న మాట వింటే మండిపడేవారు. ఎవరైనా అధికారి పనిచేయకుంటేనిలదీసే లక్షణం ఆయను ఉండేది. అందుకేరాజకీయ రంగంలోనూ ఇతరులకు ఆదర్శంగా నిలిచిన, ఆధునిక రాజకీయాలు వంటపట్టించుకోక పోవడం వల్ల ఎదగలేక పోయారు. ప్రజలు అందుకే ఆయనను కూడా ఓడించి తమ దౌర్బల్యాన్నిచాటుకున్నారు. జీవితపర్యంతం ప్రజల మధ్యే ఉంటూ వారికి చేదోడువాదోడుగా ఉన్నా ఓటమిని మాత్రం తప్పించుకోలేక పోయారు. వారితో మమేకమవుతూ వారి బాగోగులను తెలుసుకుంటూ వారి అభివృద్ధి కోసం శ్రమించారు. మచ్చలేని నాయకుడంటూ ప్రత్యర్థి పార్టీల నేతలు కూడా కొనియాడినా ఏనాడూ స్వార్థం కోసం పనిచేయలేదు. నిగర్వీగానే చివరి వరకు జీవితం సాగించిన మంచిరైతునేస్తం చెరుకుముత్యం రెడ్డి. త్రి పదవుల్లో కొనసాగినా సాధారణ జీవితాన్నే గడిపారు. మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి(72) సోమవారం ఉదయం తీవ్రమైన గుండెపోటుకు గురై మరణించారు. రెండేళ్ల క్రితం ఆయన నోటి కేన్సర్‌కు చికిత్స పొందారు. టిడిపిలో ఉన్నంతకాలంఆయన దుబ్బాక రైతుల సంక్షేమానికి నిరంతరంగా కృషి చేశారు. వ్యవసాయ సంబంధ పథకాలు ఏవి వచ్చినా ముందు దుబ్బాకలో ఉండేవి.తొగుట సింగిల్ విండో చైర్మన్‌గా ఆయన తన రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టారు. 1970 నుంచి 18ఏళ్లపాటు తొగుట సర్పంచ్‌గా పనిచేశారు. దొమ్మాటలో 19 89 నుంచి ఎమ్మెల్యేగా వరుసగా మూడుసార్లు గెలిచారు. 1999లో పౌర సరఫరాల శాఖ మంత్రిగా పని చేశారు. 2004లో ఓటమి పాలయ్యారు. 2009లో మహాకూటమి పొత్తుతో ఆయనకు టికెట్ రాలేదు. అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డి పిలిచి కాంగ్రెస్ టికెట్ ఇచ్చారు. పార్టీ అభ్యర్థిగా గెలిచి, టీటీడీ దేవస్థానం సభ్యుడిగా, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్‌గా పదవులు పొందారు. 2014లో కాంగ్రెస్ పార్టీ రాజకీయాల కారణంగా టికెట్ దక్కలేదు. సీఎం కేసీఆర్ ఆహ్వానం మేరకు గత ఎన్నికలకు ముందు టీఆర్ఎస్‌లో చేరినా ముత్యంరెడ్డికి ఎలాంటి పదవీ దక్కలేదు.

# మరోసారి వార్తల్లో సిద్ధరామయ్య!

**- కార్యకర్త చెంప చెళ్లుమనిపించిన మాజీ సీఎం**

**- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన వీడియో**

బెంగుళూర్, సెప్టెంబర్5 (ఆర్ఎన్ఎ) : రాజకీయంలో అపారమైన అనుభవం కర్నాటక మాజీ సీఎం సిద్ధరామయ్యది. అంతటి అనుభవం ఉన్న నేతకు అసహనం కూడా ఎక్కువే. దీంతో ఆయన తరచు వార్తలోకి ఎక్కుతుంటారు. ఈ క్రమంలో సిద్ధరామయ్య మరోసారి సహనం కోల్పోయి వార్తలోకెక్కారు. మైసూర్ ఎయిర్ పోర్ట్ లో తన సొంతపార్టీ కార్యకర్తపైనే చేయి చేసుకున్న ఘటన హాట్ టాపిక్ గా మారింది. ఎయిర్ పోర్టు నుంచి బయటకు వస్తున్న సిద్ధరామయ్యకు ఫోన్‌లో మాటాడుతూ వచ్చిన సదరు కార్యకర్త ఆయనకు ఇచ్చేందుకు యత్నించాడు. దీంతో సిద్ధరామయ్యకు కోపమొచ్చింది. ఫోన్ ఇవ్వబోతున్న వ్యక్తి చెంపపై ఒక్కటిచ్చారు. ఇదంతా అక్కడే ఉన్న కొంతవంది వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయటంతో ఇది వైరల్ గా మారింది. కాగా ఎయిర్ పోర్ట్ లో సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడిన తరువత కూడా సిద్ధరామయ్యకు వినుగుపుట్టించేలా ఆ వ్యక్తి ప్రవర్తించినట్లుగా తెలుస్తోంది. అనుచరుడి ప్రవర్తన నచ్చని చిరాకుడపడి అతని చెంపపై గట్టిగా కొట్టారు. గతంలో కూడా సిద్ధరామ్య అసహనంతో కొందరిపై చేయి చేసుకున్న ఘటనలున్నాయి. మరోవైపు కర్నాటకలో మైసూరు, కొడగు పర్యటనలో వరద అనంతర పరిస్థితిని సమీక్షించిందేకు మాజీ సీఎం బయల్దేరారు. అయితే కాంగ్రెస్ నేత ట్రబుల్ షూటర్ డికె శివకుమార్ అరెస్టుతో ... సిద్ధరామయ్య సందర్శన స్థానికంగా ఉద్రిక్తతకు దారితీసింది. శివకుమార్ అరెస్టును నిరసిస్తూ.. పలువురు కార్యకర్తలు ఆయన నివాసం ఎదుట ఆందోళనకు దిగారు. మరికొందరు మైసూరు వచ్చిన సిద్ధరామయ్యను కలిసేందుకు భారీగా ఎయిర్ పోర్టు వద్దకు తరలివచ్చారు. ఈ క్రమంలో సిద్ధరామయ్య తీవ్ర అసహానానికి గురైన సమయంలో సదరు కార్యకర్తపై చేయి చేసుకున్నట్లుగా తెలుస్తోంది.

# కాంగ్రెస్‌పై విమర్శలతో ప్రజలను మభ్యపెట్టలేరు

**ప్రజలకిచ్చిన హామీలపై సమాధానం ఇచ్చుకోవాల్సిందే**

కరీంనగర్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్‌పై నిందలు మోపిన కెసిఆర్‌ను, టిఆర్ఎస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నారని డిసిసి అధ్యక్షుడు కటకం మృత్యుంజయం అన్నారు. కాళేశ్వరం చూపి ప్రజల కళ్లుకప్పాలని చూస్తున్నారని అన్నారు. ఆడలేక మద్దెల ఓడు అన్న చందంగా పాలించడం చేతకాక ప్రజలకు, విపక్షాల విమర్శలకు సమాధానం చెప్పలేకపోతున్నారని మండిపడ్డారు. ఇన్నాళ్లూ ప్రజలను మాటలతో మభ్యపెట్టిన ఏకైక ప్రభుత్వం ఇదేనన్నారు. ప్రజలు ఎవరేంటన్నది బాగా తెలుసుకున్నారని అన్నారు. ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా ప్రజలను దగా చేసిన ఘనత కెసిఆర్‌దని అన్నారు. కాంగ్రెస్ హయాంలో జిల్లాలో శాతవాహన యూనివర్సిటీ, వెటర్నరీ కళాశాల, జేఎన్‌టీయూ రెండు కళాశాలలు, 50 మోడల్ స్కూళ్లు, పాస్‌పోర్టు కేంద్రం, కేజీబీవీ పాఠశాలలు ఏర్పాటు చేశామని అన్నారు. అయితే టిఆర్ఎస్ హయాంలో ఈ నాలుగేళ్లలో శాతవాహన యూనివర్సిటీకి వీసీని నియమించలేని దుస్థితి ఏర్పడిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ హయాంలోనే ఎల్లంపల్లి, మిడ్‌మానేరు, అప్పర్‌మానేరు, వరదకాలువ ప్రాజెక్టుల పనులు పూర్తి దశకు చేరుకున్నాయని, ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తి చేసిన పాపాన టీఆర్ఎస్ లేదని అన్నారు. తెలంగాణ కోసం కేటీఆర్ చేసిన పోరాటమేమిటో, ఏ జైల్లో ఉన్నాడో, ఎన్ని కేసులు నమోదయ్యాయో వెల్లడించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులను దగా చేసిన చరిత్ర కేసీఆర్‌ది అని, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి దించాడని, అసెంబ్లీ సాక్షిగా లక్షఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీని మరిచారా అని దుయ్యబట్టారు. ఇంటికో ఉద్యోగం అంటూ ఊదరగొట్టి ఇప్పుడు అలా తాను అనలేదని అనడం ఆయనకే చెల్లిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు హామీలుగానే మారాయని, మిషన్ భగీరథ కాసుల కక్కుర్తికే పెట్టారని, ఎస్సీ, ఎస్టీల 12 శాతం రిజర్వేషన్ అటకెక్కిందని అన్నారు. హామీలను మరచి కాంగ్రెస్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# వ్యవసాయరంగానికి పెద్ద ఎత్తున ప్రోత్సాహం

**-జల శక్తి అభియాన్ కిసాన్ మేళాలో మంత్రులు**

మహబూబ్‌నగర్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించేందుకు సీఎం రైతు బంధు, రైతు భీమా పథకాలను తీసుకు వచ్చారని వ్యవసాయ శాఖామంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. వ్యవసాయ రంగాన్ని మరింత ముందుకు తీసుకుపోవడానికి, రైతులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఆయన అన్నారు. జిల్లాలోని హన్వాడ మండల కేంద్రంలో వ్యవసాయశాఖ కృషి విజ్ఞాన కేంద్రం జల శక్తి అభియాన్ కిసాన్ మేళా కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రైతు సంక్షేమకార్యక్రమాఉల దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. రైతుబంధు పథకాన్ని కేంద్రం కూడా ఆమోదించిందన్నారు. మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో రాష్ట్రం దూసుకుపోతుంది అని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తి పోతల పథకం ప్రాజెక్టును దశలవారీగా పూర్తి చేసి హన్వాడలో పాడి పంటలను సమృద్ధిగా పండేలా, రైతులు సంతోషంగా ఉండేలా చేస్తామని మంత్రి అన్నారు. మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువులను తవ్వించి వాటిని నింపేందుకు ప్రాజెక్టుల నిర్మాణాలను చేపడుతున్నామనీ, ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. నీటిని ఒడిసి పట్టుకోవడానికి ప్రతి ఒక్కరు కూడా ఇంటింటికీ ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మంత్రులతో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, వ్యవసాయ అధికారులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీ వార్తలు

# రాష్ట్రంలో తుగ్లక్ పాలన నడుస్తుంది

**- ప్రభుత్వ విధానం మారకపోతే పోరాటానికి దిగుతాం**
**- మాజీ మంత్రి, టీడీపీ నేత లోకేశ్**
**- అన్నం వడ్డించి.. హెల్మెట్లు పంచిన లోకేష్**
**- అయ్యన్నపాత్రుడు పుట్టిన రోజు సందర్భంగా మోటార్‌సైకిల్ ర్యాలీ**
**- అనుమతి లేదంటూ అడ్డుకున్న పోలీసులు**

విశాఖపట్టణం, సెప్టెంబర్5(ఆర్‌ఎన్‌ఎ) : రాష్ట్రంలో తుగ్లక్ పాలన నడుస్తుందని, ప్రజా సమస్యలు పట్టించుకోకుండా సీఎం జగన్ ప్రతివక్ష పార్టీ నేతలతో కక్షసాధింపులకు పాల్పడుతున్నాడని మాజీ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. లోకేష్ బుధవారం విశాఖ జిల్లాలో పర్యటించారు. టీడీపీ నేత అయ్యన్నపాత్రుడి పుట్టిన రోజు సందర్భంగా నర్సీపట్నం వెళ్లిన నారా లోకేష్ కు అక్కడి టీడీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. నర్సీపట్నం చేరుకున్న తర్వాత లోకేష్ అయ్యన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అనంతరం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సంధర్భంగా జగన్ ప్రభుత్వంపై నారా లోకేష్ విమర్శలు గుప్పించారు. తుగ్లక్ పరిపాలన గురించి చిన్నప్పుడు పుస్తకాల్లో చదువుకున్నామని... ఇప్పుడు సీఎం జగన్ ను చూస్తుంటే ప్రత్యక్షంగా అర్థం అవుతుందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ విధానం మారకపోతే పోరాటానికి దిగుతామని లోకేష్ హెచ్చరించారు.

మూడు నెలల్లోనే దారి తప్పిన బండిలా ప్రభుత్వం వెళ్తోందని విమర్శించారు. సాధారణంగా ఎన్నికల్లో ఓటమి పాలైతే ఏ పార్టీ కార్యకర్తలైనా పారిపోతారనీ, కానీ టీడీపీ కార్యకర్తలు మాత్రం ప్రజల తరఫున పోరాటం చేస్తున్నారని లోకేశ్ తెలిపారు. జగన్ ప్రభుత్వం ఏదో చేయాలనుకుంటోంది.. కనీసం ఆరు నెలల గడువు ఇద్దాం అని తాము భావించామని లోకేశ్ చెప్పారు.

కానీ ఇప్పుడు చూస్తే ఇది తుగ్లక్ పాలనలాగా కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. టీడీపీ హయాంలో ఓ ట్రాక్టర్ లోడ్ ఇసుక రూ.800-1,200 అయ్యేదని లోకేశ్ అన్నారు. కానీ ఆ ట్రాక్టర్ ఇసుక ధర ఇప్పుడు రూ.10,000కు చేరుకుందని ఆరోపించారు. ఈ ఇసుక సొమ్మంతా స్థానిక ఎమ్మెల్యే, సీఎం జగన్ జేబుల్లోకి వెళుతోందని లోకేశ్ విమర్శించారు. ఏపీలో ఇప్పుడు బస్తా ఇసుక రూ.400 పలుకుతోందనీ, ఇదే తుగ్లక్ పరిపాలన అని ఎద్దేవా చేశారు. ఏపీలో ప్రస్తుతం 20 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు, పెయింటర్లు, ఎలక్ట్రీసియన్, సెంట్రీ, ఇతర కార్మికులకు ఉపాధి లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వం కంటే తక్కువ ధరకు ఇసుకను అందిస్తామని జగన్ ఎన్నికల సమయంలో చెప్పారని లోకేశ్ గుర్తుచేశారు. కానీ మూడు నెలలు గడిచిపోయినా తుగ్లక్ గారి హామీ నెరవేరలేదనీ, పని కాలేదని విమర్శించారు. ఎన్నికల ముందు జగన్ మన ఊరికి వచ్చారు.. దొరికినవాళ్లందరికీ ముద్దులు పెట్టారు. అదే వ్యక్తి ఈరోజు లాఠీదెబ్బలు తినిపిస్తున్నాడంటూ మండిపడ్డారు. మంగళగిరిలోని ఆయన ఇంటి చుట్టూ 144 సెక్షన్ విధించారు. అంటే ఒక 10 మంది కలిసి కూడా రావడానికి లేదన్నారు.

నాకు తెలిసినంతవరకూ ఏపీ ముఖ్యమంత్రి ఇంటిముందు ఎప్పుడూ 144 సెక్షన్ పెట్టలేదని, సీఎం జగన్ ఇంటి ముందు ఎందుకు పెట్టారంటే.. పొద్దున్నే ఆశావర్కర్లు, మధ్యాహ్నం అంగన్ వాడీ టీచర్లు, ఆ తర్వాత ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు ధర్నాకు దిగుతున్నారని, దాన్ని చూసి నేనే ఆశ్చర్యపోయానన్నారు. చంద్రబాబు ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటే ఏనాడూ ఆయన ఇంటి ముందు ఒక్క ధర్నా కూడా జరగలేదని, ఊరూరు తిరిగిన జగన్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని లోకేశ్ దుయ్యబట్టారు. ఇదే సమయంలో అన్న క్యాంటీన్ లను మూసివేసిన ఏపీ ప్రభుత్వ తీరుని వ్యతిరేకిస్తూ లోకేశ్ నిరసన తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పేదలకు భోజనాలు ఏర్పాటు చేయగా కార్యక్రమంలో పాల్గొన్న లోకేష్ స్వయంగా వారికి అన్నం వడ్డించారు. అనంతరం అయ్యన్నపాత్రుడు పుట్టినరోజు సందర్భంగా వాహనదారుకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ.. లోకేశ్ 1500 హెల్మెట్లను పంపిణీ చేశారు.

### లోకేశ్‌కు షాకిచ్చిన నర్సీపట్నం పోలీసులు..

లోకేశ్‌కు నేతలకు నర్సీపట్నం పోలీసులు షాకిచ్చారు. అయ్యన్న బర్త్ డే సందర్భంగా బైక్ ర్యాలీ చేపట్టడానికి అనుమతి ఇవ్వలేదు. దీంతో పోలీసుల వైఖరిపై నారా లోకేశ్ మండిపడ్డారు. తాము ప్రజాస్వామ్యబద్ధంగా బైక్ ర్యాలీ చేపట్టాలని తలపెట్టామని.. కానీ పోలీసు యంత్రాంగం అనుమతి ఇవ్వకపోవడం ప్రభుత్వ అభద్రతా భావాన్ని తెలియజేస్తోందని నారా లోకేశ్ ఎద్దేవా చేశారు.

ఈ విషయమై అయ్యన్నపాత్రుడు తనదైన శైలిలో స్పందించారు. పోలీసులను విమర్శిస్తే ఏం లాభం ఉంటుందన్న ఆయన.. జగన్ ఒత్తిడి వల్లే పోలీసులు ఇలా వ్యవహరిస్తోన్నారని అయ్యన్న తెలిపారు. మూడేళ్లలో ఎన్నికలు రాబోతున్నాయన్న అయ్యన్న.. మళ్లీ మాదగ్గరే పని చేయాల్సి ఉంటుందని పోలీసులను హెచ్చరించారు. హెల్మెట్లు పెట్టుకోకపోతే.. బైక్ ర్యాలీకి అనుమతి ఇవ్వకపోవడం అనేది ఎక్కడైనా ఉందా? అని ఆయన పోలీసులను ప్రశ్నించారు.

## రాజకీయం కోసంమే బాబు ప్రభుత్వం..

# వివేకాను చంపించింది

**-చిన్నచిన్న గొడవలకు రాజకీయ రంగుపులుముతున్నారు**
**- కే ట్యాక్స్, లోకేష్ ట్యాక్స్‌పై శిబిరం పెట్టాలి**
**- టీడీపీ అవినీతి నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే రాజధాని మార్పు ప్రచారం**
**- ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీకాంత్‌రెడ్డి**

గుంటూరు, సెప్టెంబర్5(ఆర్‌ఎన్‌ఎ) : రాజకీయ లబ్ధికోసమే చంద్రబాబు నాయుడు ప్రభుత్వం జగన్ బాబాయి, వైసీపీ నేత వివేకానందారెడ్డిని హతమార్చిందని, విచారణలో అన్నీ తేలుతాయని ప్రభుత్వ చీఫ్‌విప్ శ్రీకాంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయం కోసం చంద్రబాబు ప్రభుత్వమే వైఎస్ జగన్ బాబాయిని చంపించింది. వంగవీటి మోహన్ రంగాను, చివరికి మీడియా ప్రతినిధులను చంపించావని విమర్శించారు. వైసీపీ నేత చెరుకూరి నారాయణరెడ్డిని టీడీపీ నేతలు హత్య చేయలేదా అని ప్రశ్నించారు. గతంలో ఇడుపులపాయలో డ్రోన్ కేమెరాతో ఫొటోలు తీయలేదా అని శ్రీకాంతరెడ్డి ప్రశ్నించారు. ప్రతిపక్ష నేతగా ఉన్నపుడు జగన్‌పై హత్యాయత్నానికి పాల్పడిన చరిత్ర టీడీపీ నేతలదని, చిన్న చిన్న గొడవలకు రాజకీయ రంగు పులు ముతున్నారని విమర్శించారు. వాటిపై శిబిరాలు పెడుతున్నారని, పలనాడులో మాజీ టీడీపీ ఎమ్మెల్యేలు యరపతినేని, కోడెల అరాచకాలకు పాల్పడ్డారన్నారు. కాల్ మనీ సెక్స్ రాకెట్ మీద చంద్రబాబు శిబిరం నిర్వహించగలరా.. చంద్రబాబుకు నచ్చిన 10 గ్రామాల్లో చర్చ పెడదాము అంటూ ప్రశ్నించారు. జన్మభూమి కమిటీ అరాచకాలు మీద చర్చ పెడదామని, దానికి చంద్రబాబు సిద్దమా అని సవాల్ విసిరారు. టీడీపీ అధికారంలో ఉండగా అరాచకాలకు పాల్పడ్డ ఆ పార్టీ నేతలు కూన రవి, చింతమనేని ఇప్పుడు కూడా అదే విధంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఫ్యాక్షనిస్టులు, రేపిస్టులు టీడీపీలోనే ఉన్నారని ఘాటుగా విమర్శించారు. చంద్రబాబుకు ధైర్యం ఉంటే కోడెల టాక్స్, లోకేష్ టాక్స్‌పై శిబిరాలు పెట్టాలని శ్రీకాంత్‌రెడ్డి సవాల్ విసిరారు. పలనాడులో చిన్న చిన్న గొడవలు జరిగితే వాటికి రాజకీయ రంగు పులుముతూ శిబిరాలు పెడుతున్నారని విమర్శించారు. అధికారంలో ఉండగా టీడీపీ నేతలు అనేక అరాచకాలకు పాల్పడ్డారని.. టీడీపీ బాధిత శిబిరం పెడితే కరకట్ట మొత్తం నిండిపోతుందన్నారు. టీడీపీ అవినీతి నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే రాజధాని మార్చుతున్నారని చంద్రబాబు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా తన మీడియా, సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. లక్ష కోట్ల బిల్లులు పెండింగులో పెట్టిన చంద్రబాబు రెండున్నర కోట్లు లక్షల అప్పు భారాన్ని రాష్ట్రంపై మోపారని దుయ్యబట్టారు. అదేవిధంగా నాడు ప్రతిపక్షాన్ని విమర్శించిన పవన్ కళ్యాణ్ చంద్రబాబు చేసిన అవినీతిపై ఎందుకు ట్వీట్లు చేయడం లేదో తనకు అర్థం కావడం లేదన్నారు.

# టీటీడీ బోర్డు సభ్యుల సంఖ్య పెంపు

**- 18నుంచి 24కు పెంచుతూ ఏపీ కేబినెట్ ఆమోదం**
**- తెలంగాణ నుంచి ఇద్దరికి అవకాశం**

అమరావతి, సెప్టెంబర్5(ఆంఎన్‌ఎ) : టీటీడీ బోర్డు సభ్యుల సంఖ్యను పెంచుతూ ఏపీ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు పూర్తయినా.. టీటీడీ బోర్డును ఏర్పాటు చేయడం లేదేంటనే ప్రశ్నలు తలెత్తాయి. టీటీడీ ఛైర్మన్ నియామకం పూర్తయినా.. సభ్యుల నియాకం విషయమై ఇప్పటి వరకూ ప్రభుత్వం స్పందించలేదు. కాగా బుధవారం నిర్వహించిన కేబినెట్ భేటీలో.. టీటీడీ పాలక మండలిలోని సభ్యుల సంఖ్యను 18 నుంచి 24కి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.

ఛైర్మన్‌తో కలిపి ఈ సంఖ్య 25కి చేరుతుంది. త్వరలోనే బోర్డు సభ్యులను ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది.

టీటీడీ బోర్డులో సభ్యత్వం కోసం చాలామంది ఆశావహులు ఎదురు చూస్తున్నారు. తెలంగాణ నుంచి ఇద్దరు లేదా ముగ్గురికి అవకాశం ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది.

తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక నుంచి ఒక్కొక్కరిని బోర్డులోకి తీసుకోవడాన్ని టీటీడీ ఆనవాయితీగా కొనసాగిస్తోంది. ఈ దఫా తమకు రెండు చొప్పున ఇవ్వాలని ఆ రాష్ట్రాలు పట్టుబడుతున్నట్టు తెలుస్తోంది. టీటీడీ బోర్డు సభ్యుల కోసం పోటీ భారీగా ఉంది.

తమవారికి టీటీడీ పదవులు ఇవ్వాలని తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకకు చెందిన ముఖ్యులు సైతం సీఎం పేషీకి సిఫారసు చేశారని సమాచారం. కేసీఆర్, అమిత్ షా సిఫారసు చేసిన వారికి ఈ జాబితాలో చోటు దక్కినట్లు తెలుస్తోంది. టీటీడీ బోర్డు సభ్యుల్లో విశాఖ జిల్లా యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి పేర్లు ఖరారైనట్టు తెలుస్తోంది. ఎస్సీ ఎమ్మెల్యే కోటాలో వరప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే కోటాలో భూమన కరుణాకర్ రెడ్డికి అవకాశం ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా తుడా ఛైర్మన్ చెవిరెడ్డి భాస్కర రెడ్డి పేరును సీఎం ఖరారు చేసినట్లు ప్రచారం సాగుతుంది. తమిళనాడు నుంచి ఇండియా సిమెంట్స్ అధినేత శ్రీనివాసన్ పేరు వినిపిస్తోంది.

తెలంగాణ నుంచి జూపల్లి రామేశ్వర రావు, సినీ దర్శకుడు దిల్ రాజు పేరు ఖాయమైనట్లు సమాచారం. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి భార్య ప్రశాంతి రెడ్డి, తోట వాణిల పేర్లు ఖరారు చేసినట్లుగా సమాచారం.

# వీఐపీ దర్శనాలపై పిటీషన్ కొట్టేసిన హైకోర్టు

**- ఇప్పటికే బ్రేక్ దర్శనాల విభజనను రద్దుచేసిన టీటీడీ**

అమరావతి, సెప్టెంబర్5 (ఆర్‌ఎన్‌ఎ) : తిరుమల శ్రీవారి ఆలయంలో వీఐపీ బ్రేక్ దర్శనాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. ఇప్పటికే బ్రేక్ దర్శనాల విభజనను టీటీడీ రద్దుచేసినందున ఈ పిటిషన్‌కు కొట్టివేస్తున్నట్టు పేర్కొంది. కాగా, బ్రేక్ దర్శనాల్లో భక్తులను ఎల్1, ఎల్2, ఎల్3గా ఏ ప్రాతిపదికన విభజించారో తెలపాలని కోరుతూ ఓ వ్యక్తి పిటిషన్ దాఖలుచేశారు. వీఐపీ బ్రేక్ దర్శనానికి టీటీడీ చట్టం, జీవో, గైడెలెన్స్ ఉంటే అందజేయాలని పిటిషనర్ కోరారు. అంతేకాదు, అలాగే ఎల్1, ఎల్2, ఎల్3 దర్శనాలు రద్దు చేసేలా చూడాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. దైవ ఆరాధనలో భక్తులు అందరిని సమానంగా చూడాలని, దైవారాధన హక్కు దేవాలయాల్లో అందరికి సమానంగా ఉంటుందని.. గతంలో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన విషయాన్ని హైకోర్టు దృష్టికి ఈ సందర్భంగా పిటిషనర్ తరుపు లాయర్ ఉమేశ్ చంద్ర తీసుకెళ్లారు. పిటిషనర్ తరఫు లాయర్ విజ్ఞప్తి మేరకు వీఐపీ బ్రేక్ దర్శనాలపై పూర్తి వివరాలు ఇవ్వాలని ప్రభుత్వంతో పాటు టీటీడీ స్టాండింగ్ కమిటీకి జులైలో హైకోర్టు ఆదేశించింది. దీనిపై విచారణ పూర్తికావడంతో బుధవారం తుది తీర్పును వెలువరించింది. కాగా, శ్రీవారి ఆలయంలో వీఐపీ బ్రేక్ దర్శనం మూడు విభాగాలుగా విభజించడంపై భక్తుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తంకావడంతో రద్దుచేస్తున్నట్టు టీటీడీ జులై 17న పాలకమండలి ఛైర్మన్ ప్రకటించిన విషయం తెలిసిందే. టీటీడీ తీసుకున్న నిర్ణయంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విభజన రద్దువల్ల ఓ గంట సమయం ఆదా అవుతుంది. అంతేకాదు, అదనంగా ఐదువేల మందికిపైగా సామాన్యులకు శ్రీవారి దర్శనభాగ్యం కలుగుతోంది. రద్దీ భారీగా ఉన్నప్పుడు కేవలం ప్రొటోకాల్ ప్రముఖులనే వీఐపీ దర్శనానికి అనుమతిస్తున్నారు. రద్దీ సాధారణ స్థాయికి వచ్చినట్టయితే వీఐపీ బ్రేక్ దర్శనం టిక్కెట్లను ఎక్కువగా జారీచేసి, వారిని కులశేఖరపడి వరకు అనుమతిస్తారు.

# చింతమనేని కోసం పోలీసుల గాలింపు

ఏలూరు,సెప్టెంబర్5 (ఆర్‌ఎన్‌ఎ): దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. కులం పేరుతో దూషించి తనపై దాడి చేశారంటూ పెదవేగి మండలానికి చెందిన జోషఫ్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి నుంచి పోలీసులు చింతమనేని కోసం గాలిస్తున్నారు. చింతమనేని నివాసం దుగ్గిరాలలో ఉంది. దీంతో ఏలూరు కోర్టు పరిసరాల్లో పోలీసులు మఫ్టీలో మోహరించారు. బుధవారం మధ్యాహ్నం ఏలూరులో టీడీపీ కార్యాలయంలో పార్టీ సమన్వయ కమిటీ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి చింతమనేని అక్కడికి వచ్చే అవకాశం ఉందని భావించిన పోలీసులు ఆఫీసు పరిసరాల్లో మఫ్టీలో మోహరించారు. చింతమనేని ఏ క్షణంలో అక్కడికి వచ్చినా అరెస్టు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

# నూతన ఇసుక పాలసీకి ఆమోదం

**- టన్ను ధర రూ.375గా నిర్ణయిస్తూ ఏపీ కేబినెట్ ఆమోదం**
**- ఈనెల 10 నుంచి ఇసుక ఆన్‌లైన్ బుకింగ్‌లు**
**- తొలి దశలో 58 ఇసుక స్టాక్‌పాయింట్లు**
**- ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణిస్తూ నిర్ణయం**
**- ఉద్యోగస్తుల రిటైర్మెంట్ వయస్సు 58 నుంచి 60కి పెంపు**
**- శ్రీరామ నవమి నుంచి వైఎస్ఆర్ పెళ్లి కానుక**
**- ఆశావర్కర్ల జీతాల పెంచుతూ ఏపీ కేబినెట్‌లో జగన్ ఆమోదం**

అమరావతి, సెప్టెంబర్5(ఆర్‌ఎన్‌ఎ) : ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. నూతన ఇసుక పాలసీకి ఆమోదం తెలపడంతో పాటు, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ నిర్ణయం తీసుకుంది. బుధవారం ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో కేబినెట్ భేటీ జరిగింది. ఈ భేటీలో కీలక నిర్ణయాలను ఆమోదం తెలిపారు. ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికుల విలీనం, కొత్త ఇసుక విధానం సహా పలు నిర్ణయాలకు మంత్రివర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించేందుకు అంగీకారం తెలిపింది. ప్రజా రవాణా శాఖ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నారు. కొత్త ఇసుక విధానం గురువారం నుంచి అమల్లోకి రానుంది. ఇసుక ధరను టన్ను ధర రూ.375గా ప్రభుత్వం నిర్ణయించింది. తొలి దశలో 58 ఇసుక స్టాక్‌పాయింట్లు అందుబాటులోకి రానున్నాయి. ఏపీఎండీసీ ద్వారా ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకోవచ్చని ప్రభుత్వం తెలిపింది రాజకీయ ప్రమేయం లేకుండా ఇసుక రీచ్‌లను నిర్వహించాలని సీఎం సూచించారు. దశల వారీగా ఇసుక రీచ్‌లు, స్టాక్ పాయింట్లు పెంచాలని కేబినెట్ నిర్ణయించింది. మరోవైపు ఆర్టీసీ విలీనంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆంజనేయరెడ్డి కమిటీ ప్రధానంగా 5 రకాల ప్రతిపాదనలను ప్రభుత్వం ముందుంచింది. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ప్రజా రవాణా విభాగం ఏర్పాటు చేసి అందులోకి తీసుకోవడం, సంస్థను 5 భాగాలుగా విభజించడం, విలీనం చేయకుండా ప్రతి నెలా ప్రభుత్వం తరఫున కొంత సాయం అందించడంతోపాటు మరో రెండు ప్రతిపాదనలను చేసింది. వీటి ఆధారంగా ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర కేబినెట్ ఆమోదముద్ర వేయడంతో ప్రజా రవాణా విభాగంలోకి ఆర్టీసీ ఉద్యోగులను తీసుకునే ప్రక్రియ వేగం అందుకోనుంది. దీనిపై ప్రభుత్వం ఆర్డినెన్సు జారీ చేయనుంది. 15 రోజుల్లో విధివిధానాలు సిద్ధమవుతాయి. ఆర్టీసీలోని 53వేల మంది ఉద్యోగుల పదవీ విరమణ వయసు 60ఏళ్లకు పెరగనుంది. మరోవైపు నవయుగ సంస్థకు పోలవరం హైడ్రల్ ప్రాజెక్టు కాంట్రాక్టు రద్దు నిర్ణయానికి ఆమోదం తెలిపింది. రివర్స్‌టెండరింగ్ పద్ధతిలో తాజా టెండర్లకు పచ్చజెండా ఊపింది. కాంట్రాక్టర్‌కు ఇచ్చిన అడ్వాన్స్‌ల రికవరీకి మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.

ఆశావర్కర్ల వేతనం పెంపునకు ఆమోదముద్రవేసింది. ఆశావర్కర్ల వేతనాన్ని రూ.3 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. మచిలీపట్నం పోర్టు ప్రైవేటు లిమిటెడ్‌కు కేటాయించిన 412.5 ఎకరాల భూమిని వెనక్కుతీసుకోవాలన్న నిర్ణయానికి మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. పనులు ప్రారంభించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రివర్గం వెల్లడించింది. మావోయిస్టులపై నిషేధం మరో ఏడాది పొడిగిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

శ్రీరామనవమి నుంచి వైఎస్సార్ పెళ్లి కానుక..

శ్రీరామనవమి నుంచి 'వైఎస్సార్ పెళ్లి కానుక' పథకం అమలు చేయటానికి ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.750 కోట్లు కేటాయింపులు చేస్తూ నిర్ణయించింది. ఎస్సీ కులం వారి ఇంట వివాహానికి రూ.లక్ష, ఎస్టీలకు రూ.లక్ష, ఎస్సీ-ఎస్టీ వర్ణాంత వివాహానికి రూ.లక్ష, బీసీలకు రూ.50,000, బీసీ కులాంతర వివాహానికి రూ.70,000, మైనారిటీ వివాహానికి రూ.లక్ష, దివ్యాంగుల వివాహానికి(జంటలో ఒకరు వికలాంగులైతే) రూ.1.50 లక్షలు. భవన నిర్మాణ కార్మికుల పిల్లల పెళ్లికి రూ.లక్ష ఇవ్వాలని జగన్ సర్కారు నిర్ణయించింది. అదేవిధంగా 2019, జనవరి నుంచి టీడీపీ సర్కారు జీతాలు ఇవ్వలేదు. ఈ మొత్తం రూ.132 కోట్లను ఇప్పుడు విడుదల చేశారు. వైఎస్సార్ క్రీడా ప్రోత్సాహకాలు పథకం ప్రారంభం. దీనికింద జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించే క్రీడాకారులకు రూ.5 లక్షలు, సిల్వర్ మెడల్ సాధిస్తే రూ.4 లక్షలు. కాంస్య పతకం సాధిస్తే రూ.3 లక్షలు ఇవ్వాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. టీడీపీ హయాంలో ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేసిన ఆటగాళ్లకు న్యాయం చేయాలని, దరఖాస్తు చేసుకోవాలని సదరు ఆటగాళ్లకు సూచించింది. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డులో సభ్యుల సంఖ్యను 18 నుంచి 24 కు పెంచుతూ కేబినెట్ నిర్ణయించింది. ప్రపంచ బాడ్మింటన్ షిప్ సాధించిన క్రీడాకారిణి పీవీ సింధూకు కేబినెట్ అభినందనలు తెలిపింది. కృష్ణా జిల్లా నాగాయలంక సంగమేశ్వరంలో డీఆర్డీవో కోసం రాకెట్ ట్రాకింగ్ వ్యవస్థ. ఇందుకోసం 5 ఎకరాల భూమిని కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనం సందర్భంగా ఆంధ్రాబ్యాంకు పేరును యథాతథంగా ఉంచేలా ప్రధాని మోదీకి సీఎం జగన్ లేఖ రాయాలని కేబినెట్ తీర్మానించింది. చిత్తూరు, కడప జిల్లాల్లో హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ కు ఇంటర్మీడియట్ లెవల్ పంపింగ్ కోసం 25 ఎకరాల కేటాయింపుకు నిర్ణయించారు. నడికుడి-శ్రీకాళహస్తి మధ్య బ్రాడ్ గేజ్ నిర్మాణం కోసం ప్రకాశం జిల్లాలో 20 ఎకరాలు దక్షిణ మధ్య రైల్వేకు కేటాయింపు, బలిమెల మావోయిస్టు దాడిలో అమరుడైన ఏపీఎస్పీ అధికారి వెంకట్రావు కుటుంబానికి గుంటూరు జిల్లాలో 10 సెంట్ల భూమిని ఎలాంటి ధర చెల్లించకుండానే కేటాయిస్తూ జగన్ నిర్ణయించారు. అదేవిధంగా 2005 నుంచి సీపీఐ-మావోయిస్టు, దాని అనుబంధ సంఘాలపై కొనసాగుతున్న నిషేధాన్ని మరో ఏడాది పొడిగింపుచేస్తూ నిర్ణయించారు. పోలవరం హైడల్ ప్రాజెక్టు నవయుగ కంపెనీకి గతంలో కేటాయించడాన్ని రద్దుచేస్తూ ఏపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. కేబినెట్ సమావేశం అనంతరం రవాణాశాఖ మంత్రి పేర్ని నాని కేబినెట్ ఆమోద ముద్ర వేసిన వాటి వివరాలను విలేకరులకు వెల్లడించారు.

# పంజాబ్ బాణాసంచా కర్మాగారంలో భారీ పేలుడు

**కనీసం 19మంది మృతి చెంది ఉంటారని అనుమానం**
**ప్రమాదంలో చిక్కుకున్న మరో 50మంది**

అమృత్‌సర్,సెప్టెంబర్4(ఆర్‌ఎన్‌ఎ): పంజాబ్ గురుదాస్‌పూర్‌లోని ఓ బాణాసంచా ప్యాక్టరీలో భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో 19 మంది మృతి చెందినట్టుగా తెలుస్తోంది. మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు ధాటికి బాణసంచా ఫ్యాక్టరీ భవనం పూర్తిగా దెబ్బతింది. ఈ శిథిలాల కింద మరింత మంది చిక్కుకుని ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు యత్నిస్తున్నారు. ఘటన స్థలానికి చేరుకున్న జిల్లా యంత్రాగం పరిస్థితిని సమీక్షిస్తుంది. పేలుడు దాటికి బాణసంచా ఫ్యాక్టరీ పూర్తిగా కుప్పకూలిందని పేర్కొన్నారు. ఫ్యాక్టరీ సమీపంలోని భవనాలు కూడా దెబ్బతిన్నాయని వెల్లడించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి అమరీందర్ సింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని జిల్లా యంత్రాగాన్ని ఆదేశించారు. కర్మాగారంలో మరో 50 మంది చిక్కుకున్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఆగస్టు 31న మహారాష్ట్రలోని ధూలే జిల్లాలో ఇదే విధమైన విషాదం చోటుచేసుకుంది. రసాయన పరిశ్రమలో చోటుచేసుకున్న గ్యాస్ సిలిండర్ల పేలుళ్లలో 13 మంది కార్మికులు మృతిచెందగా 72 మంది గాయాలపాలయ్యారు.

# ఆస్పత్రిలో చేరిన అమిత్ షా...

**- స్వల్ప శస్త్రచికిత్స అనంతరం డిశ్చార్జ్ చేసిన వైద్యులు**

అహ్మదాబాద్, సెప్టెంబర్5(ఆర్‌ఎన్‌ఎ) : కేంద్ర హోంమంత్రి అమిత్ షా బుధవారం అహ్మదాబాద్‌లోని కేడీ ఆస్పత్రిలో చేరారు. ముక్కుకు చిన్నపాటి సర్జరీ కోసం ఆయన ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. సర్జరీ పూర్తయిన తరువాత బుధవారం రాత్రి సమయంలో అమిత్‌షా డిశ్చార్జ్ అయ్యారు. ఓ కుటుంబ కార్యక్రమం కోసం అహ్మదాబాద్ వచ్చిన అమిత్ షా.. నేరుగా వైద్యం కోసం కేడీ ఆస్పత్రికి వెళ్లినట్టు సమాచారం. కాగా జనవరిలో అమిత్ షా స్వైన్ ఫ్లూకి గురికావడంతో ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందిన సంగతి తెలిసిందే. ఛాతీ పట్టేసినట్టుగా ఉండడం, శ్వాస సంబంధిత ఇబ్బందులు రావడంతో ఎయిమ్స్ వెళ్లిన ఆయనకు... స్వైన్ ఫ్లూ సోకినట్టు వైద్యులు గుర్తించి చికిత్స అందించారు. ఇదిలా ఉంటే అమిత్‌షా అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరారనే వార్తలతో బీజేపీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది. ఏమైందని ఆరాతీయగా చిన్నపాటి సర్జరీనే అని తేలడంతో పార్టీ శ్రేణులు ఊపిరిపీల్చుకున్నారు.

# కాళేశ్వరం ఇంజనీరింగ్ అద్భుతం

**తక్కువ కాలంలో నిర్మించిన అతిపెద్ద ప్రాజెక్ట్**
**కాంగ్రెస్ విమర్శలు అర్థరహితం**
**ప్రాజెక్ట్‌ను సందర్శించిన కడియం శ్రీహరి**

భూపాలపల్లి, సెప్టెంబర్5 (ఆర్ఎన్ఎ): కాళేశ్వరం ప్రాజెక్టు ఒక ఇంజినీరింగ్ అద్భుతమని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. తెలంగాణ కోటి ఎకరాల మాగాణి కావాలని సీఎం కేసీఆర్ కృషి చేస్తుంటే పనిలేని వాళ్లు ఉనికి కోసం విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహాదేవపూర్ మండలంలో తెలంగాణ సర్కారు అత్యంత ప్రతిష్టాత్మకంగా కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలతో పాటు కన్నెపల్లి పంపు హౌస్‌ను ఎమ్మెల్సీ కడియం శ్రీహరి సందర్శించారు. తన వెంట సుమారు ఎనిమిది వేల మంది టీఆర్ఎస్ శ్రేణులు,రైతులతో కలసి ప్రాజెక్టులను సందర్శించారు. అనంతరం కడియం శ్రీహరి మాట్లాడుతూ తెలంగాణలో ఇంతటి భారీ ప్రాజెక్ట్ అతి స్వల్పకాలంలో నిర్మితం కావడం అద్భుతవన్నారు. బీజేపీకి తెలంగాణపై చిత్తశుద్ధి ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా గురించి మాటాల్డని బీజేపీ నేతలు.. తెలంగాణ ప్రజల గురించి మాట్లాడితే వినడానికి సిద్ధంగా లేరని చురకలు అంటించారు. బీజేపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే ప్రధాని మోదీని ఒప్పించి కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీకి అనుమతులు ఇప్పించి అప్పుడు మాట్లాడాలన్నారు. ఏదో నాలుగు సీట్లు రాగానే బీజేపీ ఎగిరి పడడం కరెక్ట్ కాదని కడియం శ్రీహరి ఎద్దేవా చేశారు. ఇక కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతుంటే విచిత్రంగానూ విడ్డూరంగా ఉందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఎక్కువ కాలం అధికారంలోఉండి తెలంగాణ ప్రాజెక్టులను పట్టించుకోకుండా తెలంగాణకు రావాల్సిన నీటిని ఆంధ్రాకు మళ్లించారని ఆరోపించారు. గోదావరి, కృష్ణా జలాలపై నీటి హక్కులను కాపాడకపోగా.. తెలంగాణకు జరిగిన అన్యాయంపై ఏ ఒక్కరూ మాట్లాడలేదన్నారు. కాంగ్రెస్ నాయకులకు అవినీతి అక్రమాల గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇప్పటికైనా కళ్లు తెరిచి తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి పేర్కొన్నారు.




కాళేశ్వరం ప్రాజెక్ట్ సందర్శనలో భాగంగా మేడిగడ్డ రిజర్వాయర్‌ను పరిశీలించిన మాజీ డిప్యూటి సిఎం, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి.

## ఏపీ వార్తలు

కవలలకు జన్మనిచ్చిన..

# 74ఏళ్ల బామ్మ!

గుంటూరు, సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ) : అమ్మ కావడం ఓ వరం. కొందరు దంపతులు మాత్రం పిల్లల కోసం చాలా ఏళ్లు నిరీక్షిస్తుంటారు. సంతానం కోసం డాక్టర్ల చుట్టూ, గుళ్ల చుట్టూ తిరుగుతారు. అలా ఎన్నో ప్రయత్నాలు చేసినా.. సంతాన భాగ్యం కలగని దంపతులు ఎందరో. అమ్మ కావాలనే కోరిక బలీయంగా ఉన్న ఓ మహిళ పెళ్లయిన 57 ఏళ్లకు, 74 ఏళ్ల వయసులో ఇద్దరు ఆడ పిల్లలకు జన్మనిచ్చింది. సంతాన సాఫల్య విధానంతో.. బామ్మ అని పిలిపించుకోవాల్సిన వయసులో మాతృత్వ మాధుర్యాన్ని ఆస్వాదిస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. తూర్పు గోదావరి జిల్లా నెలపర్తిపాడుకు చెందిన ఎర్రమట్టి రాజారావు, మంగాయమ్మ దంపతులకు ఐవీఎఫ్ విధానంలో సంతాన భాగ్యం కలిగింది. వీరికి 1962 లో పెళ్లయ్యింది. ఏళ్ల తరబడి హాస్పిటల్స్ చుట్టూ తిరిగినా సంతానం కలగలేదు. వయసు మీదపడినా మంగాయమ్మకు మాత్రం తల్లి కావాలని బలంగా ఉండేది. వారికి తెలిసిన ఓ మహిళ 55 ఏళ్ల వయసులో ఐవీఎఫ్ విధానంలో తల్లి అయ్యారు. దీంతో మంగాయమ్మలో ఆశలు చిగురించాయి. గతేడాది నవంబర్‌లో గుంటూరులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌ను సంప్రదించారు. ఐవీఎఫ్ నిపుణులైన డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ మంగాయమ్మన పరీక్షించారు. ఆవెకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకపోవడంతో.. ఐవీఎఫ్ విధానం చికిత్స ప్రారంభించారు. మంగాయమ్మ భర్త నుంచి వీర్యాన్ని, మరో మహిళ నుంచి అండాన్ని తీసుకొని ఐవీఎఫ్ విధానంలో పిండాన్ని ఆమె గర్భంలో ప్రవేశపెట్టారు. గర్భం దాల్చిన మంగాయమ్మను వైద్య బృందం పర్యవేక్షణలో ఉంచి చికిత్స అందించారు. వయసు రీత్యా మంగాయమ్మకు సాధారణ ప్రసవం అయ్యే అవకాశం లేదు. దీంతో గురువారం ఉదయం సిజేరియన్ చేశారు. మంగాయమ్మ కవలలకు జన్మనిచ్చిందని, తల్లీ బిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారని డాక్టర్ తెలిపారు. ప్రస్తుతం తల్లి, పిల్లలు క్షేమంగా ఉన్నట్టు వైద్యులు వెల్లడించారు. పండంటి ఇద్దరు ఆడపిల్లలు జన్మించడంతో.. 57 ఏళ్లుగా పిల్లల కోసం తపనపడ్డ ఆ దంపతుల కల నెరవేరింది. దీంతో వారి కుటుంబంలో సంతోషం నెలకొంది. కాగా, దీంతో మంగాయమ్మ ప్రపంచంలో ఐవీఎఫ్ చేయించుకున్న అతి పెద్ద మహిళగా రికార్డు నెలకొల్పారు. ఇప్పటివరకు రాజస్తాన్‌లో దల్జీందర్ పేరిట ఈ రికార్డు ఉంది. దల్జీందర్ 72 ఏళ్ల వయస్సులో మగ బిడ్డకు జన్మనిచారు. 2016లో ఐవీఎఫ్ విధానంలో వారికి పిల్లలు కలిగారు. అప్పటికి ఆమె వయసు 72 ఏళ్లు. ప్రస్తుతం మంగాయమ్మ 74 ఏళ్ల వయసులో తల్లి అయ్యారు.



**- కృత్రిక గర్భదారణలో గర్భందాల్చిన మంగాయమ్మ**
**- సిజేరియన్ ఆపరేషన్ ద్వారా పురుడుపోసిన వైద్యులు**
**- తల్లీ, ఇద్దరు బిడ్డలు ఆరోగ్యంగా ఉన్నట్లు వెల్లడి**
**- ప్రపంచ రికార్డు అంటున్న వైద్యులు**

# ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ద

## జ్వరపీడితులకు మందులు పంపిణీ చేసిన మంత్రి ఈటెల

మేడ్చల్, సెప్టెంబర్5 (ఆర్ఎన్ఎ): మల్కాజ్ గిరి జిల్లా కీసర మండలంలోని దమ్మాయిగూడ మున్సిపాలిటీలో డెంగ్యూ మలేరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రులు ఈటెల రాజేందర్, మల్లారెడ్డి పాల్గొన్నారు. వైరల్ ఫీవర్ బాధితులకు ఉచిత మందుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి కార్యక్రమంలో వైద్య అధికారులు, టీఆర్ఎస్ నాయకులు, టీఆర్ఎస్ శ్రేణులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఈటెల మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆరోగ్యంపై సమన్వయంతో సమీక్షలు నిర్వహిస్తున్నామని మంత్రి ఈటెల అన్నారు. ఈ మధ్యకాలంలో ఎడతెరిపి లేని వర్షాల వల్ల పట్టణ ప్రాంతాల్లోని బస్తీలు అనేక మందికి వైరల్ ఫీవర్స్ వస్తున్నాయి. చికిత్స కోసం హైదరాబాద్‌లోని కొన్ని వందల హెల్త్ క్యాంపులు పెట్టామన్నారు. అన్ని అర్బన్ సెంటర్లలో సాయంత్రం క్లీనిక్ సెంటర్లు పెట్టి వేలాదివందికి చికిత్స ఇస్తున్నామని మంత్రి ఈటెల చెప్పారు. జ్వరాల బాధితుల కోసం మంత్రి ఈటెల పెద్ద ఎత్తున హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నారని మంత్రి తెలిపారు. జ్వరాల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జ్వరాల బాధితులకు ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. వర్షాలు పడుతుండడంతో అదనంగా 100 మంది సిబ్బందిని నియమించి ఎక్కడా నీరు నిల్వ లేకుండా చూడాలని మంత్రి మల్లారెడ్డి అన్నారు.

# ముంబైలో శ్రీవారి ఆలయానికి స్థలంకేటాయింపు

తిరుమల, సెప్టెంబర్5 (ఆర్ఎన్ఎ): రాజధాని ముంబైలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయింపు చేసింది. దేశంలోని ప్రముఖ నగరాల్లో ఒకటైన ముంబయిలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం 6,975 చ.అడుగుల స్థలాన్ని కేటాయించింది. ఈ మేరకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీదేవేంద్ర ఫడ్నవీస్ ముంబయిలోని తన అధికార నివాసంలో స్థలం కేటాయింపు ఉత్తర్వులను టీటీడి తిరుపతి జెఈవో పి.బసంత్‌కుమార్‌కు అందజేశారు. దేశవ్యాప్తంగా శ్రీవారి దివ్యక్షేత్రాల నిర్మాణానికి టిటిడి కృషి చేస్తోంది. ఇందులో భాగంగా ముంబయిలో స్థలం కోసం చాలాకాలంగా మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతోంది. టిటిడి ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ వినతి మేరకు ఆ రాష్ట్ర ప్రభుత్వం ముంబయిలోని ప్రధాన ప్రాంతమైన తూర్పు బాంద్రాలో స్థలాన్ని కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ స్థలం అనుభవ ఉత్తర్వులను ముంబయి సబర్బన్ జిల్లా కలెక్టర్ మిలింద్ బోరికర్ టిటిడి జెఈవోకు అందజేశారు. ఈ స్థలంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంతోపాటు సమాచార కేంద్రాన్ని టిటిడి నిర్మించనుంది

# నేడు శ్రీకాకుళంలో జగన్ పర్యటన

శ్రీకాకుళం, సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శుక్రవారం శ్రీకాకుళం జిల్లాలో సుడిగాలి పర్యటన చేపట్టనున్నారు. ఉదయం 10 గంటలకు పలాస చేరుకొంటారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యసేవలను అందించేందుకు నిర్మించదలచిన 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, పరిశోధనా కేంద్రానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం కాశీబుగ్గ రైల్వే గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు. ప్రయోగాత్మకంగా తలపెట్టిన ఇంటింటికీ నాణ్యమైన బియ్యం పథకాన్ని అక్కడే సీఎం ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎచ్చెర్ల చేరుకొని ట్రిపుల్ ఐటీలో తరగతి గదులను, హాస్టల్ బ్లాకులను ప్రారంభిస్తారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3.30 గంటలకు సింగుపురం వద్ద నిర్మించిన అక్షయపాత్ర ఫౌండేషన్ సెంట్రలైజ్డ్ కిచెన్‌ను జగన్ ప్రారంభిస్తారు.

# నిరక్షరాస్యతను సున్నా చేయడమే లక్ష్యం

**- ప్రభుత్వ పాఠశాలల్లో గణనీయమైన మార్పులకు కట్టుబడి ఉన్నాం**
**- గురుపూజోత్సవంలో ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి**



విజయవాడ, సెప్టెంబర్5(ఆంఎన్ఎ) : ఏపీని సున్నాశాతం నిరక్షరాస్యతగా రూపుదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం విజయవాడలోని మున్సిపల్ ఎంప్లాయిస్ కాలనీలోని ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన గురుపూజోత్సవంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. వులందరికీ వందనాలు. నాకు చదువు నేర్పిన గురువులకు పాదాభివందనాలు అని వ్యాఖ్యానించారు. అధ్యాపకుడిగా జీవితాన్ని ప్రారంభించి.. రాష్ట్రపతిగా ఎదిగిన డా. సర్వేపల్లి రాధాకృష్ణ అందరికీ ఆదర్శమని కొనియాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి గురువుల పట్ల ఎంతో భక్తిశ్రద్ధలు చూపించారని అన్నారు. గురువు వెంకటప్పయ్య పేరుతో వైఎస్సార్ పులివెందులలో స్కూల్‌ను స్థాపించారని తెలిపారు. వైఎస్సార్ ఫౌండేషన్ ఇప్పటికీ ఆ స్కూలును నడుపుతోందని అన్నారు. గురువు విద్యార్థుల గుండెలపై ముద్ర వేయగలరు అనేందుకు ఇదే నిదర్శనమన్నారు. గురువు చేసిన పని ఎవరూ చేయలేరన్నారు. రాష్ట్రంలో నిరక్షరాస్యత శాతం సున్నా చేయాలన్నది తన లక్ష్యంగా సీఎం జగన్ పేర్కొన్నారు. బ్రిక్స్ ఎకానమీ లెక్కల ప్రకారం కాలేజీలకు వెళుతున్న విద్యార్థులు మన దేశంలో కేవలం 36 శాతమేనని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో గణనీయమైన మార్పుకు కట్టుబడి ఉన్నామన్నారు. దీనిలో తల్లిదండ్రులను భాగస్వామ్యం చేస్తున్నామని తెలిపారు. ప్రతి స్కూల్లో మార్పులు తెస్తామని, ప్రతి స్కూల్‌ను ఇంగ్లీషు మీడియం చేయాలని తాపత్రయపడుతున్నానన్నారు. ప్రతి విద్యార్థి గవర్నమెంట్ స్కూల్‌కు రావాలనే విధంగా విద్యావ్యవస్థను తీర్చిదిద్దుతామని చెప్పారు.

# నా పైనే వేటు వేస్తారా... ?

## సెలక్షన్ కమిటీ మెంబర్‌కు బంగర్ బెదిరింపులు

ముంబై, సెప్టెంబర్4 (ఆంఎన్ఎ): టీమిండియా బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ వివాదంలో చిక్కుకున్నాడు. తనకు కొనసాగింపు ఇవ్వకపోవడంపై తీవ్ర అసంతృప్తితో ఉన్న బంగర్ సెలక్షన్ కమిటీ సభ్యుడిని బెదిరించిన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఒక దశలో బంగర్ చాలా అమర్యాదగా ప్రవర్తించినట్టు బోర్డు వర్గాల సమాచారం. విండీస్ పర్యటన ముగిసిన తర్వాత తాజా వివాదం తెరపైకి రావడం చర్చనీయాంశమైంది. రెండు వారాల క్రితం జరిగిన ఈ ఘటన భారత క్రికెట్ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది. ఇటీవలే టీమిండియా కోచ్ పదవితో పాటు సహాయక సిబ్బందికీ ఇంటర్వ్యూలు నిర్వహించిన బీసీసిఐ పలువురిని ఎంపిక చేసింది. దీనిలో భాగంగానే బ్యాటింగ్ కోచ్ గా ఉన్న సంజయ్ బంగర్ పై వేటు పడింది. అతని స్థానంలో విక్రమ్ రాథోడ్ ను ఎంపిక చేసింది. అయితే తనపై వేటు పడడాన్ని తీవ్రంగా తీసుకున్న బంగర్ సంయమనం కోల్పోయినట్టు తెలుస్తోంది. హోటల్లో బస చేసిన సెలక్షన్ కమిటీ సభ్యుడు దేవాంగ్ గాంధీ గదికి వెళ్ళి బెదిరింపులకు పాల్పడినట్టు సమాచారం. తనకు జట్టులో ప్రతి ఆటగాడి మద్ధతుందని, ఎలా తప్పిస్తారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసాడు. అలాగే బ్యాటింగ్ కోచ్ పదవికి ఇవ్వకుంటే... జాతీయ క్రికెట్ అకాడమీలో ఏదో ఒక పదవి ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు తెలుస్తోంది. ఈ మొత్తం ఘటనపై దేవాంగ్ గాంధీ సిఓఎ చీఫ్ వినోద్ రాయ్ దృష్టికి తీసుకెళ్ళాడు. దీనిపై నిజానిజాలు తెలుసుకోవాలని వినోద్ రాయ్ విచారణకు ఆదేశించారు. ఒకవేళ దేవాంగ్ గాంధీని బంగర్ అవమానించినట్టు తేలితే మాత్రం అతనిపై కఠిన చర్యలు తీసుకోవడం ఖాయం. అసలు బంగర్ పై వేటు పడడానికి ప్రధాన కారణం జట్టులో నాలుగో స్థానం. దాదాపు రెండేళ్ళుగా నాలుగో నెంబర్ బ్యాట్స్ మెన్ ఎవరనే దానిపై తీవ్ర చర్చ నడిచింది. సెలక్టర్లు కూడా పలువురు యువ క్రికెటర్లకు అవకాశమిచ్చారు. దీనిలో రాయుడు ఒకటి రెండు సార్లు విఫలమైనా... పలు సందర్భాల్లో నిరూపించుకున్నాడు. అయితే శ్రేయాస్ అయ్యర్, పంత్, మనీశ్ పాండే, కెఎల్ రాహుల్... ఇలా మరికొందరిని పరీక్షించి ఎవ్వరికీ సరైన అవకాశం ఇవ్వలేదన్నది విమర్శకుల వాదన. దీనికి తగ్గట్టుగానే ప్రపంచకప్ లో భారత్ నిష్క్రమించడానికి నాలుగో స్థానం కూడా కారణమైంది. అలాగే సెమీస్ లో ధోనీని చివరి వరకూ బ్యాటింగ్ కు పంపకుండా... సొంత నిర్ణయంతో బంగర్ వ్యవహరించినట్టు విమర్శలు ఉన్నాయి. దీనికి తోడు సెలక్టర్లు ఇంటర్వ్యూ నిర్వహించినప్పుడు సరైన విధంగా సమాధానాలు చెప్పకపోవడం బంగర్ పై వేటు పడడానికి కారణమైంది. అయితే తనపై వేటు పడడాన్ని అవమానంగా భావించిన బంగర్ సెలక్షన్ కమిటీ సభ్యుడు దేవాంగ్ గాంధీపై చిందులు తొక్కినట్టు తెలుస్తోంది. ఒక దశలో బెదిరింపు ధోరణిలోనూ మాట్లాడినట్టు బోర్డు వర్గాలు చెబుతున్నాయి.

# నేడు డయల్ యువర్ ఇవో

తిరుమల, సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): తిరుమలలోని అన్నమయ్య భవనంలో ప్రతినెలా మొదటి శుక్రవారం ఉదయం 8.30 గం॥ల నుండి ఉదయం 9.30 గంట॥ల నడుమ నిర్వహించే డయల్ యువర్ ఈవో కార్యక్రమం సెప్టెంబర్ 6వ తేదీన శుక్రవారం జరుగనుంది. ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలను, సూచనలను టిటిడి కార్యనిర్వహణాధికారి అనిల్‌కుమార్ సింఘాల్ గారికి ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తెలుపవచ్చు.

ఇందుకు భక్తులు సంప్రదించవలసిన నెంబరు 0877-2263261. కాగా, డిసెంబర్ నెలకు సంబంధించిన శ్రీవారి ఆలయం, టిటిడి స్థానికాలయాల ఆర్జిత సేవా టికెట్లను ఉదయం 10.00 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు.

శ్రీవారి సేవ నమోదుకు డిసెంబర్ నెల కోటాను కూడా విడుదల చేస్తారు.

# నిండుకుండలా కడెం ప్రాజెక్ట్

నిర్మల్, సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): జిల్లాలో అతిపెద్దదైన కడెం ప్రాజెక్టులోకి వరదనీరు రాకడ కొనసాగుతోంది. ఎగువ ప్రాంతంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ప్రాజెక్టు రిజర్వాయర్‌లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. రిజర్వాయర్‌లోకి 919 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో అధికారులు ప్రాజెక్టు రెండు వరద గేట్లు ఎత్తి 13,122 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 698.150 అడుగు ల నీటిమట్టం ఉంది. అధికారులు ఎప్పటికప్పుడు ప్రాజెక్టు పరిస్థితిని సమీక్షిస్తూ ఉన్నతాధికారులకు సమాచారం చేరవేస్తున్నారు. పైఅధికారుల ఆదేశాల మేరకు నీటి నిల్వ చేస్తూ మిగతా నీటిని గోదావరిలోకి వదులుతున్నారు.

# వృద్ధిరేటు మందగమనం దేనికి సంకేతం?

## ఆందోళన కలిగిస్తున్న ఆర్‌బిఐ వివరాలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): దేశానికి ఉజ్వల ఆర్థిక భవితను, 5 ట్రిలియన్ డాలర్ల బలమైన వ్యవస్థను వాగ్దానం చేస్తున్న పాలకులు ఈ పతన వేగాన్నైనా ఎందుకు ఆపలేకపోతున్నారు. వృద్ధి రేటు తగ్గిందంటే ఆయా రంగాల్లో డిమాండ్ కూడా ఆ మేరకు పడిపోయిందని అర్థం.గత ఆరున్నర సంవత్సరాల కాలంలో ఇదే అత్యంత పతన జిడిపి రేటు కావడం గమనించవలసిన అంశం. అంతకు ముందరి త్రైమాసికం (2019 జనవరి మార్చి) లో 5.8 శాతంగా నమోదయిన వృద్ధి రేటు ఉన్నపళంగా పాయింట్ 8 శాతం పడిపోయింది. మార్కెట్ నిపుణులు కూడా ఇంత భారీ పతనాన్ని ఊహించలేదు. వృద్ధి రేటు 5.7 శాతం వద్ద నిలబడుతుందని వారు వేసిన అంచనా కూడా రుజువు కాలేదు. 2018-19 ఆర్థిక సంవత్సరం తొలి మూడు మాసాల కాలంతో పోల్చుకుంటే తయారీ రంగం వృద్ధి రేటు భారీగా 12 శాతం పడిపోయింది. గత ఏడాది తొలి త్రైమాసికంలో అది 12.1 శాతంగా నమోదయింది. ఈ ఏప్రిల్ జూన్‌లో కేవలం 0.6 శాతం రికార్డయింది. పేదలు ఉపాధి లేక తిన తిండి కరవై అల్లాడుతుంటే ధనికులు సునాయాస మార్గాల్లో బ్యాంకులను దోచుకుని కోట్లకు పడగెత్తుతున్నారు. ఈ దోపిడీని అరికట్టడంలో బ్యాంకుల యాజమాన్యాలు చూపిస్తున్న చొరవ దాదాపు లేదనే చెప్పాలి. ఒక బ్యాంకు మోసం జరిగిన తర్వాత దానిని కనుగోడానికి సగటున 22 మాసాల వ్యవధి పడుతున్నదని ఆర్‌బిఐ నివేదిక లెక్కకట్టి చెప్పింది. దీనిని బట్టి తమ కాళ్ల కింద తవ్వుతున్న గోతులను గమనించడంలో కూడా మన బ్యాంకులు ముఖ్యంగా ప్రభుత్వరంగ బ్యాంకులు ఎంత మొద్దు నిద్రను, ప్రమత్తతను చిత్తగిస్తున్నాయెా అర్థమవుతున్నది. ఇంటర్‌నెట్ బ్యాంకు మోసాలు 0.3 శాతం మాత్రమేనని రిజర్వు బ్యాంకు నివేదిక వెల్లడించింది, బ్యాంకుల మేనేజర్లు తదితర పర్యవేక్షక సిబ్బంది రుణగ్రహీతలతో కుమ్మక్కయ్యో, వారి వల్ల మోసపోయో జరుగుతున్న కేసులే ఎక్కువని స్పష్టపడుతున్నది. తయారీరంగ కంపెనీలలో అమ్మకాల పతనం మొత్తం ఆర్థిక రంగం స్థైర్యాన్ని దెబ్బ తీస్తున్నదని రిజర్వు బ్యాంకు నివేదిక అభిప్రాయపడింది. ఈ త్రైమాసికంలో మోటారు సైకిళ్ల విక్రయాలు 8.8 శాతం తగ్గగా ట్రాక్టర్ల అమ్మకాలు 14.1 శాతం పడిపోయాయి. అదే సమయంలో మన ఎగుమతి దిగుమతి రంగాలూ అధోగతి పట్టాయని స్పష్టం చేసింది. ఇన్ని విధాల పతన ముఖంగా సాగుతున్న దేశ ఆర్థిక వ్యవస్థకు బ్యాంకులలో మోసాల కిమ్మత్తు అసాధారణంగా పెరిగిపోడం మృత్యుఘాతం వంటిది. ఏమేమి దిద్దుబాటు చర్యలు తీసుకుంటారోగాని ఈ దుస్థితిని అరికట్టలేకపోతే ఇతరత్రా ఎన్నెన్ని గొప్పలు చెప్పుకున్నా అవి గాలి తీసిన బంతినే తలపిస్తాయి.

# గవర్నర్‌కు సచివాలయ ఉద్యోగుల వీడ్కోలు

హైదరాబాద్,సెప్టెంబర్5 (ఆర్ఎన్ఎ): గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్‌కు సచివాలయం ఉద్యోగుల సంఘం నేతలు ఘనంగా వీడ్కోలు పలికారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ. పద్మాచారి, పవన్‌కుమార్ గౌడ్, సభ్యులు బుధవారం రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమలో పాల్గొన్నారు. నీళ్ళు, నియామకాల్లో తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని కేంద్రానికి ఎప్పటికప్పుడు తెలియజేసారంటూ గవర్నర్‌కు ఈ సందర్భంగా పద్మాచారి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రజల సుదీర్ఘ ఆకాంక్షల మేరకు సహకారాన్నందించిన గొప్ప రాజనీతిజ్ఞుడు నరసింహన్ అని పేర్కొన్నారు. 'నేను సైతం' అంటూ తెలంగాణ జనజీవన స్రవంతిలో కలిసిపోయిన నరసింహన్ ఒక గొప్ప వ్యక్తి అని పద్మాచారి కితాబిచ్చారు. తెలంగాణ సమాజాకం ఎప్పటికీ గుర్తుంచుకోదగ్గ నేత నరసింహన్ అని పేర్కొన్నారు.

# రోడ్డున పడుతున్న ఉద్యోగులు

హైదరాబాద్, సెప్టెంబర్ 5:ఆర్థిక మందగమనం నేపథ్యంలో దేశంలోనిరుద్యోగ సమస్యతీవ్ర రూపం దాల్చే ప్రమాదం ముంచుకొస్తోంది. కొత్తగా ఉద్యోగాల సృష్టి అన్నది మిథ్యగా మారింది. ప్రభుత్వ ఉద్యోగాల సంగతెలా ఉన్నా ప్రైవేట్రంగంలోనూ మాంద్యంప్రభావం తీవ్రంగా కనపడుతోంది. ఉన్నపళంగా ఉద్యోగాలను ఊడబెరి కేస్తున్నారు. దీంతో వేలాదిమంది నిరుద్యోగులుగా రోడ్డున పడుతున్నారు. ఉన్ననిరుద్యోగులకు తోడు వీరుకూడా రోడ్డున పడడంతో తీవ్ర అనిశ్చితికి దారితీసే ప్రమాదం ఏర్పడుతోంది. దీనిపై తక్షణం చర్చించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాలు ప్రధానంగా ఇప్పుడీ సమస్యపై దృష్టి సారించాలి. మాంద్యం నేపథ్యంలో ఆటోమొబైల్ రంగం పీకల్లోతు సంక్షోభంలో చిక్కుకుంది. కార్ల అమ్మకాలు 20 ఏళ్ల కనిష్టానికి పడిపోయాయి. ఈ ఒక్క రంగంలోనే మూడున్నర లక్షల మంది ఉద్యోగులు వీధిన పడ్డారు. పార్లే బిస్కెట్ కంపెనీ యాజమాన్యం సంక్షోభాన్ని సాకుగా చూపి పది వేల మందిని తొలగించేందుకు రంగం సిద్ధం చేసింది. రక్షణరంగం ప్రైవేటీకరణ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న 82వేల మంది రెగ్యులర్ ఉద్యోగులను, మరో 40 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను తీవ్ర అభద్రతలోకి నెట్టింది. 45 ఏళ్లలో ఎన్నడూ లేనంత గరిష్ట స్థాయికి నిరుద్యోగం పెరగడానికి ఈ విధానాలే కారణం. నిరుద్యోగం ఉగ్ర రూపం దాల్చితే జరిగే పరిణామం ప్రజల్లో కొనుగోలు శక్తి పడిపోతుంది. కొనుగోలు శక్తి తగ్గడం వల్ల మార్కెట్లో సరుకులకు గిరాకీ పడిపోతున్నది. డిమాండ్ తగ్గినప్పుడు సరుకుల ఉత్పత్తిని తగ్గించుకోవాల్సి వస్తుంది. ఇది ఫ్యాక్టరీల మూసి వేతకు దారితీస్తుంది. దీనివల్ల మరింత మంది ఉపాధి కోల్పోయి వీధిన పడతారు. ఇదంతా ఒక విషవల యంగా మారుతోంది. ఇప్పటికే 9 శాతానికి చేరుకున్న నిరుద్యోగిత రేటుకు ప్రస్తుత విధానాలు మరింత ఆజ్యం పోస్తున్నాయి. 33 శాతానికిపైగా ఉన్న యువత ఉపాధి లేమితో ఇబ్బంది పడుతున్నది. నిజ వేతనాలు పడిపోతున్నాయి. అంబానీ,ఆదానీల ఆస్తులు మాత్రం వందల రెట్లు పెరుగుతున్నాయి. ఇంకో వైపు 66 శాతం మందికి జీవనాధారంగా ఉన్న వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుంటే రైతుల పండించే పంటకు కనీస మద్దతు ధర ప్రకటించ కుండా మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాలకు వదిలేస్తోంది. గ్రామీణులకు ఎంతో కొంత ఆసరాగా ఉండే జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చడంతో గ్రామీణ నిరుద్యోగం కూడా తీవ్ర రూపం దాల్చుతున్నది. ప్రభుత్వాలలు వీటిపై దృష్టి పెట్టడానికి బదులు కార్పొరేట్లకు లాభాలు పెంచే చర్యలు చేపడుతున్నాయి. జబ్బు ఒకటి అయితే మందు మరొకటి అన్న చందంగా చర్యలు ఉంటున్నాయి. ప్రజల్లో కొనుగోలుశక్తి పెంచడానికి చర్యలు చేపట్టకుండా బడా వ్యాపారులకు మరిన్ని రుణాలు ఇస్తున్నది. వీరంతా ఇప్పటికే భారీగా బ్యాంకుల నుండి రుణాలను పొం, తిరిగి చెల్లించకుండా ఎగనామం పెట్టడంతో బ్యాంకులు కూడా తీవ్రనష్టాల్లో ఉన్నాయి. ఎన్‌పిఎలు పెరిగి పోతున్నాయి. బ్యాంకుల విలీనం, అంకుర సంస్థలపై ఏంజెల్ టాక్స్ రద్దు, బ్యాంకు వడ్డీ రేట్ల తగ్గింపు, రెపోరేటు కుదింపు, జిఎస్‌టి రాయితీలు, విదేశీ సంస్థాగత పెట్టుబడులపై సర్ ఛార్జి రద్దు వంటి పలు ఉద్దీపనలు ఇప్పటికే ప్రకటించింది. మరి కొన్ని ప్రకటించడానికి కసరత్తు చేస్తోంది. దీనికితోడు గ్రామీణ ఆర్థిక వ్యవస్త కోలుకోలేని విధంగా తయారయ్యింది. చేతివృత్తులకు ప్రోత్సాహం కరువయ్యింది. ప్రధాని మాజీ ఆర్థిక సలహాదారు సెలవిచ్చినదాని ప్రకారం చూస్తే వాస్తవ వృద్ధి రేటు ఇంకా దిగజారి ఉంటుంది. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్థిక వ్యవస్థ వాస్తవ పరిస్థితిని దాచిపెట్టి అంకెలను మతలబు చేసి వృద్ధి రేటు 7 శాతం దాకా ఉన్నట్లు చూపిస్తూ వచ్చారని ప్రధాని మాజీ ఆర్థిక సలహాదారు అరవింద సుబ్రమణ్యం, ఆర్‌బిఐ మాజీ గవర్నరు రఘురామ్ రాజన్ వంటివారు ప్రకటించారు. మూడు దశాబ్దాలుగా భారత్ అనుసరిస్తూ వస్తున్న నయా ఉదారవాద విధానాలకు తోడు మోడీ ప్రభుత్వం అమలు చేసిన నోట్ల రద్దు, జిఎస్‌టి వంటి మతిమాలిన చర్యల వల్ల దేశం నేడు అసాధారణ మాంద్య పరిస్థితులను ఎదుర్కొంటున్నది. ఆర్థిక వ్యవస్థలో కీలకమైన ఉత్పాదక రంగం వృద్ధి రేటు గణనీయంగా పడిపోయింది. దేశీయ, విదేశీ రుణభారాన్ని విపరీతంగా పెంచేసింది. విమానాలు, రైల్వేలు, చమురు, గ్యాస్ వంటి సహజవరులను ప్రైవేట్ పరం అవుతున్నా ఉద్యోగాల భర్తీ పెరగడం లేదు. మరో వైపు కార్మిక హక్కులపై ఎడా పెడా దాడులకు దిగుతున్నది. అనర్థాలకు మూలమైన విధానాలను మరింత లోతుగా అధ్యయనం చేస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటనతో పెద్దగా ఊరడింపు దక్కలేదు. దేశాన్ని వణికిస్తున్న మాంద్యాన్ని అది ఏమాత్రం పరిష్కరించజాలదు. 2008లో వచ్చిన మాదిరిగా మరో సారి ప్రపంచ వ్యాపిత్తంగా మాంద్యం ముంచుకొస్తే మళ్లీ తట్టుకుని నిలవడానికి లేని స్థితికి మన ఆర్థిక వ్యవస్థను ముంచుతున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర మాంద్యంలో కూరుకుపోతుండడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. ఆర్థిక పతనం అసంఖ్యాక శ్రామిక వర్గ ప్రజానీకం జీవితాలపై తీవ్ర దుష్ప్రభావం చూపుతుంది. ఐఎంఎఫ్, ఇతర ఆర్థిక సంస్థలు హెచ్చరించినట్టే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికంలో వృద్ధి రేటు ఒక్కసారిగా 5 శాతానికి పడిపోయింది. ఈ దశలో నిరుద్యోగం పెరగక్కుండా జాగ్రత్తలు తీసుకోవాలి. లేకుంటే దేశంలో అనిశ్చితి పెరిగే ప్రమాదం ఉంది.

# యూ ట్యూబ్ నుంచి లక్ష వీడియోల తొలగింపు

## ప్రకటించిన గూగుల్

న్యూఢిల్లీ,సెప్టెంబర్5 (ఆంఎన్ఎ): సాఫ్ట్‌వేర్ దిగ్గజ సంస్థ గూగుల్‌కు చెందిన యూట్యూబ్ ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు తన సైట్‌లో లక్ష వీడియోలను తొలగించినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. 17వేలకు పైగా చానల్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సదరు వీడియోలను తొలగించామని యూట్యూబ్ తెలిపింది. కాగా ఆ వీడియోలు ఎక్కువగా ఇతరుల మనోభావాలను కించ పరిచే విధంగా ఉన్నాయని, అందుకనే వాటిని తొలగించామని ఆ సంస్థ తెలియజేసింది. ఇక ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో మొత్తం 90 లక్షలకు పైగా వీడియోలను, 40 లక్షలకు పైగా యూట్యూబ్ అకౌంట్లను తొలగించామని కూడా ఆ సంస్థ తెలిపింది. వాటిలో చాలా వరకు స్పాం కేటగిరీకి చెందిన వీడియోలు ఉన్నాయని, అనేక వీడియోలు వీక్షకులను తప్పుదోవ పట్టించే స్కాం విభాగా నికి చెందినవిగా కూడా ఉన్నాయని ఆ సంస్థ పేర్కొంది. అందుకనే వాటిలో చాలా వరకు వీడియోలను ఒక్కరు కూడా వీక్షించకముందే యుూట్యూబ్ నుంచి తొలగించామని ఆ సంస్థ తెలియజేసింది. ఇకపై కూడా తమ పాలసీలను మరింత కఠినంగా అమలు చేస్తామని, యుూట్యూ బ్‌లో యూజర్లు అప్‌లోడ్ చేసే వీడియోలను పరిశీలించేందుకు 10వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని గూగుల్ తెలిపింది.

# వాహన తనిఖీలకు కెమెరాలు

## కోయంబత్తూరు పోలీసుల ప్రయోగం

కోయంబత్తూర్,సెప్టెంబర్5 (ఆర్ఎన్ఎ): వాహన తనిఖీలు జరిగే తీరును పర్యవేక్షించేందుకు కోయంబత్తూరు ట్రాఫిక్ పోలీసులు బాడీ వార్న్ కెమెరాలు ఉపయోగించనున్నారు. మోటార్ వెహికిల్ చట్టం సవరణతో కొత్త నియమనిబంధనలు అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించడం వల్ల జరిగే ప్రమాదాలకు చెక్ పెట్టాలంటే వాహన తనిఖీల సమయంలో పారదర్శకత పాటించడం చాలా ముఖ్యం.

ఇప్పటికే 'ఉయిర్' సౌజన్యంతో కోయంబత్తూరు పోలీసులకు 70 కెమెరాలను అందజేశారు. బాడీ వార్న్ కెమెరాలను ట్రాఫిక్ విధులు నిర్వర్తించే పోలీసులు తమ భుజంపై బిగించుకుంటారు. ట్రాఫిక్ పోలీసులు డ్యూటీలో ఉన్న 8గంటలపాటు జరిపే వాహన తనిఖీలు ఈ కెమెరాల్లో రికారుకానున్నాయి. కొత్త నిబంధనల నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు పారదర్శకంగా విధులు నిర్వర్తించేలా ఈ కెమెరాలు ఉపకరించనున్నాయి. వాహనదారుడు లైసెన్స్, ధ్రువ పత్రాలు, హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ పెట్టుకున్నాడా లేదా వంటి దృశ్యాలు బాడీ వార్న్ కెమెరాలో నిక్షిప్తం కానున్నాయి. అంతేకాదు ట్రాఫిక్ నియమనిబంధనలకు అనుగుణంగా జరిమానాలు వేస్తున్నారా లేరా అనే విషయాన్ని కూడా ఈ కెమెరాల ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుందని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ వీ పెరుమాల్ తెలిపారు.

# చపాతీలు గుండ్రంగా లేవని గొడవ

## చెల్లెలిని తుపాకీతో కాల్చి చంపిన అన్న

లక్నో,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): చపాతీలు గుండ్ర ంగా చేయలేదని ఓ అన్న తన సొంత చెల్లిని తుపాకీ కాల్చి చంపాడు. ఈ దుర్ఘటన ఉత్తర ప్రదేశ్‌లోని లఖ్మీపూర్ ఖేరీ జిల్లా మహ్మదీ కోట్వాలీ పోలీస్ స్టేషన్ పరిధిలోని బార్‌ఖేర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుమన్ సింగ్ అనే మహిళ (30) తన పెద్దమ్మ ఇంటికి వచ్చింది. సుమన్ సింగ్ గత రెండు రోజుల నుంచి చపాతీలు చేస్తోంది. చపాతీ గుండ్రంగా లేవని సుమన్ సింగ్ పెద్దమ కుమారుడు సోనూ గొడవకు దిగాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తాగిన మైకంలో ఉన్న సోనూ తన తండ్రి రూమ్‌లో ఉన్న లైసెన్స్ గన్ తీసుకొచ్చి సుమన్ సింగ్ తలపై కాల్చాడు. దీంతో ఆమె ఘటనా స్థలంలోనే చనిపోయింది. గ్రామస్థుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీస్ అధికారి సంజయ్ త్యాగి ఆమె మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని శవ పరీక్ష నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సోనూ మాత్రం పరారీలో ఉన్నాడు. అతి త్వరలో నిందితుడిని అరెస్టు చేస్తామని సంజయ్ చెప్పాడు. సుమన్ సింగ్ గత సంవత్సరం అడ్వకేట్ ను పెళ్లి చేసుకుంది. బిజెపిలో చురుకైన కార్యకర్తగా ఆమె పని చేస్తోందని బంధువులు తెలిపారు.

# లండన్‌లో పాక్ దుశ్చర్య

## -భారత్ దౌత్య కార్యాలయంపై దాడి

న్యూఢిల్లీ,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): లండన్‌లోని భారత దౌత్య కార్యాలయంపై మరోసారి దాడి జరిగింది. జమ్మూకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దును నిరసిస్తూ.. పాకిస్థాన్‌కు చెందిన కొందరు లండన్‌లోని భారత దౌత్య కార్యాలయం ఎదుట నిన్న నిరసనకు దిగారు. పీవోకే జెండాలను ప్రదర్శిస్తూ.. పాకిస్థాన్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. అంతటితో ఆగకుండా కార్యాలయంపై దాడి చేసి కిటికీలను పగులగొట్టారు. భవనం అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ మేరకు ఇండియన్ హై కమిషన్ ట్వీట్ చేసింది. ఈ ఘటనను లండన్ మేయర్ సాధిక్ ఖాన్ తీవ్రంగా ఖండించారు. ఈ దాడి హేయమైన చర్య అని ఆయన అన్నారు. దాడికి పాల్పడ్డ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆగస్టు 15వ తేదీన కూడా పాకిస్థాన్‌కు చెందిన వారు భారత దౌత్య కార్యాలయం ముందు నిరసనకు దిగి, కోడిగుడ్లు, వాటర్ బాటిళ్లతో దాడి చేసిన సంగతి తెలిసిందే.

# మాజీఖైదీ చేతిలో 8మంది విద్యార్థుల హతం

## దర్యాప్తు చేపట్టిన చైనా పోలీసులు

బీజింగ్,సెప్టెంబర్ 5(ఆంఎన్ఎ): సెంట్రల్ చైనాలో ఘోరం జరిగింది. హుబే ప్రావిన్స్‌లోని బైయాంగ్‌పింగ్ లోని ఓ ప్రాథమిక పాఠశాలలో రక్తపుటేరులు పారాయి. ఓ మాజీ ఖైదీ(40) వీరంగం సృష్టించాడు. ఉదయం 8 గంటలకు పాఠశాలలోకి ప్రవేశించిన మాజీ ఖైదీ.. కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి 8 మంది విద్యార్థులను హత్య చేశాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనాస్థలికి చేరుకుని మాజీ ఖైదీని అదుపులోకి తీసుకున్నారు. అయితే నిందితుడు.. తన ప్రేయసి కళ్లు పీకేందుకు ప్రయత్నించిన కేసులో ఎనిమిదేళ్ల పాటు జైలు జీవితం గడిపాడు.

# బ్యాంకుల విలీనంతో మొండి బకాయిలు వచ్చేనా?

## రాజకీయ జోక్యం కారణంగానే ఎన్‌పిఎల గుదిబండ ఆ వైపు ఆలోచంచిలేక పోతున్న ప్రభుత్వం

ముంబై,సెప్టెంబర్5 (ఆర్ఎన్ఎ): ఆర్థిక రంగం నుంచి రోజుకో ప్రమాద ఘంటిక వినిపిస్తున్న వేళ కేంద్ర ప్రభుత్వం పది జాతీయ బ్యాంకుల్ని విలీనం చేసి, వాటిని నాలుగు బ్యాంకులుగా కుదిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో దేశంలో ప్రభుత్వరంగ బ్యాంకుల సంఖ్య 12కి తగ్గింది. బ్యాంకుల విలీనం చర్య పూర్తిగా నిరర్థకమైనదని ఎవరూ అనకున్నా, విలీనం చేయక తప్పని పరిస్థితులు ఎందుకు ఏర్పడుతున్నాయెా గమనించాలి. విలీనం వల్ల తక్షణ ఉపయోగాలేంటో గమనించాలి. అలా ఆలోచించినట్టు కనబడడం లేదు. అలా ఆలోచించి ఉంటే బ్యాంకుల రుణవితరణలో రాజకీయ జోక్యం ఎప్పుడో ఆవిరయ్యేది. అది లేకపోబట్టే బ్యాకులు నిస్సహాయ స్థితిలో పడ్డాయి. గతంలో బ్యాంకులకు విపరీతంగా లైసెన్సులుఇచ్చి, ఇప్పుడేమో విలీనాలను చేపట్టడంఎంతవరకు సమంజసమో కూడా ఆలోచించాలి. బ్యాకులపై రాజకీయ జోక్యం కారణంగానే అవి స్వతంత్రను కోల్పోతున్నాయి. మొండి బకాయిలు పెరుగుతున్నాయి. మాల్యా, నీరవ్ మోడీలు వేలకోట్లు ముంచడం వెనక రాజకీయ ప్రమేయం ఖచ్చితంగా ఉండివుంటుంది. ఈ విలీనం వల్ల బ్యాంకుల పనితీరు మెరుగుపడటంతోపాటు వాటి నిర్వహణ వ్యయాలు తగ్గుతాయని, అవి పెద్ద వ్యాపార సంస్థలకు అప్పు లిచ్చే స్తోమత సంతరించుకుంటాయని, మొండి బాకీల సమస్యను అధిగమించగలుగు తాయని అంటున్నారు. వృద్ధికి ఊతం వస్తుందని ప్రభుత్వం చెబుతోంది. వీటితోపాటు బహిరంగ మార్కెట్‌లో వాటికి నిధులు సేకరణ కూడా ఇకపై సులభమవుతుందని అంటున్నది. గతంలో ఎప్పుడూ లేనివిధంగా గత 20 ఏళ్లుగా బ్యాంకుల నుంచి భారీ మొత్తంలో రుణాలు తీసుకోవడం, ఉద్దేశపూర్వకంగా ఎగ్గొట్టడం అనే ధోరణి పెరిగింది. రఘురాం రాజన్ రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్‌గా పని చేసినపుడు ఇలాంటి ఎగవేతదార్ల నుంచి బ్యాంకులకు దాదాపు 13 లక్షల కోట్ల రూపాయలు రావాల్సి ఉన్నదని ప్రకటించారు. బ్యాంకు ఎగవేతదారుల జాబితా ప్రకటించాలని గతంలో ఓ మారు సుప్రీం సూచించినా ఎందుకనో ముందుకు రాలేదు. అంతక్రితం యూపీఏ ప్రభుత్వమైనా, ఇప్పుడు ఎన్‌డీఏ ప్రభుత్వమైనా ఆ మాదిరి చర్యకు ఉపక్రమించిన సూచనలు లేవు. రాజకీయ ఒత్తిళ్లతో వెనకా ముందూ చూడకుండా రుణాలిచ్చి నిస్సహాయ స్థితిలో పడిన బ్యాంకులు ఓ పెద్ద బ్యాంకులో విలీనం కావడం వల్ల ఆ బరువు బదిలీ అవుతుంది తప్ప మాయం కాదు. కనుక విలీనం కన్నా ముందు ఆ రుణాలిచ్చే తీరును మార్చడం, బకాయిలను రాబట్టుకోవడానికి కఠిన చర్యలకు ఉపక్రమించడం అత్యవసరంగా గుర్తించాలి. బడా వ్యాపారవేత్తలకు రుణాలు ఇవ్వడంవల్లచిన్న వ్యాపారుల విషయం వచ్చేసరికి మొండిచేయి చూపుతున్నారు. నిర్దిష్ట శాతానికి మించి బకాయిలున్న బ్యాంకులు కొత్తగా రుణాలివ్వరాదని ఆంక్షలు పెట్టడంతో వాటి వ్యాపారం స్తంభించిపోయింది. ఇలా వృత్తిగత నైపుణ్యంతో స్వేచ్ఛగా, స్వతంత్రంగా మదింపు వేసుకునే అవకాశం బ్యాంకులకు ఉంటే వాటిమధ్య వ్యాపారపరమైన పోటీ పెరుగుతుంది. శరవేగంతో అవి విస్తరించగలుగుతాయి. ఇప్పుడు ఆర్థికమాంద్యం ముంచుకొస్తున్న వేళ విలీనం సాహసమనే చెప్పాలి. ఈ ప్రక్రియంతా పూర్తికావడానికి ఆర్నెల్ల నుంచి ఏడాది కాలం పడుతుందంటున్నారు. ఈ కాలమంతా ఆ బ్యాంకులు తమ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించలేవు. రుణ వితరణ ద్వారా మార్కెట్ పుంజుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన సమయంలో ఇంత పెద్ద ప్రక్రియను చేపట్టడం అర్థంకాని చర్యగా చూడాలి. దేశ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఒక వైపు బ్యాంకింగ్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్నామని చెబుతున్నారు. దానిని పటిష్ట పర్చడానికేనంటూ పలు చర్యలు ప్రకటిస్తున్నారు. అదే సమయంలో మన బ్యాంకుల పని తీరులో మెరుగుదల లేకపోగా గతం కంటే క్షీణత కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నదని ఆ రంగానికి శిఖర ప్రాయమైన రిజర్వు బ్యాంకు తాజాగా మరొక్కసారి కుండ బద్దలు కొట్టినట్లు తేల్చి చెప్పింది. బ్యాంకులలో మోసాల సమస్యను తొలగించాలని ప్రభుత్వం ఎంత ప్రయత్నిస్తున్నప్పటికీ అది ఏటికేడాదీ పెరిగి పోతున్నదని ఆర్‌బిఐ సమర్పించిన తాజా వార్షిక నివేదికలో స్పష్టం చేసింది. మోసాలలో చిక్కుకున్న బ్యాంకుల సొమ్ము ఒక్కసారిగా 73.8 శాతం పెరిగిందని వెల్లడించింది. దీనికి తోడు ఈ ఆర్థిక సంవత్సరం తొలి మూడు మాసాల (ఏప్రిల్ జూన్) కాలంలో స్థూల దేశీయ వృద్ధి రేటు 5.8 నుంచి 5 శాతానికి పడిపోయిందన్న తాజా సమాచారం మన ఆర్థిక దుస్థితిని చాటింది.

# రాజకీయ పునరేకీకరణ కోసమే బిజెపిలో చేరా: రేవూరి

న్యూఢిల్లీ,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): రాజకీయ పునరేకీకరణ కోసమే బీజేపీలో చేరానని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణకు చెందిన టీడీపీ కీలక నేత రేవూరి ప్రకాశ్ రెడ్డి బుధవారం మధ్యాహ్నం కాషాయ కండువా కప్పుకున్నారు. బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా సమక్షంలో రేవూరి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ సీఎం కేసీఆర్ తన వాక్చాతుర్యంతో టీడీపీని ఆంధ్ర పార్టీ అని ముద్ర వేశారని రేవూరి ఆరోపించారు. నాయకత్వ లేమితో కాంగ్రెస్ రోజురోజుకు దిగజారుతోందన్నారు. అంతటితో ఆగని ఆయన.. టీడీపీ లేకుండ చేయాలని కంకణం కట్టుకున్నారని అన్నారు. చంద్రబాబుపై తనకు ఎలాంటి కోపం, వ్యతిరేకత లేదని చెప్పుకొచ్చారు. తెలంగాణకు అన్ని విధాలా న్యాయం చేసిన ఏకైక పార్టీ టీడీపీనేనని ఈ సందర్భంగా రేవూరి స్పష్టం చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబే బీజేపీలోకి వలసలు ప్రోత్సహిస్తున్నారనేది అవాస్తవమని రేవూరి తేల్చిచెప్పారు. ఎవరికి వారు తమ రాజకీయ భవిష్యత్ కోసం పార్టీ వీడుతున్నారని అన్నారు.

# వికలాంగులకు ప్రోత్సాహం ఇవ్వాలి

## వివిధ రంగాల్లో ప్రాధాన్యం పెరగాలి

న్యూఢిల్లీ,సెప్టెంబర్5(ఆంఎన్ఎ): వికలాంగుల విద్యకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని ప్రభుత్వాలు గుర్తించడం లేదు. అనవసరంగా వారిని దూరం పెట్టే ప్రయత్నాలు మంచిది కాదు. విద్యతో పాటు వివిధ రంగాల్లో వారికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా వారిలో ఆత్మస్థయిర్యాన్ని పెంచాలి. హక్కుల చట్టం, 2016లో దివ్యాంగుల విద్యకి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. భారత పునరావాస చట్టం దివ్యాంగుల విద్యా బోధకులను దేశ వ్యాప్తంగా తమ జాతీయ సంస్థల ద్వారా తయారు చేస్తుంది. కానీ వీటి ప్రస్తావన ముసాయిదాలో గుర్తించబడలేదు. ఈ రెండింటిలో విద్యపై గణనీయమైన విభాగాలు ఉన్నాయి. విచిత్రమేమిటంటే, ఉనికిలో లేని వికలాంగుల చట్టం, 1995 గురించి ప్రస్తావించింది.భారత ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని తీసుకురాబోతుంది. దీనికి కేంద్ర మానవ వనరుల శాఖ ఒక కమిటీని ఇస్రో మాజీ చైర్మన్ డా. కస్తూరి రంగం ఆధ్వర్యంలో ఒక ముసాయిదాని మంత్రిత్వ శాఖకి సమర్పించింది, దీనిపై దేశ ప్రజలు, విద్యావంతులు, అధ్యాపకులు, ఉపాధ్యాయుల నుండి అభిప్రాయసేకరణ చేస్తుంది. ఈ ముసాయిదాలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల విద్య కోసం పెద్దగా ఏమి చేర్చలేదు. దివ్యాంగులను ఎస్సీ, ఎస్టీ, ఓబిసిలు, ముస్లింలు, వలసదారుల పిల్లలు మరియు పట్టణ పేదలతో చేర్చారు. అందువలన దివ్యాంగులకు విద్యాపరమైన అవకాశాల కొరకు 'ప్రాతినిధ్యం లేని సమూహం' క్రింద చేర్చారు. కానీ దివ్యాంగుల విద్యా అవకాశాల గురించి గత మూడు దశాబ్దాలుగా పెద్దగా చర్చకు నోచుకోలేదు. దివ్యాంగుల సాధికారం కొరకు అనేక చట్టాలు చేసినప్పటికీ వారికీ విద్యా పరమైన విధానంలో ఆ చట్టాలను గమనంలోనికి ఇంతవరకు తీసుకోలేదు. ఎలిమెంటరీ స్థాయి విద్య గురించి ప్రస్తావించి, మాధ్యమిక, ఉన్నత విద్యలో వికలాంగులను విస్మరించింది. వికలాంగుల హక్కుల చట్టం, 2016 లో అనేక నిబంధనలు ఉన్నప్పటికీ, ఇక్కడ యాక్సెస్ కేవలం ర్యాంప్‌లు, హ్యాండ్ రెయిల్స్ మరియు మరుగుదొడ్ల సదుపాయాల కేవలం భౌతిక అవసరాల గురించి మాత్రమే ప్రస్తావించి, ప్రత్యేక ఉపాధ్యాయుల నియామకం, దివ్యాంగులకు అనుకూలంగా పాఠ్యాంశాల మార్పు, సహ పాఠ్య కార్యక్రమాల మార్పు, ఉపాధ్యాయుల శిక్షణ, బోధనాభ్యసన పరికరాలు, దివ్యాంగులకు ఉపకరణాలు, పునరావాస విభాగాలు మొదలైనన అంశాలను విస్మరించింది. వివిధ సమూహాలలో, పాఠశాల పిల్లల్లో అత్యధిక సంఖ్యలో, వైకల్యాలున్న పిల్లలు ఉన్నారు. ముసాయిదా వికలాంగ పిల్లల నమోదును పెంచడానికి ఎటువంటి ఖచ్చితమైన చర్యలను ఇవ్వలేదు. దీనికి విరుద్ధంగా, విద్యా హక్కుల చట్టం లో అందించిన అట్టడుగు వర్గాల కు 25 శాతం రిజర్వేషన్లను తొల గించాలని ఈ విధానం ప్రతిపాదించింది. సంప్రదింపుల ప్రక్రియ తర్వాత ముసాయిదా తయారు చేయబడిందని పేర్కొన్నప్పటికీ, ఈ ప్రక్రియలో పాల్గొన్న వికలాంగుల కొరకు పనిచేసే నోడల్ మంత్రిత్వ శాఖ, సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ, వికలాంగుల సాధికారత విభాగం, నేషనల్ ట్రస్ట్, భారత పునరావాస సంస్థ జాబితాలో లేవు. విద్యారంగంలో పనిచేసే అన్ని అర్హత గల నిపుణులు మరియు సిబ్బంది యొక్క కేంద్ర పునరావాస రిజిస్టర్‌ను నిర్వహించడం' తప్పనిసరి చేసిన భారత పునరావాస మండలి కూడా జాబితాలో లేదు.

క్రీడలు



# ఫెదరర్ ఔట్

## క్వార్టర్స్‌లో నాదల్

న్యూయార్క్,సెప్టెంబర్4(ఆర్ఎన్ఎ): యుఎస్ ఓపెన్ లో సంచలనాల పరంపర కొనసాగుతోంది. మహిళల సింగిల్స్ లో టాప్ సీడ్ నిష్క్రమణ మరిచిపోక ముందే... పురుషుల సింగిల్స్ లో టైటిల్ ఫేవరెట్ రోజర్ ఫెదరర్ ఇంటిదారి పట్టాడు. 46వ గ్రాండ్ శ్లామ్ సెమ్ఫై÷నైల్ చేరుకుందామనుకున్న ఫెదరర్ కు బల్గేరియన్ ప్లేయర్ దిమిత్రోవ్ చెక్ పెట్టాడు. హోరాహోరీగా సాగిన పోరులో ఫెడెక్స్ 6-3,4-6,6-3,4-6,2-6 స్కోర్ తో పరాజయం పాలయ్యాడు. తొలి సెట్ గెలిచిన స్విస్ స్టార్ రెండో సెట్ లో చుక్కెదురైంది. అయితే మూడో సెట్ గెలిచి ఆధిక్యంలో నిలిచినా... అద్భుతంగా ఆడిన దిమిత్రోవ్ స్కోర్ సమం చేశాడు. ఇక డిసైడింగ్ సెట్ లో మాత్రం ఫెదరర్ అనూహ్యంగా ఓడిపోయాడు. సెమీస్ లో దిమిత్రోవ్ రష్యా ఆటగాడు డానియల్ గ్రిగర్ తో తలపడతాడు. మరోవైపు స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ క్వార్టర్ ÷నైల్లో అడుగుపెట్టాడు. ప్రీ క్వార్టర్స్ లో నాదల్ 6-3,3-6,6-2,6-1 స్కోర్ తో మాజీ ఛాంపియన్ మారిన్ సిలిచ్ పై విజయం సాధించాడు. అలాగే 13వ సీడ్ మోన్ ఫిల్స్ , ఐదో సీడ్ మెద్వెడెవ్ కూడా క్వార్టర్ ÷నైల్ చేరుకున్నారు.

### బుడ్డోడితో నాదల్ సందడి..

యూఎస్ ఓపెన్ ప్రీ క్వార్టర్ ÷నైల్ మ్యాచ్ తర్వాత జరిగిన ఒక సన్నివేశం అందరినీ ఆకట్టుకుంది.

చిన్నారులతో ఎప్పుడూ సరదాగా గడిపే నాదల్... తన ఆటోగ్రాఫ్ కోసం ఏడుస్తోన్న ఒక పిల్లాడిని ముద్దు చేశాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత ప్రేక్షకుల గ్యాలరీలోకి వెళ్ళి మరీ ఆ బుడతడిని ఎత్తుకుని ఊరుకోబెట్టాడు. కన్నీళ్ళు తుడుస్తూ...బుడతడి టోపీపై ఆటోగ్రాఫ్ ఇచ్చి కాసేపు మాట్లాడాడు. అలాగే మిగిలిన అభిమానులకూ ఆటోగ్రాఫ్ లు ఇచ్చి సంతోషపరిచాడు. అభిమానులతో ఎప్పుడూ సరదాగా ఉండే నాదల్ గతంలో ఒక చిన్నారి తప్పిపోతే కాసేపు మ్యాచ్ ఆపేశాడు. తాజా వీడియోను యుఎస్ ఓపెన్ నిర్వాహకులు ట్విట్టర్ లో ఉంచగా... నెటిజన్లు నాదల్ ను ప్రశంసిస్తున్నారు.

# పాక్ జట్టు కోచ్‌గా మిస్బాబుల్




లాహోర్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): అనుకున్నదే జరిగింది... పాకిస్థాన్ క్రికెట్ జట్టు కొత్త కోచ్ గా మాజీ కెప్టెన్ మిస్బాబుల్ హక్ ఎంపికయ్యాడు. విదేశీ కోచ్ లపై ఈసారి పెద్దగా ఆసక్తి చూపని పాక్ క్రికెట్ బోర్డ్... మిస్బాకే కోచ్ బాధ్యతలతో పాటు చీఫ్ సెలక్టర్ గానూ నియమించింది. అలాగే వకార్ యూనిస్ ను బౌలింగ్ కోచ్ గా ఎంపిక చేసింది. మూడేళ్ళ వరకూ వీరిద్దరూ ఈ పదవుల్లో కొనసాగనున్నారు. మాజీ కెప్టెన్ ఇంతికాబ్ ఆలం, మాజీ క్రికెటర్ బజీద్ ఖాన్, గవర్నింగ్ బోర్డ్ సభ్యుడు అసద్ అలీ ఖాన్ , పిసిబి సిఈవొ వాసిమ్ ÷ాన్ , ఇంటర్ నేషనల్ క్రికెట్ డైరెక్టర్ జకీర్ ఖాన్ లతో కూడిన ఐదుగురి సభ్యుల కమిటీ మిస్బా,యూనిస్ లను ఎంపిక చేస్తూ నిర్ణయం తీసుకుంది. పాక్ క్రికెట్ బోర్డ్ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు చెప్పిన మిస్బాబుల్ హక్ అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తానని వ్యాఖ్యానించాడు. ప్రపంచకప్ వైఫల్యం తర్వాత నిరాశలో ఉన్న జట్టును మళ్ళీ విజయాల బాటలో నడిపించేందుకు కృషి చేస్తానని తెలిపాడు. కాగా ప్రపంచకప్ లో ఘోరపరాజయం పాలైన పాక్ జట్టు కోచ్

÷ుకీ ఆర్థర్ తో పాటు సహాయక సిబ్బందిపైనా పిసిబి వేటు వేసింది. వారి కాంట్రాక్ట్ కొనసాగించేందుకు నిరాకరించి... కొత్తగా మిస్బాకు బాధ్యతలు అప్పగించింది. అటు గతంలో పాక్ జట్టుకు ప్రధాన కోచ్ గా పనిచేసిన వకార్ యూనిస్ ఈసారి బౌలింగ్

÷రిళిచ్ గా వ్యవహరించనున్నాడు. కోచ్ లుగా మిస్బాబుల్, వకార్ యూనిస్ శ్రీలంకతో స్వదేశంలో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్ తో ప్రారంభం కానున్నాయి.

# ప్రతిఒక్కరూ ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలి

**- అదే కేంద్ర ప్రభుత్వం ఉద్దేశం**
**- పెట్రోల్, డీజిల్ వాహనాలపై నిషేధం విధించే ఆలోచన లేదు**
**- కేంద్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ**

న్యూఢిల్లీ, సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ) : ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, అదే కేంద్ర ప్రభుత్వం ఉద్దేశమని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. గురువారం సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ 59వ కన్వెన్షన్ లో గడ్కరీ పాల్గొన్నారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెట్రోల్, డీజిల్ వాహనాలపై నిషేధం విధించే ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. ఈ వాహనాలపై నిషేధం విధిస్తారనే భావన అందర్లో ఉందని, కానీ, కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయడం లేదని చెప్పారు. ఆటోమొబైల్ పరిశ్రమ దేశ ఎగుమతులు, ఉద్యోగాల కల్పనలో కీలకపాత్ర పోషిస్తోందని తెలిపారు. మన దేశంలో ఆటోమొబైల్ సెక్టార్ విలువ రూ. 4.50 లక్షల కోట్లుగా ఉందని గడ్కరీ తెలిపారు. దేశంలో కాలుష్యం పెరిగిపోతోందని, ఈ నేపథ్యంలో కాలుష్యం వెదజల్లని ఇంధనం దిశ గా వాహన తయారీ పరిశ్రమ అడుగులు వేయాల్సి ఉందని చెప్పారు. వాతావరణ కాలుష్యానికి కేవలం వాహనాలను మాత్రమే నిందించలేమని, అయితే కాలుష్య కారకాల్లో వీటి భాగస్వామ్యం కూడా ఉందని తెలిపారు. ఢిల్లీలోని కాలుష్యంపై ప్రపంచ వ్యాప్తంగా విమర్శలు వస్తున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కొన్ని ఇబ్బందులను ఎదుర్కొంటోందని... వాటిలో మొదటిది దిగుమతి చేసుకుంటున్న క్రూడాయిల్ ధరలని చెప్పారు. రెండో స్థానంలో కాలుష్యం, ఆ తర్వాత రోడ్ సేఫ్టీ ఉన్నాయని గడ్కరీ తెలిపారు.

## పెరిగిన గ్యాస్ ధరలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్5 (ఆంఎన్ఎ): గృహ వినియోగదారులపై గ్యాస్ కంపెనీలు అదనపు భారం మోపాయి. పద్నాలుగు కిలోల బరువున్న సిలెండర్ ధరను 16 రూపాయలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. ప్రతి నెలా ఒకటో తేదీన ధరలను ఆయిల్ కంపెనీలు సవరిస్తుంటాయి. ఇందులో భాగంగా ఈ నెల ఒకటో తేదీనే సంస్థలు పెంపు నిర్ణయం తీసుకున్నాయి. కొత్త ధరలు చవితి ముందు రోజు నుండే అమల్లోకి వచ్చాయి. గృహావసరాలకు వినియోగించే సిలిండర్ ధరను రూ.590.50 నుంచి 606.50 కు పెంచారు. వాణిజ్య అవసరాలకు వినియోగించే 19 కిలోల సిలిండర్ ధరను 1123 రూపాయల నుంచి 1174 రూపాయలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు ఆయిల్ సంస్థలు వెల్లడించాయి.

# యూరియా కొరతకు కేంద్రమే కారణం

**- 10రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం**
**- కల్లుతాగిన కోతిలా కోమటిరెడ్డి తీరుంది**
**- ఎమ్మెల్సీ గుత్తా సుఖేందర్**

నల్గొండ, సెప్టెంబర్5 (ఆర్ఎన్ఎ) : తెలంగాణ రాష్ట్రంలో యూరియా కొరతకు కారణం కేంద్ర ప్రభుత్వం అని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ నేతల తీరుపై మండిపడ్డారు. తెలంగాణలో యూరియా కొరతకు కేంద్రమే కారణమని చెప్పుకొచ్చారు. 10రోజుల్లో యూరియా సమస్యను పరిష్కరిస్తావన్నారు. యూరియా కొరతపై బీజేపీ నేతల విమర్శలు సరికాదన్నారు. బీజేపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే కేంద్రం నుంచి యూరియా తెప్పించండంటూ సవాల్ విసిరారు. తెరాస ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమం కోసమే పెద్దపీట వేశారని అన్నారు. తెలంగాణ రైతులను దేశానికే ఆదర్శంగా నిలిపేలా ప్రయత్నాలు చేస్తున్నారని కొనియాడారు. యూరియా కొరతపై ప్రభుత్వమూ దృష్టిసారించిందని, త్వరలోనే యూరియా సమస్యను పరిష్కరించి రైతులకు అందిస్తామని తెలిపారు.

బ్రాహ్మణ వెళ్ళాంల ప్రాజెక్టుపై ఎంపీ కోమటిరెడ్డి ఆరోపణలు సరికాదన్నారు. కల్లుతాగిన కోతిలా ఎంపీ కోమటిరెడ్డి తీరు ఉందని సుఖేందర్ రెడ్డి విమర్శించారు. సంస్కారం లేకుండా నీచంగా...మూర్ఖంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో 11నెలల్లో బ్రాహ్మణ వెళ్ళాంల ప్రాజెక్టు పనులు పూర్తి కానున్నాయని, ప్రాజెక్టు పూర్తవుతుందని తెలిసే కోమటిరెడ్డి నాటకాలు ఆడుతున్నారని ఎమ్మెల్సీ గుత్తా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతలకు చౌకబారు ఆరోపణలు చేయడం అలవాటేనని అన్నారు. కమీషన్ల కోసం కక్కుర్తి పడే చరిత్ర కోమటిరెడ్డిదన్నారు. కేసీఆర్‌ని విమర్శించే నైతికత వెంకట్‌రెడ్డికి లేదని, ఆయన పాదయాత్ర డ్రామాను ప్రజలు నమ్మే స్థితిలో లేరని పేర్కొన్నారు. ప్రాజెక్టుల పేరుతో ప్రభుత్వంపై బురద చల్లడం సరికాదన్నారు. ప్రాజెక్టుల వాస్తవ పరిస్థితి కోమటిరెడ్డికి తెలుసునని, కేవలం రాజకీయ లబ్ధి కోసమే విమర్శలు చేస్తున్నారని గుత్తా ఆగ్రహం వ్యక్తం చేశారు.

# చలానాతో ఉచితంగా హెల్మెట్!

**- ద్విచక్రవాహన చోదకులకు బంపర్ ఆఫర్**

జైపూర్, సెప్టెంబర్5 (ఆర్ఎన్ఎ) : ద్విచక్రవాహన చోదకులకు రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వం బంపర్ ఆఫర్ ప్రకటించింది. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడిపిన చోదకులకు ట్రాఫిక్ పోలీసులు వెయ్యిరూపాయల చలానా విధించి, అది చెల్లించిన వారికి ఉచితంగా ఐఎస్ఐ మార్కు ఉన్న ఓ హెల్మెట్ ను ఉచితంగా ఇవ్వాలని రాజస్థాన్ రాష్ట్ర సర్కారు నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త మోటారు వాహనాల చట్టం ప్రకారం ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనచోదకులకు భారీ జరిమానాలు విధించమని రాజస్థాన్ రాష్ట్ర రవాణ శాఖ మంత్రి ప్రతాప్ సింగ్ చెప్పారు. రాజస్థాన్ ప్రజల సెంటిమెంటును పరిగణనలోకి తీసుకొని హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడిపిన వారినుంచి వెయ్యిరూపాయల చలానా విధించి, వారికి ఐఎస్ఐ మార్కు ఉన్న హెల్మెట్ ను ఉచితంగా అందిస్తామని మంత్రి ప్రకటించారు. రోడ్డు భద్రతపై వాహనచోదకులను చైతన్యవంతులను చేసేలా ప్రాథమికంగా నామమాత్రపు చలానాలు విధించాలని రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లోట్ నేతృత్వంలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో నిర్ణయించారని మంత్రి చెప్పారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడిపితే వందరూపాయలున్న జరిమానాను వెయ్యిరూపాయలకు పెంచి, చలానా విధించి, ఆ మొత్తాన్ని చెల్లించిన వారి భద్రత కోసం ఉచితంగా హెల్మెట్ అందజేస్తామని మంత్రి వివరించారు. కేంద్రం ప్రవేశపెట్టిన కొత్త మోటారు వాహనాల చట్టం ప్రకారం భారీ జరిమానాల విధింపు విషయంలో రాజస్థాన్ సర్కారు తొందరపడటం లేదని మంత్రి చెప్పారు.

## చిన్నారిని చితకబాదిన టీచర్

హైదరాబాద్,సెప్టెంబర్5 (ఆర్ఎన్ఎ): నగరంలో దారుణం జరిగింది. ఓ ప్రైవేట్ కిడ్స్ ప్లే స్కూల్ టీచర్ సుజాత చిన్నారిని విచక్షణారహితంగా కొట్టడంతో విద్యార్థి ఎడమ చేయి విరిగింది. ఈ ఘటన బుధవారం మీర్‌పేట్ లో చోటు చేసుకుంది. సత్యం టెక్నో కిడ్స్ ప్లే స్కూల్ లో 3వ తరగతి చదువుతున్న సాయితేజ అనే విద్యార్థిని స్కూల్ టీచర్ ఐరన్ స్కేల్ తో చితకబాదడంతో సాయితేజ ఎడమ చేయి విరిగింది. జరిగిన సంఘటన గురించి తెలుసుకునేందుకు బాలుడి తల్లిదండ్రులు స్కూల్ వద్దకు వెళ్లారు. అప్పటికే స్కూల్ యాజమాన్యం అందుబాటులో లేకపోవడంతో మీర్ పేట్ పోలీస్ స్టేషన్ విద్యార్థి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తు చేస్తున్నారు. సాయితేజను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# యూరియా కొరతను తక్షణం తీర్చాలి

## రైతులు రోడ్డెక్కుతున్నా పట్టించుకోరా?

ఆదిలాబాద్,సెప్టెంబర్5 (ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో యూరియా కొరతను నివారించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని,రైతుఉల రోడ్డెక్కకుండా చూడాలని సిపిఐ నేత ముడుపు ప్రభాకర్ రెడ్డి సూచించారు.

రైతు సంక్షేమం అని చెప్పుకుంటున్న కెసిఆర్ యూరియా కోసం రైతులు రోడ్డెక్కితే కనీసంగా స్పందించకపోవడం దారుణమన్నారు. యూరియా కొరతతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తెలంగాణలో రైతాంగం, వ్యవసాయ రంగం సంక్షోభాన్ని ఎదుర్కుంటోందన్నారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చి అమలు చేస్తున్న రైతు బంధు, భూరికార్డుల ప్రక్షాళన లక్ష్యానికి ఆమడ దూరంలో ఉందని, దీని వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. 30 శాతం రైతులకు కూడా వీటివల్ల ప్రయోజనం దక్కలేదని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో రైతులకు లక్ష రూపాయల రుణ మాఫీని అమలుచేయాలన్నారు. యూరియా కొరతతో రైతులు కలత చెందుతున్నారు. డిమాండ్‌కు తగ్గట్టుగా యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలం కావడంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. యూరియా బస్తాల కోసం ఎరువుల దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోక పోవడం సరికాదన్నారు. ఒక్కో మండలానికి వెయ్యి మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటి వరకు కేవలం 200 టన్నుల యూరియా మాత్రమే సరఫరా చేసి చేతులు దులుపుకున్నారని అన్నారు. పంటలకు యూరియా ఇచ్చే సమయం ఇదే కావడం అందుకు తగ్గట్లు వర్షం కురియడంతో యూరియాకు డిమాండ్ పెరిగింది. ఒకవైపు అధికారులు యూరియా కొరత లేదంటున్నప్పటికీ వాస్తవ పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. అరకొరగా వస్తున్న యూరియాను పంపిణీ చేస్తున్నారు. యూరియా కొరతను దృష్టిలో ఉంచుకొని భూమితో సంబంధం లేకుండా ఒక్కో రైతుకు కేవలం రెండు బ్యాగుల చొప్పున ఇస్తున్నారు. ఆ రెండు బ్యాగుల కోసం రైతులు ఉదయం ఆరు గంటల నుంచే పీఏసీఎస్ వద్ద బారులు తీరుతున్నారు. రైతులు యూరియా కోసం గంటల తరబడి బారులు తీరుతున్నారు. రైతులను కట్టడి చేసేందుకు పోలీసుల సహాయం తీసుకోవాల్సి వస్తోంది. అధికారులు పంపిణీ చేసే రెండు బస్తాల యూరియా ఎటూ సరిపోవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

# తెలంగాణపై కుట్రలు సాగవు

### కాళేశ్వరం చూసి నిజాలు తెలుసుకోండి

జనగామ,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక తమ ఉనికి కాపాడుకునేందుకు కాంగ్రెస్, బీజేపీలు విమర్శలతో చిల్లర రాజకీయాలు చేస్తున్నారని స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య మండిపడ్డారు. తెలంగాణను మరోసారి విచ్ఛిన్నం చేసేందుకు దృష్టశక్తులు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. సాధించుకున్న తెలంగాణనను మరోసారి విచ్ఛిన్నం చేయాలని చూసేవారికి గుణపాఠం తప్పదన్నారు.రాజకీయ పార్టీల కుట్రలను టీఆర్ఎస్‌లోని ప్రతీ కార్యకర్త సైనికుల్లా మారి ఎక్కడిక్కడ తిప్పికొట్టాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఉద్యమ నాయకుడు రాష్ట్రానికి సారథిగా ఉండటంతో సీమాంధ్ర పాలనలో ఏ రంగంలో ఏ జిల్లాకు అన్యాయం జరిగిందో తెలిసిన వ్యక్తిగా సంక్షేమం, అభివృద్ధితోపాటు సాగు, తాగునీరు, పారిశ్రామికరణ, పట్టణీకరణ వంటి అంశాల్లో రాష్ట్రాన్ని సమతూకంగా అభివృద్ధి పథకంలో నడిపిస్తున్నారని చెప్పారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో జనగామ సహా రాష్ట్రంలోని 33 జిల్లాల్లోని పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థలపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ఉద్యమ నాయకుడు సీఎం కేసీఆర్ నాయకత్వంలో గోదారమ్మను తెలంగాణ పొలాలకు తరలించేందుకు చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు అతి తక్కువ సమయంలో నిర్మాణం పూర్తిచేసి రైతన్నల గుండెల్లో నిలిచారని అన్నారు.దేశం అబ్బురపడేలా ముఖ్యమంత్రి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు భారీ ఎత్తున ప్రజలు తరలి వెళ్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని సుమారు 45లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని ధృడ సంకల్పంతో సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన నిర్మించేందుకు కృషి చేశారన్నారు. ఈ ప్రాజెక్టు భారతదేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో రైతాంగ అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన కొనియాడారు.

## పాక్ పోలీస్ శాఖలో హిందూ మహిళకు ఉద్యోగం

లాహోర్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): పాకిస్థాన్ పోలీసు శాఖలో ఓ హిందువు మహిళకు ఉద్యోగం వచ్చింది. సింధ్ ప్రావిన్సులోని పోలీసుశాఖలో పుష్పా కోహ్లీ అనే అమ్మాయికి అసిస్టెంట్ సబ్ ఇన్స్‌పెక్టర్(ఏఎస్ఐ) పోలీసుగా ఎంపికైంది. ఈ విషయాన్ని మానవ హక్కుల కార్యకర్త కపిల్ దేవ్ తన ట్విట్టర్‌లో పోస్టు చేశాడు. పోటీపరీక్షలో పుష్పా విజయం సాధించిందని, ఆ పరీక్షలో రాణించిన హిందూ మతానికి చెందిన తొలి మహిళ ఈమే అని కపిల్ ట్వీట్ చేశాడు. సింద్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలో పుష్పా ఉత్తీర్ణురాలైంది. ఈ ఏడాది జనవరిలోనూ హిందూ సామాజిక వర్గానికి చెందిన సుమన్ పవన్ అనే వ్యక్తి జుడిషియల్ మెజిస్ట్రేట్‌లో జడ్జీగా నియమితులయ్యారు.

# యూరియా కష్టాలకు ప్రభుత్వానిదే బాధ్యత

కరీంనగర్,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): గతంలో ఎప్పుడు కూడా ఇలా రాష్ట్రంలో యూరియా కోసం రైతులు రోడ్డెక్కలేదని మాజీమంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఇది సర్కార్ వైఫల్యానికి నిదర్శనమన్నారు.

రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. వేకువజాము నుంచే పీఏసీఎస్ కార్యాలయం ఎదుట రైతులు బారులు తీరుతున్నారు. కార్యాలయం ఎదుట ఆధార్ కార్డులు, పాస్ పుస్తకాలను క్యూలో ఉంచి యూరియాను కొనుగోలు చేసేందుకు వస్తున్నారు. కొంత మంది రైతులకు యూరియా లభించకపోవడంతో రహదారిపై బైఠాయించి ఆందోళన నిర్వహిస్తున్నారు. గత వారం రోజులుగా యూరియా లభించక రైతులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ అధికారులు యూరియా నిల్వలను అందుబాటులో ఉంచకపోవడం దారుణమని మాజీమంత్రి మండిపడ్డారు. కాళేశ్వరం చూపి అంతా అద్భుతాలు సాధించామని గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద 37వేల కోట్లతో నిర్మించతలపెట్టిన ప్రాజెక్టును కమిషన్ కోసమే 80వేల కోట్లతో రీడిజైన్‌చేసి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి ఆమోదం తెలిపారని విమర్శించారు.కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి మిడ్‌మానేరు జలాశయానికి చుక్క నీరు రాలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మాత్రమే నీటిని మిడ్‌మానేరుకు తరలించారని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని తరలించామని చెబుతున్న నాయకులు, అధికారులు ఎన్ని టీఎంసీలు ఎక్కడినుంచి ఎక్కడికి తరలించారో వివరాలతో వెల్లడించాలని అన్నారు. కడెం ప్రాజెక్టు ద్వారా ఎల్లంపల్లి, ఎల్లంపల్లి ద్వారా మిడ్‌మానేరుకు నీరు తరలిందని అన్నారు. కానీ కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా చుక్కనీరు రాలేదని అన్నారు.



# చిరు 152వ చిత్రంలో ఇలియానా..!

ఖైదీ నెంబర్ 150 చిత్రంతో వెండితెర రీ ఎంట్రీ ఇచ్చిన మెగాస్టార్ చిరంజీవి సినిమాల స్పీడ్ పెంచాడు. అక్టోబర్ 2న చిరు 151వ చిత్రం సైరా నరసింహారెడ్డి భారీ స్థాయిలో విడుదల కానుంది. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం ఇలా పలు భాషలలో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు. ఇక చిరు 152వ చిత్రం కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కనుండగా, ఈ చిత్రానికి సంబంధించి కొన్నాళ్ళుగా ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

చిరు 152వ చిత్రంలో నటించే కథానాయికకి సంబంధించి గాసిప్ రాయుళ్లు కొన్నాళ్లుగా పలు రూమర్స్ పుట్టిస్తున్నారు. ముందుగా నయనతార ఆ తర్వాత అనుష్క , శృతి హాసన్ , ఐశ్వర్యరాయ్ ఇలా పలువురు నటిస్తున్నారంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం చేశారు. తాజాగా గోవా బ్యూటీ ఇలియానా ఫ్రేంలోకి వచ్చింది. ఇల్లీ బేబినే చిరుతో జోడీ కడుతుందని చెప్పుకొస్తున్నారు. దీనిపై క్లారిటీ రావలసి ఉంది. ఒకప్పుడు టాలీవుడ్‌లో వరుస చిత్రాలు చేసిన ఇలియానా కొన్నాళ్లు గ్యాప్ తీసుకుంది. రవితేజ చిత్రం అమర్ అక్బర్ ఆంటోనితో తెలుగు తెరకి రీ ఎంట్రీ ఇచ్చింది



# 2020లో ఆలియా, రణ్‌బీర్ వివాహం?

బాలీవుడ్ స్టార్ హీరోహీరోయిన్లు రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్ వివాహ వార్తలు అక్కడి మీడియాలో క్రమం తప్పకుండా వస్తుంటాయి. వీరిద్దరూ త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతున్నారని ఎప్పటికప్పుడు కథనాలు వెలువడుతుంటాయి. తాజాగా మరోసారి వీరి పెళ్లి గురించి బాలీవుడ్ మీడియా వరుస కథనాలు వండివారుస్తోంది.వచ్చే ఏడాది ఆలియా, రణ్‌బీర్ వివాహ బంధం ద్వారా ఒక్కటి కాబోతున్నారని తాజా సమాచారం. ఈ మేరకు త్వరలోనే ఇరు కుటుంబాల సమక్షంలో నిశ్చితార్థ వేడుక జరుగబోతోందట. నిజానికి ఇప్పటికే వీరి వివాహం జరిగిపోవాల్సిందని, అయితే రణ్‌బీర్ తండ్రి రిషీ కపూర్ అనారోగ్యం కారణంగా వాయిదాపడిందని తెలుస్తోంది. ప్రస్తుతం రిషీ కపూర్ కోలుకోవడంతో వెంటనే నిశ్చితార్థం జరగాలని ఇరు కుటుంబాలూ అనుకుంటున్నాయట. అందుకోసం ఏర్పాట్లు చేస్తున్నాయట. అయితే ఇందులో ఎంత నిజముందో తెలియాలంటే కొద్ది రోజులు ఆగాల్సిందే.

# జయలలిత బయోపిక్‌లో రమ్యకృష్ణ

సినిమా



1960 మధ్య కాలంలో టాప్ హీరోయిన్‌గా అలరించిన అందాల నటి జయలలిత. తెలుగు, తమిళం, కన్నడ,భాషలలో దాదాపు 140కి పైగా సినిమాలు చేసింది పురుచ్చతలైవీ. భారత రాజకీయాలలోను ముఖ్య భూమిక పోషించిన జయలలిత దాదాపు 14 సంవత్సరాలకి పైగా తమిళనాడు ముఖ్యమంత్రి బాధ్యతలని నిర్వర్తించింది. తమిళ తంబీలు అమ్మగా పిలుచుకొనే జయలలిత కొద్ది రోజుల క్రితం అనారోగ్య సమస్యలతో కన్నుమూశారు.

ప్రస్తుతం ఆమెపై బయోపిక్ రూపొందించేందుకు పలువురు దర్శకులు సన్నాహాలు చేస్తున్న సంగతి తెలిసిందే. కేతి రెడ్డి జగదీశ్వర్ రెడ్డి 'శశి లలిత' పేరిట బయోపిక్ చేస్తున్నాడు. అలానే తమిళ దర్శకురాలు ప్రియదర్శిని 'ది ఐరన్ లేడీ' పేరుతో జయలలిత బయోపిక్ రూపొందిస్తుంది. తమిళ దర్శకుడు ఏఎల్ విజయ్ .. తలైవీ అనే టైటిల్‌తో జయలలిత బయోపిక్‌ని తెరకెక్కిస్తుండగా, ఇందులో కంగనా ప్రధాన పాత్ర పోషిస్తుంది. ప్రముఖ దర్శకుడు గౌతమ్ మీనన్ జయలలిత జీవితంపై కల్పిత వెబ్ సిరీస్ చేసేందుకు సిద్ధమయ్యారు.

దీనికి క్వీన్ అని పేరు పెట్టారు. ఓటీ ప్లేయర్‌లో ప్రసారం కానున్న ఈ సిరీస్‌లో రమ్య కృష్ణన్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికే పవర్ ఫుల్ పాత్రలలో అలరించిన రమ్యకృష్ణన్ .. జయలలితగా కూడా ప్రేక్షకులని మెప్పిస్తుందని అంటున్నాడు దర్శకుడు. వెబ్ సిరీస్ ప్రీమియర్ తేదీని త్వరలో ప్రకటించాలని భావిస్తున్నారు మేకర్స్.

# షాక్ ఇస్తోన్న అనుష్క లుక్!

సౌత్ స్టార్ హీరోయిన్‌గా మంచి క్రేజ్ సొంతం చేసుకున్న అనుష్క కెరీర్‌ను ఒక్క సినిమా ఇబ్బందుల పాలు చేసింది. గ్లామర్ హీరోయిన్‌గా, లేడీ ఓరియంటెడ్ సినిమాల హీరోయిన్‌గా మంచి ఫాంలో ఉన్న సమయంలో అనుష్క, సైజ్ జీరో సినిమా కోసం భారీగా బరువు పెరిగింది. దీంతో అనుష్క సినీ కెరీర్ ఇబ్బందుల్లో పడింది.

సైజ్ జీరో సినిమా తరువాత బరువు తగ్గేందుకు అనుష్క చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఆ తరువాత చేసిన సింగం 3, నమో వేంకటేశాయ సినిమాల్లో ఆమె లుక్‌పై విమర్శలు వినిపించాయి. దీంతో లాంగ్ గ్యాప్ తీసుకున్న అనుష్క, స్లిమ్ లుక్‌లో ఓ ఫోటో షూట్ చేసి రిలీజ్ చేశారు. వెంటనే నిశబ్దం అనే బహు భాషా చిత్రాన్ని ప్రారంభించారు.

ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్న స్వీటీ తాజాగా హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కెమెరా కంటికి చిక్కారు. ఈ ఫోటోలు చూసిన స్వీటీ అభిమానులు షాక్ అవుతున్నారు. ఫోటో షూట్‌లో స్లిమ్‌గా కనిపించిన అనుష్క, తాజా ఫోటోలో చబ్బీ చబ్బీగా దర్శనమిచ్చారు. దీంతో నిశబ్దం సినిమాలోనూ అనుష్క లుక్ నిరాశపరుస్తుందన్న అనుమానాలు కలుగుతున్నాయి.



**IN THE COURT OF THE**
**M.A.C.T-CUM-I**
**ADDL CHIEF JUDGE**
**CITY CIVIL COURT AT**
**SECUNDERABAD**
**M.V.O.P NO. 315 OF 2018**

Between:
**Mr.E. Jangaiah**
...Petitioner
**And**
**Mr. Charan Preet Singh and others**
..Respondents

To
**1) Mr. Charan Preet Singh S/o. Harjinder Singh Age: Major, Occ: Owner of Tanker, Bearing No.AP 29V 8163, R/o. Plot No.9, BLock-18, Auto Nagar, Vanasthalipuram, R.R. dist, Telangana.**
...Respondent No.1
**2) Mr. Bansu Gupta S/o. Rambiraj Gupta, Age: 46 years, Occ: Driver of Tanker Bearing No. AP 29V 8163, R/o. Plot No.9, Block-18 Auto Nagar, Vanasthalipuram, R.R.Dist, Telangana.**
..Respondent No.3

Whereas the above named Petitioners filed compensation petition against you and Bajaj Allianz Insurance Company for a sum of Rs. 10,00,000/- for the accident caused by your vehicle Cement Tanker bearing No.AP 29V 8163 on 23-01-2017 at Pargi ps limits. The above case is posted on **12-09-2019.** You are hereby summon to appear either in person or through pleader with your defence if any at 10.00 AM on the above said date before the Hon'ble court, failing which the suit will be heard and determined expate.

(BY ORDER OF THE COURT)
**C. VENU GOPAL REDDY**
Advocate.
Off: 2-4-120/18,
Swaroop Nagar
Uppal, Hyderabad.
Cell: 9440431541

# బెయిల్ ఇవ్వలేం!

## – సుప్రీంలో చిందబరానికి చుక్కెదురు



న్యూఢిల్లీ, సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ) : ఎన్ఎక్స్ మీడియా కేసులో కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత పి చిదంబరానికి గురువారం మరోసారి సుప్రీంకోర్టులో నిరాశ తప్పలేదు. ఈ కేసులో ఈడీ అరెస్ట్ చేయకుండా ముందుస్తు బెయిల్ కోసం ఆయన దాఖలుచేసిన పిటిషన్‌ను జస్టిస్ ఆర్ భానుమతి, జస్టిస్ ఏఎస్ బొపన్నల ధర్మాసనం తిరస్కరించింది. ఈడీ తరఫు న్యాయవాది వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. దీంతో చిదంబరానికి ఎదురు దెబ్బ తప్పలేదు. ఇప్పటికే ఐఎన్ఎక్స్ మీడియా కేసులో చిదంబరాన్ని సీబీఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కాగా, ఈడీ కేసులో ముందస్తు బెయిల్‌ను సుప్రీం తిరస్కరించడంతో సీబీఐ కేసులో బెయిల్ కోసం వేసిన పిటిషన్‌ను వెనక్కుతీసుకోవాలని చిదంబరం నిర్ణయించారు. ఆయన నిర్ణయాన్ని పరిగణనలోకి తీసుకున్న సర్వోన్నత న్యాయస్థానం ఇందుకు అనుమతించింది. చిదంబరం తరఫున కాంగ్రెస్ నేత, సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. అయితే, సాధారణ బెయిల్ కోసం చిదంబరం ట్రయల్ కోర్టును ఆశ్రయించవచ్చని పేర్కొంది. తన తీర్పులో ఏజెన్సీ నోట్ కాపీ పేస్ట్ చేసినందుకు హైకోర్టు న్యాయమూర్తిపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆర్థిక నేరాలు వేర్వేరు ప్రాతిపదికన ఉంటాయని, వీటిని భిన్నమైన విధానంతో పరిష్కరించుకోవాలన్న సుప్రీం ధర్మాసనం.. ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వడం వల్ల దర్యాప్తునకు ఆటంకం కలుగుతుందని వ్యాఖ్యానించింది. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ కేంద్రమంత్రి చిదంబరం కస్టడీ గడువును సుప్రీం సెప్టెంబర్ 5వరకు పొడగించిన విషయం తెలిసిందే. ఆయన్ను తీహార్ జైలుకు తరలించవద్దని మంగళవారం ఆదేశించింది. ఐఎన్ఎక్స్ మీడియాలో విదేశీ పెట్టుబడుల తరలింపులో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలతో చిదంబరంపై కేసు నమోదుచేసి సీబీఐ అరెస్ట్ చేసింది. ఈ కేసులో ముందస్తు బెయిల్‌కు ఢిల్లీ హైకోర్టు తిరస్కరించడంతో ఆయన సుప్రీంను ఆశ్రయించారు. సుప్రీం కూడా మధ్యంతర ఉత్తర్వులకు నో చెప్పడంతో ఆయన సీబీఐ కస్టడీలోనే కొనసాగుతున్నారు.

# ప్రాణాలు తీసిన యూరియా!

**– యూరియా కోసం క్యూలో నిలబడిన రైతు మృతి**
**– సిద్దిపేట జిల్లా దుబ్బాకలో విషాద ఘటన**
**– రాష్ట్ర వ్యాప్తంగా యూరికొరతతో రైతులకు తప్పని ఇబ్బందులు**
**– తెల్లవారు జామునుంచే సొసైటీల వద్దపడిగాపులు**
**– ప్రభుత్వం తీరుపై మండిపడుతున్న ప్రతిపక్షాలు**

సిద్ధిపేట, సెప్టెంబర్5(ఆంఎన్ఎ) : రాష్ట్ర రైతాంగాన్ని యూరియా కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. సమృద్ధిగా వర్షాలు కురుస్తుండటంతో పంటల్లో చల్లించేందుకు రైతులు యూరియా కోసం నానా తంటాలు పడుతున్నారు. సరియైన సమయంలో సరిపడా యూరియా ఉత్పత్తులను ప్రభుత్వం అందుబాటులో ఉంచకపోవటంతో రైతులు సొసైటీలు, దుకాణాల వద్ద బారులు తీరి మరి యూరియా బస్తాలను తీసుకెళ్తున్నారు. ఈ నేపథ్యంలో సిద్దిపేట జిల్లా దుబ్బాకలో గురువారం విషాదం చోటు చేసుకుంది. యూరియా కోసం క్యూలో నిలబడిన ఓ రైతు గుండెపోటుతో మృతి చెందాడు. దుబ్బాక ప్రాథమిక వ్యవసాయ కేంద్రం దగ్గర యూరియా కోసం క్యూలో నిలబడిన రైతు ఎల్లయ్య (65) ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. వెంటనే ఎల్లయ్యను ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఎల్లయ్య మృతి చెందాడు. మృతుడు ఎల్లయ్య దుబ్బాక మండలం అచ్చుమాయపల్లి వాసి. రెండు రోజులుగా ఎల్లయ్య క్యూలోనే నిలబడ్డాడని గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా విషాదం నింపింది. యూరియా కోసం అన్నదాతలు పడుతున్న కష్టానికి అద్దం పట్టిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**తెల్లవారు జాము నుంచే బారులు..**

పదిరోజులవుతున్నా రాష్ట్రంలో యూరియా కొరత అన్నదాతను వేదిస్తూనే ఉంది. యూరియా బస్తాలను దక్కించుకొనేందుకు రైతులు తెల్లవారు జాము నుంచే సహకార సంఘాల కార్యాలయాల ఎదుట బారులు తీరుతున్నారు. కామారెడ్డి జిల్లా సొసైటీ వద్ద యూరికోసం గురువారం తెల్లవారు జాము నుంచే రైతులు బారులు తీరారు. అయినా యూరియా దొరక్క పోవటంతో ఆందోళనకు దిగారు. అదేవిధంగా నిజామాబాద్ జిల్లా భూపాల్‌లో రైతులు ధర్నా చేశారు. జగిత్యాల జిల్లా రాయకల్ మండలం సొసైటీ వద్ద ఉదయం 6గంటల నుంచే రైతులు యూరియా కోసం బారులు తీరారు. పాస్ పుస్తకాలతో క్యూకట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాలు పడుతుండటంతో పంటలకు యూరియా ఎంతో మేలు చేస్తుందని, ఈ సమయంలో ప్రభుత్వం యూరియా కొరతను తీర్చకపోతే పంటలు దిగుబడులు తగ్గుతాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే పది రోజులుగా పలు ప్రాంతాల్లో యూరియా కొరతతో క్యూ లైన్ లో నిల్చుంటున్నారు. ఈ క్రమంలో కొందరు అస్వస్థతకు గురవుతున్నారు. యూరియా నిల్వలు లేక.. అందరికీ అందడం లేదు. దీంతో ఎరువుల దుకుణాల దగ్గర వాగ్వాదాలు, ఆందోళనలు చోటు చేసుకుంటున్నాయి. వ్యవసాయశాఖ అధికారులు మాత్రం రాష్ట్రంలో యూరియా కొరత లేదని అంటున్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. అందరికి యూరియా అందేలా చూస్తామన్నారు. నౌకల ద్వారా యూరియా రావడంలో ఆలస్యమైందని, అందుకే కొంత అసౌకర్యం కలిగిందని వివరించారు. సెప్టెంబర్ 10 వరకు నిల్వలన్నీ నిర్దేశిత ప్రాంతాలకు చేరేలా చూడాలని కంపెనీలను ఆదేశించామని అధికారులు తెలిపారు. యూరియా సమస్య రాజకీయ వివాదంగా మారింది. ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తున్నాయి. యూరియా కొరతకు కేసీఆర్ ప్రభుత్వమే కారణం అంటున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, రైతులు జీవితాలతో చెలగాటం ఆడిందని ఆరోపించాయి. అధికార పక్షం కూడా గట్టిగానే కౌంటర్ ఇస్తోంది. యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వమే కారణం అని అధికార పార్టీ నేతలు ఎదురు దాడికిదిగు

# నేడు సైన్స్ కాంగ్రెస్

సిద్దిపేట,సెప్టెంబర్5(ఆర్ఎన్ఎ): 27వ జిల్లా స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌ను 6న స్థానిక ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రవికాంతారావు, జిల్లా సైన్స్ అధికారి మహేందర్ ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ సంబంధిత ప్రదర్శన అంశం చార్ట్ రూపంలో, లాగ్ బుక్, 3 సెట్ల ప్రాజెక్టు అంశాలతో విద్యార్థి, గైడ్ టీచర్లు హాజరు కావాలన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.